నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ
జిల్లా
టాబ్లాయిడ్
వార్తల కోసం
10, 11పేజీలు
చూడండి.

సోమవారం 6.4.2020
• సంపుటి 9 • సంచిక 282 • వెల. రూ. 6.50

కరీంనగర్
పేజీలు : 12

త్రయోదశి

సూర్యోదయం: ఉదయం 6.05, సూర్యాస్తమయం: సాయంత్రం 6.26, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం త్రయోదశి మధ్యాహ్నం 3.52 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పుబ్బ మధ్యాహ్నం 12.17 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: ఉదయం 6.36 నుంచి 8.01 వరకు, రాహుకాలం: ఉదయం 7.37 నుంచి 9.10 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.51 నుంచి మధ్యాహ్నం 12.40 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.07 నుంచి 3.58 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.38 నుంచి 2.02 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి



స్ఫూర్తి దీపం వెలిగింది.. వెల్లువెత్తిన సమైక్యతా భావన వెలుగు దివిటీ పట్టింది. ప్రపంచాన్ని కకావికలంచేస్తున్న కరోనావైరస్‌పై సమరంలో ఒక్కతాటిపై ఉన్నానని యావత్ భారతావని దిగంతాలకు చాటిచెప్పింది. ప్రజారోగ్యం కోసం దేశవ్యాప్తంగా అహర్నిశలు పనిచేస్తున్న వైద్యసిబ్బందికి ఘనంగా సంఘీభావం ప్రకటించింది. ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో ఆదివారం రాత్రి సరిగ్గా 9 గంటలకు చిట్టిచేతుల చిన్నారులు మొదలుకుని బాధ్యతాయుత పౌరులు.. దేశనేతల దాకా అందరూ తొమ్మిది నిమిషాలపాటు వెలిగించిన దీపశిఖలు.. రక్కసి వైరస్‌పై సమరంలో సమిష్టితత్వాన్ని ప్రదర్శించాయి. కొందరు ఔత్సాహికులు పటాకులు కాల్చి వెలుగుపూలుజల్లారు. ఢిల్లీలో రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీతోపాటు పలువురు కేంద్రమంత్రులు, రాజకీయ ప్రముఖులు దీపాలు వెలిగించగా.. ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రగతిభవన్‌లో కొవ్వొత్తులు చేబూని సంఘీభావం ప్రకటించారు.

వైద్యుడికి అండగా

సిబ్బందికి పూర్తిస్థాయి రక్షణ పరికరాలు.. కరోనా లక్షణాలుంటే పరీక్షలు తప్పనిసరి

రోగుల సంఖ్య పెరిగినా చికిత్సకు సిద్ధం.. కార్యాచరణకు అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నివారణకు చేస్తున్న కృషిని మరింత అంకితభావంతో కొనసాగిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. రోగులకు వైద్యం అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని చెప్పారు. వ్యాధి లక్షణాలున్న ఏ ఒక్కరినీ వదులకుండా పరీక్షలు నిర్వహించి, వైద్యంచేస్తామని, వ్యాధి సోకినవారిని కలిసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి క్వారంటైన్ చేస్తున్నామని వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలులో ఉన్నప్పటికీ వరికోతలకు, ధాన్యం సేకరణకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కరోనా వ్యాప్తి నివారణ చర్యలు, ధాన్యం సేకరణ అంశాలపై ఆదివారం రాత్రి 10 గంటలవరకు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. 'కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే విషయంలో, వ్యాధి సోకినవారికి వైద్యం అందించే విషయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గొప్ప సేవలు అందిస్తున్నారు. వారి భద్రతకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. వారి ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేకచర్యలు చేపట్టింది. ప్రస్తుతం పరీక్షలకు, వైద్యానికి వస్తున్నవారికి సరిపడినంతగా టెస్ట్ కిట్లు, పీపీ ఈలు, మాస్కులు, ఇతర మందులు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో పేషెంట్ల సంఖ్య పెరిగినా, అందుకు అనుగుణంగా మాస్కులు, పీపీఈలు సేకరిస్తాం' అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆరోగ్య రక్షణ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సీఎమ్మారెఫ్‌కు వస్తున్న విరాళాలను కూడా వైద్య సిబ్బందికి అవసరమైన మాస్కులు, పీపీఈలు, మందుల కొనుగోలుకు వాడాలని ఆదేశించారు. భవిష్యత్తులో రోగులసంఖ్య పెరిగినా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సేవలు అందించడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి, అమలుచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, శాంతకుమారి, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరణ

సమస్యలు లేకుండా వరికోతలు.. గన్నీ బ్యాగుల కోసం ప్రధానికి ఫోన్

ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలులో ఉన్నప్పటికీ వరికోతలకు, ధాన్యం సేకరణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంలో వరికోతలు, ధాన్యం సేకరణపై సీఎం ఆదివారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. 'లాక్‌డౌన్ కారణంగా జనజీవనం స్తంభించింది. అయినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగవద్దని, వారు ఆర్థికంగా నష్టపోవద్దనే

మిగతా 2వ పేజీలో

కీర్తన్ అద్వితీ

సిటిజెన్ హీరోస్

- పెద్ద మనసు చాటుకున్న చిన్నారులు
- పాకెట్ మనీ పారిశుద్ధ్య కార్మికులకు..
- గురిగి డబ్బులూ సీఎంఆర్ఎఫ్‌కు విరాళం
- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ అభినందనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వయసులో చిన్నవాళ్లే అయినా గొప్ప మనసు చాటుకుంటున్నారు. కరోనాపై ప్రభుత్వం చేస్తున్న యుద్ధానికి తమవంతు సహాయంగా విరాళం ఇస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బాలుడు తన పాకెట్ మనీని పారిశుద్ధ్య కార్మికులకు అందజేయగా.. ఓ చిన్నారి బర్త్‌డే గిఫ్ట్ కోసం ఇచ్చిన డబ్బులను, మరో చిన్నారి తన గురిగిలోని సొమ్మును ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు. చిన్నారులందరికీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు పాకెట్‌మనీ అందజేసిన బాలుడ్ని ఉద్దేశించి 'తనే నా సిటిజెన్ హీరో' అంటూ

మిగతా 2వ పేజీలో

కోలుకొన్నవారి రక్తమే ఔషధం!

- అందులోని ప్లాస్మాతోనే కరోనాకు చికిత్స
- వందేండ్ల నాటి విధానంతో సత్ఫలితం
- పాత పద్ధతే మంచిదంటున్న వైద్యులు
- అమెరికాలో ప్లాస్మాసేకరణ ప్రారంభం
- మనదేశంలోనూ త్వరలోనే ప్లాస్మా సేకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న విశ్వమారిని తరిమికొట్టడానికి చిన్న ఆశాదీపం కనిపించింది. కొవిడ్-19కు ఔషధం కనిపెట్టడానికి జరుగుతున్న పరిశోధనలు ఫలితమిచ్చే సరికి మరికొంతకాలం పడుతుంది. ఇందుకోసం శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమిస్తున్నారు. అంతవరకు కరోనాను కట్టడిచేయడానికి వైద్యులకు తురుపుముక్క దొరికింది. వ్యాక్సిన్‌ను కనుక్కోవడానికి ముందుగా వైద్యనిపుణులు గతంలో ప్లాస్మా చికిత్స విధానాన్ని అనుసరించేవారు. ఇప్పుడు కరోనా రోగులపై కూడా ఇదే విధానాన్ని అనుసరించి ఆశించిన ఫలితాలు సాధిస్తున్నారు. మన శరీరంలో ప్రవహించే రక్తంలో ఉండే నీరంను ప్లాస్మా అంటారు. కరోనా సోకి.. కోలుకున్న

మిగతా 4వ పేజీలో

కరోనా గాలిద్వారా వ్యాపించదు!

న్యూఢిల్లీ: కరోనా వైరస్ గాలి ద్వారా సోకుతుందని వదంతులు వ్యాపిస్తున్నాయి. ప్రజలను భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) స్పందించింది. కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాపించదని ఐసీఎంఆర్ శాస్త్రవేత్త డాక్టర్ రమణ్ ఆర్ గంగాఖేడ్కర్ ఆదివారం స్పష్టంచేశారు. తుంపర్లు, ప్రత్యక్ష తాకిడి వల్ల మాత్రమే వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఒకవేళ గాలి ద్వారా సోకడం నిజమైతే, కరోనా రోగుల కుటుంబసభ్యులందరికీ కొవిడ్-19 సోకేదన్నారు. దవాఖానల్లో ఉన్న రోగులకు కూడా ఇదే సిద్ధాంతం వర్తిస్తుందన్నారు. కరోనా గాలి ద్వారా వ్యాపిస్తుందనడానికి తమ దగ్గర ఇప్పటివరకైతే ఎలాంటి ఆధారాలు లేవని గంగాఖేడ్కర్ చెప్పారు.

లాక్‌డౌన్ పొడిగింపుపై వదంతులు

5

80% తప్పుడు వార్తలే

సామాజిక మాధ్యమాలపై జనాభిప్రాయం

కొలువుల కోత

లాక్‌డౌన్ ఎఫెక్ట్స్

- వైరస్ కాటుకు విలవిల్లాడుతున్న కంపెనీలు
- ఉత్పత్తి లేక ఆదాయం కోల్పోయిన సంస్థలు
- సీఐఐ సర్వేలో పలు కంపెనీల సీఈవోల వెల్లడి

ప్రళయానికి ముందు నిశ్శబ్ద వాతావరణం ఉంటుంది. ప్రస్తుత లాక్‌డౌన్ తర్వాత కూడా పెను ప్రమాదమే ముంచుకు రానున్నది. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్.. భారత్‌లోనూ బీభత్సం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ మహమ్మారి కట్టడికి ప్రయోగిస్తున్న లాక్‌డౌన్ ఆయుధం.. లక్షలమంది ఉద్యోగులకు శరాఘాతమవుతున్నది. మునుపెన్నడూ లేని సంక్షోభంతో కుదేలైన వ్యాపార, పారిశ్రామిక రంగాలు వ్యయ నియంత్రణ బాట పడుతున్నాయి. ఈ విరామ సమయంలో ఉత్పత్తి లేక ఆదాయం కోల్పోయిన ఎన్నో సంస్థలు.. ఉద్యోగుల మెడపై కరోనా కత్తిని ఉంచబోతున్నాయి. సీఐఐ తాజాగా నిర్వహించిన సర్వేలో మెజార్టీ కంపెనీల సీఈవోలు ఇదే చెప్పారు. లాక్‌డౌన్ తర్వాత పెద్ద ఎత్తున ఉద్యోగుల తీసివేత ఉండవచ్చన్న సంకేతాలనిచ్చారు. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో ఆదాయం, లాభాలు పెద్ద ఎత్తునే పడిపోవచ్చన్న సీఈవోలు.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని అంటున్నారు.

12

రానున్న రెండువారాలు గడ్డుకాలం

- భారీగా మరణాలు సంభవించవచ్చు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక
- హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఎగుమతి చేయాలని భారత్‌కు విజ్ఞప్తి
- న్యూయార్క్‌కు 1000 వెంటిలేటర్లు పంపిన చైనా

5

పాక్‌కు చైనా అండర్‌వేర్ మాస్కులు

ఇస్లామాబాద్: చిరకాల మిత్రదేశం పాకిస్థాన్‌ను సైతం చైనా మోసపుచ్చింది. కరోనా వైరస్ నేపథ్యంలో టెస్టింగ్ కిట్‌లు, నాణ్యమైన ఎన్-95 మాస్కులు అందిస్తామని ఆ దేశానికి హామీ ఇచ్చిన చైనా.. చివరకు అండర్‌వేర్లతో తయారుచేసిన మాస్కులను పంపించింది. చైనా తమను మోసం చేసిందని స్థానిక వార్తాచానల్ పేర్కొంది. సింధ్ రాష్ట్ర అధికారులు వాటిని తనిఖీ చేయకుండానే కరాచీలోని దవాఖానకు తరలించినట్లు తెలిపింది. మొత్తంగా చైనా 2 లక్షల సాధారణ మాస్కులు, 2 వేల ఎన్-95 మాస్కులు, 5 వేల వెంటిలేటర్లు, 2 వేలు టెస్టింగ్ కిట్‌లు, 2 వేలు ప్రొటెక్టివ్ దుస్తులను పాక్‌కు పంపింది.

ప్రపంచవ్యాప్తంగా
మొత్తం కేసులు: **12,58,091**
మరణాలు: **68,287**
కోలుకున్నవారు: **2,59,554**

దేశం	కేసులు	మృతులు
అమెరికా	3,28,662	9,365
స్పెయిన్	1,30,759	12,418
ఇటలీ	1,28,948	15,887
జర్మనీ	99,862	1,550
ఫ్రాన్స్	89,953	7,560



దేశంలో కేసులు: **4,111**
మృతులు: **126**
కోలుకున్నవారు: **315**

రాష్ట్రంలో కేసులు: **334**
మృతులు: **11**
కోలుకున్నవారు: **33**

రాపిడ్ యాంటీ బాడీ టెస్టులు

- కేసుల ముందస్తు గుర్తింపునకు కరోనా హాట్‌స్పాట్లలో పరీక్షలు

2

- రాష్ట్రాలకు ఐసీఎమ్మార్ ఆదేశాలు

epaper.ntnews.com

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం		గరిష్ఠం	కనిష్ఠం
హైదరాబాద్	36.7°c	23.1°c	మెదక్	35.9°c	20.1°c
కరీంనగర్	37.0°c	26.0°c	ఆదిలాబాద్	37.3°c	21.3°c
వరంగల్	34.5°c	21.5°c	నిజామాబాద్	38.4°c	25.7°c
రంగారెడ్డి	36.0°c	24.0°c	మహబూబ్‌నగర్	38.4°c	25.7°c
నల్లగొండ	39.2°c	23.4°c	ఖమ్మం	39.0°c	25.0°c

జగ్జీవన్‌రాం కృషి గొప్పది

నివాళులర్పించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆయన సేవలను స్మరించుకున్నారు. దేశంలో సామాజిక న్యాయ సాధనకు జగ్జీవన్‌రాం గొప్ప కృషిచేశారని కొనియాడారు. ఆదివారం ఆయన 113వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

రుక్కమ్మకు బియ్యం అందజేస్తున్న సిబ్బంది

వృద్ధురాలికి అభయహస్తం

ట్వీట్‌కు స్పందించి సమస్య పరిష్కరించిన మంత్రి కేటీఆర్

మునగాల: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు రేషన్ కూడా రాక ఇబ్బందులు పడుతున్నదని ట్విట్టర్ ద్వారా తెలుసుకున్న మంత్రి కేటీఆర్ ఆమె సమస్యకు పరిష్కారం చూపారు. సూర్యాపేట జిల్లా మునగాలకు చెందిన పిండిప్రోలు రుక్కమ్మ ఒంటరిగా జీవిస్తున్నదని, రేషన్, పింఛన్ అందడం లేదని, ఇల్లు కూడా లేదని, సాయంచేయాలంటూ శ్రీకాంత్ కృష్ణ అనేవ్యక్తి శనివారం కేటీఆర్‌కు ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేశాడు. స్పందించిన మంత్రి సమస్యను వృద్ధురాలిని ఆదుకోవాలని జిల్లా పాలనా అధికారికి ఆదేశాలు జారీచేశారు. అధికారులు ఆదివారం రుక్కమ్మకు 24కిలోల బియ్యం అందజేశారు. ఆమెకు బియ్యం అందించిన ఫొటోను కేటీఆర్ ఆఫీస్ నుంచి శ్రీకాంత్ కృష్ణకు పోస్ట్‌చేశారు.

థ్యాంక్స్ ప్రేమ్‌జీ

విప్రో కంపెనీ చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీకి మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. 'తెలంగాణ రాష్ట్రానికి రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందిస్తున్నందుకు థ్యాంక్స్ విప్రో.. చైర్మన్ ప్రేమ్‌జీ' అంటూ ట్వీట్‌చేశారు.

సిటిజెన్ హీరోస్

మొదటిపేజీ తరువాయి...

ట్వీట్‌చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోచారానికి చెందిన ఎంపీపీ కృపేష్ కుమారుడు కీర్తన్ తన పాకెట్‌మనీతో పోచారం పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు 13 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందజేశారు. మాస్కులు పంపిణీ చేశారు. టీఆర్ఎస్ ఎన్నారై కువైట్ అధ్యక్షురాలు అభిలాష, సురేశ్‌గౌడ్ కూతురు మిషిత తనకు పుట్టినరోజు బహుమతి వద్దని.. రూ.10 వేలు సీఎంఆర్ఎఫ్‌కు అందజేయాలని కోరింది. మిషిత సాయాన్ని మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా అభినందిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పదేండ్ల తన్వీ.. తన పాకెట్‌మనీ రూ.10 వేలను విరాళంగా ఇచ్చిందంటూ బాలిక తండ్రి అరవింద్‌రెడ్డి ట్విట్టర్‌లో తెలుపగా.. తన్వీకి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు. గల్ల గురిగిలో దాచుకున్న డబ్బును సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా ఇచ్చిన అద్వితను కూడా అభినందించారు.

రూ.25 లక్షలు ప్రకటించిన మంత్రి పువ్వాడ

సీఎంఆర్ఎఫ్‌కు మమత వైద్యవిద్యాసంస్థ చైర్మన్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రూ.25 లక్షల విరాళం ప్రకటించారు.

లోకం పోకడ

ఆస్తిలో డబ్బలు తక్కువైనా పర్వాలేదు గానీ, శానిటైజర్లు మాత్రం నాకు ఎక్కువే కావాలి నాన్నగారూ!



ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న పోకర్న్ గ్రూప్ చైర్మన్ గౌతమ్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న నాష్‌లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ బీఎస్ఎన్‌రెడ్డి, డైరెక్టర్ వీవీఎస్‌రెడ్డి. చిత్రంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఉన్నారు.

కరంటోళ్లకు కంగ్రాట్స్

- డిమాండ్ తగ్గినా గ్రిడ్ సురక్షితం
- 1500 మెగావాట్లు పడిపోయిన డిమాండ్
- అయినప్పటికీ వ్యూహాత్మకంగా బ్యాలెన్స్
- విద్యుత్‌శాఖకు సీఎం కేసీఆర్ అభినందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌పై పోరుకు సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి లైట్లు ఆర్పేసినా విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండాచేసిన విద్యుత్‌శాఖను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభినందించారు. అంచనావేసిన దానికన్నా భారీగా డిమాండ్ పడిపోయినప్పటికీ, వ్యూహాత్మకంగా బ్యాలెన్స్‌చేయగలిగారని జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతోపాటు ఇతర డైరెక్టర్లు, ఇంజినీర్లకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

ఆదివారం రాత్రి 9 గంటలకు ఒకేసారి విద్యుత్ దీపాలు ఆర్పినప్పటికీ ఉత్పత్తి- సరఫరా మధ్య సమతూకాన్ని సాధించిన విద్యుత్‌సౌధలోని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌లో సిబ్బందిని అభినందిస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

సమతూకం సాధించడంలో విజయం

రాష్ట్రంలో ఆదివారం రాత్రి 9 గంటలకు ఒకేసారి విద్యుత్ దీపాలు ఆర్పేసినప్పటికీ విద్యుత్‌శాఖ పక్కావ్యూహంతో వ్యవహరించడంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాలేదు. విద్యుత్ వినియోగంలో ఒకేసారి భారీ మార్పులు సంభవించినప్పటికీ ఉత్పత్తి-సరఫరా మధ్య పూర్తిస్థాయి సమతూకాన్ని సాధించడంలో జెన్‌కో, ట్రాన్స్‌కో విజయం సాధించాయి. విద్యుత్ గ్రిడ్‌కు ఎలాంటి నష్టం కలుగకుండా చూసేందుకు విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు ఆదివారం ఉదయం నుంచి విద్యుత్‌సౌధలోని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్డీసీ) లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాత్రి 9 గంటల వరకు 7,300 మెగావాట్లున్న విద్యుత్ డిమాండ్.. తర్వాత ఒక్కసారిగా లైట్లు ఆర్పివేయడంతో 5,800 మెగావాట్లకు పడిపోయింది. తగ్గిన 1,500 మెగావాట్ల డిమాండ్‌ను మెయిన్‌టెయిన్ చేసేందుకు నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్ల వద్ద రివర్స్ పంపింగ్ నిర్వహించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పరిధిలో 120 మెగావాట్ల సామర్థ్యంతో పంపింగ్ కొనసాగించారు. రాత్రి 9 గంటల 9 నిమిషాల తర్వాత రాష్ట్ర ప్రజలంతా మళ్లీ విద్యుత్ దీపాలను వెలిగించగానే రివర్స్ పంపింగ్‌ను నిలిపివేశారు. దీంతో గ్రిడ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఈ ప్రక్రియను ట్రాన్స్‌కో డైరెక్టర్లు టీ నర్సింగ్‌రావు, జగత్‌రెడ్డి, సూర్యప్రకాశ్, జెన్‌కో డైరెక్టర్లు సచ్చిదానందం, లక్ష్మయ్య పర్యవేక్షించారు. దీపజ్వలనకు ముందు దేశవ్యాప్తంగా 1,17,300 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ ఆదివారం రాత్రి 9 గంటల తర్వాత 85,300 మెగావాట్లకు పడిపోయింది. దీంతో విద్యుత్ ఫ్రీక్వెన్సీని 49.7 హెర్ట్జ్ నుంచి 50.26 హెర్ట్జ్ మధ్య కొనసాగించడంతో దేశవ్యాప్తంగా పవర్‌గ్రిడ్‌లకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు.

పకడ్బందీగా ధాన్యం సేకరణ

మొదటిపేజీ తరువాయి...

ఉద్దేశంతో ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలుచేయాలని నిర్ణయించింది. మార్కెట్లలో రద్దీని నివారించడానికి గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది. వరికోతలు, ధాన్యంసేకరణ పూర్తిస్థాయిలో జరగాలి. వరికోతలకు రైతులు హార్వెస్టర్లు ఉపయోగించే పరిస్థితిని గ్రామాల్లో కల్పించాలి. హార్వెస్ట్ పరికరాలను బిగించే మెకానిక్‌లకు ప్రత్యేక పాసులిచ్చి అనుమతించాలి. స్పేర్‌పార్టులు అమ్మే షాపులను తెరవడానికి అనుమతివ్వాలి. గ్రామస్థులు తమ గ్రామాల్లోకి హార్వెస్టర్లను రానివ్వాలి. తర్వాత ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే వాహనాలకు అనుమతివ్వాలి. కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు ఒకేసారి రాకుండా చూడాలి. వారికిచ్చిన కూపన్లలో పేర్కొన్న తేదీ ప్రకారమే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా రైతులను చైతన్యపరచాలి. కొనుగోలు కేంద్రాల వద్ద కావాల్సిన ఏర్పాట్లుచేయాలి. రైతుల దగ్గర్నుంచి చివరి గింజ వరకు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది కాబట్టి రైతులెవరూ తొందరపడొద్దు' అని ముఖ్యమంత్రి కోరారు.

గన్నీ బ్యాగుల కోసం ప్రధానికి సీఎం కేసీఆర్ ఫోన్

రాష్ట్రంలో గన్నీ బ్యాగులకు తీవ్ర కొరత ఉన్నది. గన్నీ బ్యాగులు తయారుచేసే పరిశ్రమలు పశ్చిమబెంగాల్‌లో ఉన్నాయి. ప్రతి ఏటా అక్కడి నుంచే బ్యాగులు వస్తాయి. ఈసారి లాక్‌డౌన్ కారణంగా బెంగాల్లో పరిశ్రమలు మూతపడటంతో గన్నీ బ్యాగులకు కొరత ఏర్పడింది. రాష్ట్రంలో ధాన్యం సేకరణకు 20 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం. ఈ విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఫోన్లో మాట్లాడారు. పశ్చిమబెంగాల్లో గన్నీ బ్యాగుల తయారీ పరిశ్రమలను తెరిపించాలని, గన్నీ బ్యాగులు రాష్ట్రాలకు చేరుకోవడానికి ప్రత్యేక రైళ్లను అనుమతించాలని అభ్యర్థించారు. దీనికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రానికి గన్నీ బ్యాగులు చేరుకునే విషయంలో సంబంధిత శాఖలతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, పౌరసరఫరాలసంస్థ కమిషనర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముందే మేల్కొన్నాం

- కరోనా వైరస్ కట్టడికి సత్వర చర్యలు
- లాక్‌డౌన్ పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ
- రాష్ట్రంలోని పేదలు, వలస కూలీలకు బియ్యం, నగదు పంపిణీచేస్తున్నాం
- కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి వివరించిన సీఎస్ సోమేశ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొవిడ్-19 నియంత్రణ కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో సత్వరమే స్పందించి ముందస్తు చర్యలు చేపట్టారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఢిల్లీ నుంచి కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, ఆరోగ్య శాఖ కార్యదర్శులతోపాటు కరోనా కేసులు ఎక్కువగా ఉన్న జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. మార్చి 22వ తేదీ నుంచి లాక్‌డౌన్ సమయంలో పరిస్థితిని పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని, వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ప్రజలను గుర్తించి వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించామని వివరించారు. ముఖ్యంగా వలస ప్రజలకు రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, రూ.500 నగదు ఇచ్చామని తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న పేద ప్రజలకు 12 కిలోల బియ్యం, రూ.1,500 నగదు పంపిణీని ప్రారంభించామని చెప్పారు. హైదరాబాద్‌లో 70 ఫుడ్ పాయింట్లు ఏర్పాటు చేసి నిలువ నీడ లేని ఆరువేల మంది పేదలకు భోజనం అందజేస్తున్నామన్నారు. ఈ సమయాల్లో కరోనా వైరస్ నివారణకు ప్రజలు నిర్ణీత దూరాన్ని పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2,200 మందిని ప్రభుత్వ క్వారంటైన్లలో ఉంచి నిత్యం ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మరో 27 వేల మందిని హోం క్వారంటైన్‌లో ఉంచామని, వీరిని రోజుకు రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటుచేసిన బృందాలు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నాయని వివరించారు. కరోనా కేసులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అధికంగా కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్టు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్‌తోపాటు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కుటుంబసంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

మీ భద్రత మా బాధ్యత

వైద్యులకు పోలీసుల భరోసా

- రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లతో కలిసి పోలీసుల వాట్సాప్ గ్రూప్‌లు
- అన్నిస్థాయిల అధికారుల రక్షణ పర్యవేక్షణకు డీజీపీ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అత్యంత ప్రమాదకర పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులు, పారామెడికల్, ఇతర వైద్యసిబ్బందిపై దాడులను పోలీస్‌శాఖ సీరియస్‌గా తీసుకుంది. వారిపై దాడులకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక వ్యూహం రచించింది. కరోనా కట్టడికి నిరంతరం పనిచేస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బందికి 24 గంటలపాటు భద్రత కల్పించాలని పోలీస్ అధికారులను డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదివారం ఆదేశించారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు, వైద్యసిబ్బంది, పోలీస్ అధికారులతో కలిపి రాష్ట్ర, కమిషనరేట్, జిల్లా, డివిజన్, సర్కిల్, పోలీస్‌స్టేషన్‌వారీగా వాట్సాప్‌గ్రూప్‌లు ఏర్పాటుచేయాలని సూచించారు. గ్రూప్‌లో తమ పరిధిలోని డాక్టర్లు, వైద్యసిబ్బందిని చేర్చాలని సూచించారు. అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు తమ పరిధిలోని వైద్యశాఖ ఉన్నతాధికారులతో టచ్‌లో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులు తెలుసుకోవాలని ఆదేశించారు. 'కొవిడ్-19ను ఎదుర్కొనేందుకు అవిశ్రాంతంగా పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందికి సెల్యూట్. వారి రక్షణకు పోలీస్‌శాఖ పూర్తి భరోసానిస్తుంది. వైద్యసిబ్బంది, పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ప్రజలను పోలీస్‌శాఖ తరపున కోరుతున్నా' అని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.

రాపిడ్ యాంటీ బాడీ టెస్టులు

- ముందస్తు గుర్తింపునకు హాట్‌స్పాట్లలో పరీక్షలు
- కరోనాపై రాష్ట్రాలకు ఐసీఎమ్మార్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాకేసులు అధికంగా నమోదయ్యే ప్రాంతాల్లో (హాట్‌స్పాట్లు) రాపిడ్ యాంటీ బాడీ బేస్డ్ రక్తపరీక్షలు నిర్వహించాలని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎమ్మార్) ఆదేశించింది. తద్వారా కరోనా కేసులను ముందస్తుగా గుర్తించి నియంత్రించవచ్చని తెలిపింది. పరీక్షల సమయంలో ఆరోగ్యసిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గదర్శకాలను కూడా విడుదలచేసింది. గొంతు, ముక్కు వద్ద రక్త నమూనాలు సేకరించే సమయంలో సిబ్బంది అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించింది. రాపిడ్ యాంటీ బాడీ టెస్టులను ఐసీఎమ్మార్-ఎన్ ఐవీ, యూఎస్-ఎఫ్‌డీఏ ఆమోదించినట్టు తెలిపింది. పరీక్షల వివరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు రియల్ టైం డాటాలో పొందుపరచాలని పేర్కొన్నది. టెస్ట్‌చేసిన తర్వాత పాజిటివ్‌వస్తే బాధితులను దవాఖానకు తరలించి చికిత్స అందించాలని తెలిపింది. ఒకవేళ నెగెటివ్‌వస్తే వారికి ఆర్టీ పీసీఆర్ పరీక్ష నిర్వహించాలని, పాజిటివ్ అని తేలితే ఏకాంతవాసంలో ఉంచాలని పేర్కొన్నది. ఒకవేళ ఆర్టీ పీసీఆర్‌లో కూడా నెగెటివ్‌వస్తే పదిరోజుల తర్వాత మరోసారి యాంటీ బాడీ టెస్ట్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇలా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి కరోనా కేసులను ముందస్తుగా గుర్తించాలని ఐసీఎమ్మార్ రాష్ట్రాలను ఆదేశించింది.

ఆస్ట్రేలియాలో విద్యార్థులకు కష్టాలు

- అద్దె, నిత్యావసరాలకు చాలని డబ్బులు
- పార్ట్‌టైం ఉపాధి కోల్పోవడంతో ఇబ్బందులు
- కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ పర్యవసానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా లాక్‌డౌన్.. విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రాణసంకటంగా మారింది. ముఖ్యంగా ఆస్ట్రేలియాలో ఉన్నత చదువుల కోసం వెళ్లినవారికి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటివరకు వారిని ఆదుకొంటూ వస్తున్న పార్ట్‌టైం ఉద్యోగాలు పోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇంటి అద్దె, నిత్యావసరాలకు డబ్బులు లేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆఖరుకు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ రీచార్జి వంటివి కూడా పెనుభారంగా మారాయి. అధికారిక లెక్కల ప్రకారం 2019లో ఆస్ట్రేలియాకు ఉన్నత చదువుల కోసం వెళ్లిన వారు దాదాపు 5.45 లక్షల మంది ఉన్నారు. ఇందులో 75 వేల మంది మన దేశం నుంచి వెళ్లారు. ఇరవై వేల మంది వరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆస్ట్రేలియాకు వెళ్లారు. వీళ్లలో 70 శాతం మంది పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూనే చదువుకొంటుంటారు. ఆస్ట్రేలియా చట్టాల ప్రకారం వారానికి ఇరవై గంటలపాటు పార్ట్‌టైం ఉద్యోగాలు చేయవచ్చు. ఇలా పనిచేసే వారు వారానికి కనీసంగా 250 నుంచి 400 డాలర్ల వరకు సంపాదిస్తుంటారు. సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్ లాంటి ప్రధాన నగరాల్లో ఇంటి అద్దె (ట్రిపుల్ బెడ్‌రూం) 400 నుంచి 500 డాలర్ల వరకు ఉంటుంది. శివారు గ్రామాలు, నగరాలకు కాస్త దూరంగా ఉండే ఇండ్లకు అద్దె వంద డాలర్ల వరకు ఉంటుంది. అందులోనూ ముగ్గురు మాత్రమే ఉండాలి. అద్దెను తగ్గించుకోవడానికి ఇద్దరు ముగ్గురు కలిసి గదులను షేర్ చేసుకొంటుంటారు. తాము సంపాదించుకొన్న మొత్తంతో నిత్యావసరాలు, సెల్, నెట్, రవాణా ఖర్చులను వెళ్లదీస్తుంటారు. కరోనా లాక్‌డౌన్ వల్ల అన్నీ నిలిచిపోవడంతో వీరందరూ ఉపాధి కోల్పోయారు. జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ముఖ్యంగా యువతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అవసరమైతే వెళ్లిపోతాం

సూపర్‌మార్కెట్లకు వెళ్తే సరుకులు లేక ఖాళీగా ఉన్నాయని కొందరు విద్యార్థులు వాపోతున్నారు. పరిస్థితులు చక్కబడేవరకు స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడమే ఉత్తమమనే అభిప్రాయమూ వారిలో వ్యక్తమవుతున్నది. కొందరు విద్యార్థులు అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులను కలిసి విజ్ఞప్తిచేస్తున్నారు. స్థానిక యాక్టింగ్ ఇమ్మిగ్రేషన్ మినిస్టర్ అలన్ టుడ్జ్ సానుకూలంగా స్పందించారని కూడా చెప్తున్నారు. విద్యార్థులెవరైనా దరఖాస్తు చేసుకొంటే.. ఆయా దేశాలతో మాట్లాడి ప్రత్యేక విమానాల ద్వారా పంపించే అవకాశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు స్థానిక సంస్థలు, దాతలు, సంఘాల ప్రతినిధులను సంప్రదిస్తున్నారు.

అమ్మాయికి కష్టాలు

కొద్దిరోజుల క్రితం ఉత్తర తెలంగాణ నుంచి ఒక యువతి ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌కు ఉన్నత చదువుల కోసం వెళ్లింది. చదువుకొంటూనే.. అక్కడ తెలిసినవారి సహాయంతో సమీపంలో ఉన్న బర్గర్ సెంటర్‌లో పార్ట్‌టైం ఉద్యోగం సంపాదించుకొన్నది. ఇలా కష్టపడుతూ.. వారానికి 350 డాలర్ల వరకు సంపాదించేది. ఆ డబ్బుతో ఇంటిఅద్దె, నిత్యావసరాలు, నెట్, సెల్ బిల్లు భారం తప్పేది. ఇప్పుడు కరోనా కారణంగా.. బర్గర్ సెంటర్ మూతపడింది. ఉన్న తాత్కాలిక ఉపాధికూడా పోయింది. బ్రిస్బేన్‌కు సుమారు 170 కి.మీ దూరంలో నివసిస్తున్న ఆ యువతి ఇంటి అద్దెకు, నిత్యావసరాలకు కష్టాలు తప్పట్లేదు.

సాయంచేస్తున్నాం

నిత్యావసరాలు కావాలంటే, నన్ను సంప్రదించాలని కోరా. గత శుక్రవారం 70 ఫోన్‌కాల్స్ వచ్చాయి. విద్యార్థులు ఇంటి అద్దెకోసం ఆర్థిక సహాయంచేయాలని కోరారు. స్థానిక సంస్థలు, సంఘాలు, దాతలకు సమాచారం చేరవేస్తున్నాం. బ్రిస్బేన్ చుట్టుపక్కల 150 కిలోమీటర్ల మేర వెళ్లి విద్యార్థులకు నిత్యావసరాలను అందిస్తున్నాం. అవసరమైతే స్వదేశాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో చదువుకొనే అవకాశం కల్పిస్తున్నాయి.

- శ్రీకర్‌రెడ్డి అండెం,
తెలంగాణ జాగృతి
ఆస్ట్రేలియాశాఖ అధ్యక్షుడు

గురుకుల సీవోఈ కాలేజీల్లో

ప్రవేశాల రద్దు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియను రద్దుచేసినట్టు ఆ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీవోఈ కాలేజీల్లో ఈ నెల 8న ప్రవేశాలు చేపట్టాల్సి ఉండగా.. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రద్దుచేశామని పేర్కొన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి
meesevasupport@telangana.gov.in
ఖాతా నంబర్ : 62354157651
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.
వాట్సాప్: 9121006471 / 9121006472
https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి

ప్రగతిభవన్ ఆవరణలో జ్యోతులు వెలిగించి కరోనాపై పోరుకు సంఘీభావం తెలుపుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ సంతోష్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జ్యోతి వెలిగించి సంఘీభావం తెలుపుతున్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ, కోడలు శైలిమ, మనుమడు హిమాన్షు, మనుమరాలు అలేఖ్య తదితరులు

కొవ్వొత్తులతో స్పీకర్ పోచారం దంపతులు .. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దీపాలు వెలిగించిన మాజీ ఎంపీ కవిత, ఆమె భర్త అనీల్, కుమారులు

భార్య, కుమార్తెతో కలిసి దీపాలు వెలిగించిన ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు

కుటుంబసభ్యులతో కలిసి దీపాలు వెలిగించిన సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

భార్యతో కలిసి జ్యోతులు వెలిగించిన విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

కుటుంబంతో కలిసి కొవ్వొత్తులు వెలిగించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

తన నివాసంలో దీపాలను వెలిగించిన సీపీఐ నేత నారాయణ

వెలుగులీనిన తెలంగాణ

- కరోనాపై పోరుకు సంఘీభావం
- ప్రగతిభవన్‌లో దీపాలు వెలిగించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంపై అలుముకొన్న కరోనా చీకట్లను పారదోలడానికి సంఘీభావ సంకేతంగా సీఎం కే చంద్రశేఖర్‌రావు దీపాలు వెలిగించారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు కొవ్వొత్తి వెలిగించి కరోనాపై పోరాడుతున్నవారికి సంఘీభావం ప్రకటించారు. సీఎంతోపాటు మంత్రి ఈటల రాజేందర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎంపీ సంతోష్‌కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి నర్సింగ్‌రావు, ఏజీ ప్రసాద్, అదనపు ఏజీ రాంచందర్‌రావు పాల్గొన్నారు. సీఎం నివాసంలో ముఖ్యమంత్రి సతీమణి శోభ, మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ, కొడుకు హిమాన్షు, కూతురు అలేఖ్య దీపాలు వెలిగించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తన కుటుంబసభ్యులతో కలిసి జ్యోతులను వెలిగించారు. సిమ్లాలోని రాజ్‌భవన్‌లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దీపాలు వెలిగించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తమ నివాసాల్లో దీపాలు వెలిగించి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబిత, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి, తలసాని, కొప్పుల, మహమూద్‌అలీ, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తమ నివాసాల్లో కుటుంబసభ్యులతో కలిసి దీపాలు వెలిగించారు. రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఢిల్లీలోని తన నివాసంలో దీపాలు వెలిగించి సంఘీభావం తెలిపారు.

ఎంపీ కవిత ట్వీట్

ప్రధాని మోదీ పిలుపు మేరకు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో దీపాలు వెలిగించారు. కుటుంబసభ్యులతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అని ట్వీట్‌చేశారు. కొవ్వొత్తులు వెలిగించిన ఫొటోను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు.

దీపకాంతుల్లో విశాఖ శారదా పీఠం

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ శారదాపీఠం ప్రాంగణం దీపకాంతులతో వెలిగిపోయింది. కరోనాపై ఐక్యతను చాటే కార్యక్రమంలో భాగంగా శారదాపీఠం ఉత్తరాధికారి స్వామి స్వాత్మానందేంద్ర జ్యోతిని వెలిగించారు. పీఠానికి చెందిన వేద విద్యార్థులంతా జ్యోతులను వెలిగించి కాగడాలను ప్రదర్శించారు.



'వైరల్ లోడ్' ప్రమాదకరం

- కరోనా నివారణకు నిర్ణీత దూరం ఒక్కటే పరిష్కారం
- ట్రాక్, ట్రేస్, ట్రీట్ విధానం అనుసరణీయం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్
- అంతర్జాతీయ వైద్యనిపుణులు శ్రీనాథ్‌రెడ్డి, మూర్తితో చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌ను మరింత వ్యాపింపజేస్తున్న 'వైరల్ లోడ్' అత్యంత ప్రమాదకరమని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. నిర్ణీత దూరాన్ని పాటించడం ద్వారా మరింత వ్యాప్తి చెందకుండా అడ్డుకోవచ్చునని సూచించారు. కరోనా వైరస్ అంశంపై అంతర్జాతీయ వైద్యనిపుణుడు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే శ్రీనాథ్‌రెడ్డి, ఆ సంస్థ సౌతిండియా డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ మూర్తితో వినోద్‌కుమార్ ఆదివారం సుదీర్ఘంగా చర్చించారు. శ్వాస, గొంతు సమస్యలు, జ్వరం వంటి లక్షణాలున్న వ్యక్తి వద్దకు రాకపోకలు సాగిస్తే ఆయనలోని వైరస్ ఇతరులకు సోకి 'వైరల్ లోడ్'గా పరిణమిస్తుందన్న విషయాన్ని వైద్యనిపుణులు నిర్ధారించారని తెలిపారు. కొవిడ్-19 లక్షణాలున్న వ్యక్తితో ఆయన కుటుంబసభ్యులు కలిసినా, శుభకార్యాలు, సమావేశాలు, మతపరమైన కార్యక్రమాల్లో గుమిగూడినా 'వైరల్ లోడ్'కు కారకులవుతారన్నారు. కఠిన స్వీయ నియంత్రణ, నిర్ణీత దూరం పాటించడం వంటి పద్ధతులు శ్రేయస్కరమని పేర్కొన్నారు. మరో రెండునెలలు నిర్ణీత దూరం పాటించేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవడం చాలా ఉత్తమమని అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ట్రాక్-ట్రేస్-ట్రీట్ విధానాన్ని విధిగా అమలుచేస్తే అందరూ ఆరోగ్యవంతులుగా తయారవుతారని చెప్పారు.

క్రియాశీలంగా తెలంగాణ: డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

కొవిడ్-19 నియంత్రణలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగా క్రియాశీల కార్యాచరణకు శ్రీకారం చుట్టిందని వైద్యనిపుణుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ప్రశంసించారు. కరోనా కట్టడిలో సీఎం కే చంద్రశేఖర్‌రావు దేశానికే దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని ప్రజలకు ఆయన సూచించారు.

గుండెపై తీవ్ర ప్రభావం

- కొవిడ్ 19 వైరస్‌తో రక్త ప్రసరణ స్తంభన
- 17 శాతం మరణాలకు గుండె వైఫల్యమే కారణం
- కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు

డాక్టర్ మాట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారి మనిషి గుండెపై దాడిచేస్తుందన్నది వాస్తవమేనని స్టార్ దవాఖాన కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా చెప్పారు. అది శ్వాస సంబంధ వ్యవస్థను గుండె నాళాలను కూడా దెబ్బతీస్తుందన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పలు అంశాలపై తన అభిప్రాయాలను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. కొవిడ్-19 ముఖ్యంగా న్యుమోనైట్స్ టైప్-2పై, మయోసైట్స్‌పై నేరుగా ప్రభావం చూపుతుందని చెప్పారు. ఫలితంగా గుండె నుంచి రక్తప్రసరణ ప్రక్రియ మందగిస్తుందని, గుండె స్పందనలో మార్పు వస్తుందని తెలిపారు. కరోనా రోగుల్లో 15-17 శాతం మంది గుండె దెబ్బతినడం వల్లనే మరణించినట్టు తన విశ్లేషణలో తేలిందని చెప్పారు. అందువల్ల సాధారణ వ్యక్తులకంటే హృద్రోగులు కరోనా వల్ల మరణించే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. వృద్ధులు, స్టంట్లు వేసుకున్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కరోనా వైరస్, లాక్‌డౌన్ తదితర అంశాలపై ఆయన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి..

వైరస్‌లో మార్పులు జరుగుతాయి

కొవిడ్-19 ఒక వైరస్ అయినప్పటికీ, దాని సమూహంలో తేడాలుంటాయి. అది పుట్టినప్పటినుంచి ఒక్కో వ్యక్తి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతున్న దశలో వైరస్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. తీవ్రత స్థాయిలో కూడా పరివర్తన ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలను బట్టి మరో ఆరునెలల్లో కరోనాకు వ్యాక్సిన్ వస్తుందని ఆశాభావం కలుగుతున్నది. ఇతర దేశాలతో పోలిస్తే మన వద్ద జరుగుతున్న పరిశోధనల స్థాయి తక్కువే. ఇందుకు ప్రభుత్వపరంగాను, వైద్యపరంగానూ లోపాలున్నాయి. పరిశోధనలు సీసీఎంబీ వంటి సంస్థల్లోనే జరుగాలన్న నిబంధనలున్నాయి. పేరున్న వైద్య నిపుణులకు ప్రభుత్వపరంగా అవసరమైన పరికరాలు, సపోర్టింగ్ సిబ్బందిని సమకూరిస్తే మన దేశంలో కూడా పరిశోధనల విస్తృతి పెరుగుతుంది.

290 మందికి చికిత్స

- ఆదివారం 62 మందికి పాజిటివ్
- ప్రజారోగ్యశాఖ బులెటిన్‌లో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రాష్ట్రంలో కరోనాకు వైద్యసేవలు అందిస్తున్న దవాఖానల్లో ఆదివారం 290 మందికి వైద్యసేవలు అందిస్తున్నట్టు తెలంగాణ ప్రజారోగ్యశాఖ ప్రత్యేక బులెటిన్ ద్వారా వెల్లడించింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 334 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, 33 మంది వైరస్ నెగెటివ్‌గా రావడంతో డిశ్చార్జి అయినట్టు తెలిపింది. ఆదివారం ఒక్కరోజు 62 కేసులు వచ్చినట్టు పేర్కొన్నది. మర్కజ్ వెళ్లి వచ్చినవారిని, వారి కుటుంబసభ్యుల్లో కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేస్తున్నట్టు, పాజిటివ్ వచ్చిన వ్యక్తులు కలిసిన (కాంటాక్ట్) వారిని గుర్తించడంపై సర్వైలెన్స్ బృందాలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు వెల్లడించింది. కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో, వ్యాధి సోకినవారికి వైద్య అందించడంలో వైద్య, ఆరోగ్యశాఖలో అన్ని విభాగాల సిబ్బంది గొప్పగా కృషిచేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రస్తుతం పరీక్షలకు, వైద్యానికి వస్తున్న వారికి సరిపడినంత టెస్ట్ కిట్లు, పీపీఈలు, మాస్కులు, ఇతర వస్తువులు, మందులను అందుబాటులో ఉంచినట్లు మంత్రి ఈటల వివరించారు.

రాష్ట్రంలో నమోదైన కేసుల వివరాలు

అంశం	ఆదివారం	మొత్తం
పాజిటివ్ కేసులు	62	334
డిశ్చార్జి అయినవారు	-	33
మరణాలు	--	11
చికిత్స పొందుతున్నవారు	290	290

కరోనా పరీక్షలకు ఆరు ల్యాబ్‌లు

- టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటులో రాష్ట్రం ముందడుగు
- వైరస్ నిర్ధారణలో మైక్రోబయాలజిస్ట్‌లే ప్రధానం
- ముఖ్యపాత్ర పోషిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- ప్రాణాలను పణంగా పెట్టి బాధితులకు పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడం, బాధితులకు చికిత్స చేయడం ఒక ఎత్తయితే.. అనుమానితులకు పరీక్షలు చేయడం మరో ఎత్తు. ఇలాంటి కీలక బాధ్యతలో టెస్టింగ్ ల్యాబ్‌లలోని మైక్రోబయాలజిస్ట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు ముందుంటూ తమ ప్రాణాలనే పణంగా పెడుతున్నారు. రాష్ట్రంలోని ఆరు టెస్టింగ్ ల్యాబుల్లో 30కిపైగా మైక్రో బయాలజిస్ట్‌లు, 200కిపైగా ల్యాబ్ టెక్నీషియన్లు షిఫ్టులవారీగా 24 గంటలు శ్రమిస్తున్నారు. అనుమానితుల ముక్కు లేదా గొంతులో నుంచి శ్వాబ్ సేకరించి వైరస్ నిర్ధారణ కిట్లలో పొందుపరిచి ప్రాసెసింగ్ చేసి ఫలితాలు వెల్లడిస్తారు. బాధితుల వద్దకు వెళ్లే ల్యాబ్ టెక్నీషియన్లు తమకు వైరస్ సోకకుండా ప్రత్యేక మాస్కులు, డ్రెస్‌లను ధరిస్తారు.

గంటల్లోనే పరీక్షల ఫలితాలు

కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందడుగు వేసింది. తొలుత పుణె వైరాలజీ సెంటర్‌లో పరీక్షలు నిర్వహించేవారు. శాంపిళ్లను అక్కడికి పంపడంతో ఫలితాలకు రెండు, మూడ్రోజుల సమయం పట్టేది. తొలి కేసు నమోదైన తర్వాత ముందు జాగ్రత్త చర్యగా గాంధీ దవాఖానలో నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రారంభించారు. అనంతరం ఫీవర్, ఉస్మానియా, నిమ్స్‌తోపాటు సీసీఎంబీ, ఐపీఎంలో నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ల్యాబ్‌ల సంఖ్యను పెంచిన ప్రభుత్వం.. అనుమానిత లక్షణాలున్నవారు ఎందరు వచ్చినా పరీక్షలకు వీలుగా ఏర్పాట్లుచేసింది. ల్యాబ్‌ల సంఖ్యను పెంచిన ప్రభుత్వం.. అనుమానిత లక్షణాలున్నవారు ఎందరు వచ్చినా పరీక్షలకు వీలుగా ఏర్పాట్లుచేసింది. త్వరలో అందుబాటులోకి రానున్న గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కి వచ్చేవారికి కూడా నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకొంటున్నారు.

కరోనాను ముందే కట్టడి చేద్దాం



- రోగ నిరోధకశక్తి పెరిగితే వైరస్ దరిచేరదు
- బలవర్ధక ఆహారం, యోగాతో ప్రయోజనం
- ఆయుష్ ఆధ్వర్యంలో మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోగ నిరోధకశక్తిని పెంచుకోవడం ద్వారా కరోనా వైరస్ దరిచేరకుండా నివారించవచ్చని, ఇందుకోసం బలవర్ధకమైన ఆహారంతోపాటు, యోగాసనాలు ఎంతో ఉపయోగపడుతాయని కేంద్రం పేర్కొన్నది. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనాను ఇంట్లో ఉండే తరిమేయవచ్చని సూచించింది. ఇందుకోసం ఆయుష్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. చాలా సులువైన, నిత్యం అందుబాటులో ఉండే ప్రక్రియల ద్వారా వీటిని పాటించవచ్చని ఆయుష్ మార్గదర్శకాల్లో తెలిపింది.

కొవిడ్ -19 వైరస్‌కు మందు కనుగొనేందుకు మరింత సమయం పడుతుందని, ఖర్చుకూడా అధికంగా ఉంటుందని శాస్త్రవేత్తలు ఇప్పటికే వెల్లడించారని కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ వివరించింది. కరోనా కట్టడి కోసం తీసుకునే జాగ్రత్తలతోపాటుగా దవాఖానలు, ఇండ్ల వద్ద గాలిని పరిశుద్ధి చేసే యంత్రాలు (ఎయిర్ ప్యూరిఫయింగ్ డివైస్)ను ఉపయోగించాల్సిన అవసరం ఉన్నదని, దీనిలోభాగంగా రీ యూజబుల్ మాస్క్‌లను అందుబాటులోకి తీసువచ్చే ప్రక్రియను పరిశీలిస్తున్నట్టు ఆయుష్ పేర్కొన్నది.

ఆయుష్ విడుదలచేసిన మార్గదర్శకాలు

రోజంతా గోరువెచ్చని నీటిని తాగడం శ్రేయస్కరం.

30 నిమిషాలపాటు యోగా చేయాలి. ప్రాణాయామం చేస్తే మరీమంచిది.

- రోజువారీ ఆహారంలో పసుపు, జీలకర్ర, ధనియాల పాలు వీలైనంత ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. వీటివల్ల శరీరంలో రోగ నిరోధకశక్తి బాగా పెరుగుతుందని అధ్యయనంలో తేలింది.
- ఉదయం ఒక టీ స్పూన్ చవన్‌ప్రాష్ తీసుకోవాలి. మధుమేహం ఉన్నవారికోసం మార్కెట్లో షుగర్‌లెస్ కూడా అందుబాటులో ఉన్నాయి.
- తులసి ఆకులు, దాల్చినచెక్క, నల్ల మిరియాలు, ఎండుశొంఠి, ఎండుద్రాక్ష మిశ్రమంతో కూడిన హెర్బల్ టీ ప్రతిరోజూ రెండుసార్లు తాగాలి. దీనికి బెల్లం, నిమ్మరసం కూడా జోడించుకోవచ్చు.
- వేడిపాలల్లో కానీ, వేడి నీటిలోకానీ పసుపు వేసుకొని రెండుసార్లు తాగాలి.

మాస్క్‌ల వినియోగంలో జాగ్రత్త

మాస్క్‌లు ప్రతిఒక్కరూ వినియోగించాల్సిన అవసరం లేదని ఆయుష్ తెలిపింది. దగ్గు, జ్వరం ఉన్నవారు మాస్క్‌లు వేసుకోవాలని, చికిత్సచేసే వైద్యసిబ్బంది కచ్చితంగా వాడాలని సూచించింది. ప్రస్తుతం మార్కెట్‌లో దొరికే మాస్క్‌లను ప్రతి ఆరుగంటలకు మార్చాలని, నీటితో తడిస్తే వెంటనే తీసివేయాలని, మాస్క్ తొలగించే సమయంలో ముందరి భాగాన్ని ముట్టుకోరాదని, మెడలో వేలాడదీయరాదని పేర్కొన్నది. పలువురు మాస్క్‌లను విచ్చలవిడిగా వాడుతున్నట్టు గుర్తించినట్టు తెలిపింది. మాస్క్‌లను తొలగించిన తర్వాత చేతులను సబ్బుతోనైనా, శానిటైజర్‌తోనైనా శుభ్రం చేసుకోవాలని చెప్పింది. ఈ మార్గదర్శకాలపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్రాలకు సూచించింది.

జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయం, నల్గొండ
ఆసక్తి వ్యక్తీకరణ
No. DMO(N)SMA/MSP Rabi/50/2019 తేది : 05-04-2020
నల్గొండ జిల్లాలో PPCలకు టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ మరియు మాయిస్చర్ మీటర్ల సరఫరా కొరకు సంక్షిప్త ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుతోంది. ఆసక్తి దాఖలుకు చివరి తేది 08-04-2020న మ. 3.00 గం.కు లేదా ఆలోగా. వివరాలను జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయం, నల్గొండ నుండి పొందవచ్చును. సెల్ నం. 7330733129.
సం/- అడిషనల్ కలెక్టర్, నల్గొండ
DIPR RO No. 1089-PP/CL/Advt/1/2020-21, Dt: 05/04/2020

నారాయణపేట మున్సిపాలిటీ కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు నోటీసు నెం. E1/529/14th FC/NPT/2018-19/01 to 03/EE, తేది: 03-04-2020. మొత్తం పనుల సంఖ్య: 3 పనులు, అంచనా వ్యయం: రూ. 127.00 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 06-04-2020న ఉ|| 10.00 గం.కు. బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 16-04-2020న సా|| 5.00 గం.కు. PQ స్టేజ్: 16-04-2020న సా|| 5.10 గం.కు. కమర్షియల్ స్టేజ్: 18-04-2020న ఉ|| 10.00 గం.కు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్: 9618099288, 9618099244 మరియు 9160333912.
సం/- కమిషనర్,
DIPR RO.No. 1057-PP/CL/ADVT/1/2020-21, Dt: 03-04-2020 నారాయణపేట మున్సిపాలిటీ, నారాయణపేట జిల్లా

జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయం, రాజన్న సిరిసిల్లా
No. DMO/R/07/2016 ఆసక్తి వ్యక్తీకరణ తేది : 05-04-2020
రాజన్న సిరిసిల్లా జిల్లాలో PPCలకు టార్పలిన్లు మరియు ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్స్ సరఫరా కొరకు సంక్షిప్త ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుతోంది. ఆసక్తి దాఖలుకు చివరి తేది 08-04-2020న మ. 3.00 గం.కు లేదా ఆలోగా. వివరాలను జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయం, రాజన్న సిరిసిల్లా నుండి పొందవచ్చును. సెల్ నం. 7330733307.
సం/- అడిషనల్ కలెక్టర్, రాజన్న సిరిసిల్లా
DIPR RO No. 1083-pp/CL/Advt/1/2020-21, Dt: 05/04/2020

జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయం, పెద్దపల్లి
నం.DMO(P)/1/2020 ఆసక్తి వ్యక్తీకరణ తేది: 05-04-2020
ధాన్యం సేకరణ కేంద్రాలకు పంపిణీ కొరకు పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు టార్పలిన్ల సంఖ్య (1876) సరఫరా కొరకు సంక్షిప్త ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుతోంది. ఆసక్తి దాఖలు చివరి తేది: 09-04-2020న మ.1.00 గం.న లేదా ఆలోగా. వివరాలను జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ కార్యాలయం, పెద్దపల్లి నుండి పొందవచ్చును. సెల్ నం. 7330733468.
సం/- జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, పెద్దపల్లి
DIPR RO No.1085-PP/CL/Advt/1/2020-21, Dt: 05/04/2020

తెలంగాణ వైద్య విధాన పరిషత్
సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్స్, మహబూబాబాద్
సంక్షిప్త టెండరు ప్రకటన
Rc.No.Plg/Equip/SDH/MABD/2020, తేది: 04-04-2020
మహబూబాబాద్ జిల్లాలోని TVVP హాస్పిటల్స్ కొరకు దిగువ మెడికల్ ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు చేయుటకు ప్రముఖ కంపెనీల అధీకృత డీలర్లు/ తయారీదారుల నుండి సీల్డు కొటేషన్లు కోరబడుచున్నవి. ఐటమ్ పేరు మరియు పరిమాణం: 1) వెంటిలేటర్లు-05, 02) BIPAP-10, 3) PPE కిట్లు-1000, 4) N95 మాస్క్‌లు-1500, 5) సక్షన్ అప్పారటస్-08, 6) ECG మెషిన్ 12 ఛానల్-04, 7) వీడియో బేస్డ్ లారిన్‌గోస్కోప్-03, 8) ఆక్సిజన్ సిలిండర్లు (బల్క్ & B టైప్ ట్రాలీతో)-50, 9) IR థర్మో మీటర్లు-50, 10) డిఫిబ్రిలేటర్-02. టెండరు ఫారాల విక్రయం (వెబ్‌సైట్ https://mahabubabad.telangana.gov.in లో లభించును): 06-04-2020 నుండి 08-04-2020. టెండరు ఫారం ధర: రూ.1000/- టెండర్ల దాఖలుకు ఆఖరి తేది: 08-04-2020, మ.3.00 గం. టెండరు తెరచు తేది 08-04-2020, సా.4.00 గం. మెయిల్ id:superintendentmabd2016@gmail.com, ఫోన్ నం. 8008553170.
DIPR RO No.1087-PP/CL/Advt/1/2020-21, Dt: 05/04/2020 సం/- జిల్లా కలెక్టర్ & చైర్మన్ DPC మహబూబాబాద్

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి

	హైదరాబాద్	ముంబై	ఢిల్లీ
పెట్రోల్	రూ. 73.97	రూ. 75.30	రూ. 69.59
డీజిల్	రూ. 67.82	రూ. 65.21	రూ. 62.29

ఏ మాస్క్ సురక్షితం!

- కరోనాతో మాస్కులకు పెరిగిన గిరాకీ
- అందుబాటులోకి రకరకాల మాస్కులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ముఖానికి మాస్కులు పెట్టుకోవడం ప్రారంభించారు. దీంతో మాస్కులకు గిరాకీ అమాంతం పెరిగిపోయింది. మార్కెట్‌లో ఏ రకం మాస్క్ దొరికితే అది కొనుక్కొని తొడుక్కొంటున్నారు. అవి కూడా దొరక్కపోతే ఇంట్లోనే వస్త్రంతో తయారుచేసినవి వాడుతున్నారు. అయితే ఏ రకం మాస్కులు సురక్షితం అనేది, మార్కెట్‌లో దొరికే మాస్కులు వైరస్, బ్యాక్టీరియా, దుమ్మును ఎంత వరకు అడ్డుకోగల్గుతాయో ప్రశ్నార్థకంగా మారింది. వెర్సోయి హెల్త్ కేర్ ప్రాడక్ట్స్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం వివిధ మాస్కుల ప్రత్యేకత లేంటో ఒక్కసారి పరిశీలిద్దాం.

పునర్వినియోగ మాస్క్‌లు మేలు

కరోనా కట్టడిలో పునర్వినియోగ మాస్కులు ఎంతో మేలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వీటి తయారీపై కేంద్ర ప్రభుత్వ ముఖ్య శాస్త్రీయ సలహాదారు కార్యాలయం పలు మార్గదర్శకాలను రాష్ట్రాలకు జారీచేసింది. కాటన్ వస్త్రంతో రెండుపొరలుగా తయారుచేసే మాస్కులు వైరస్ కణాలను అడ్డుకోవడంలో 70 శాతం ప్రభావవంతంగా పనిచేస్తాయని నిపుణులు చెప్తున్నారు. పునర్వినియోగ మాస్కులను తరుచూ ఉతికి శుభ్రపరుచుకోవాలి. తడిగా, తేమగా ఉన్న మాస్కులను ధరించకూడదు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారిని అడ్డుకోవడానికి ఉపయోగిస్తున్న మాస్కుల తయారీ వేగవంతమైంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) తక్కువ వ్యయంతో నాణ్యమైన ఎన్-95 మాస్క్‌లను రూపొందించే పనిలో నిమగ్నమైంది. సాధారణంగా ఎన్-95 మాస్క్ ధర రూ.500 వరకు ఉంటుంది. ఎన్-95 మాస్క్‌లు వైరస్‌ను 95 శాతం అడ్డుకొంటాయని నిపుణులు చెప్తున్నారు. తక్కువ ధరలో ఎన్-95 మాస్క్‌కు ప్రత్యామ్నాయంగా నాణ్యత గల మాస్క్‌లను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్టు కాన్పూర్ ఐఐటీ ప్రొఫెసర్ రాంకుమార్ తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో యంత్రాలు, ముడిసరుకు సమకూర్చుకోవడంలో ఆలస్యం అవుతుందన్నారు. రెండు, మూడ్రోజుల్లో మాస్క్‌ల తయారీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

తక్కువ ధరలో ఎన్-95 మాస్క్‌లు

వివిధ మాస్క్‌లు.. అవి తట్టుకునే శాతాలు

మాస్క్ రకం	వైరస్	బ్యాక్టీరియా	దుమ్ము దూళి
ఎన్-95	95	100	100
సర్జికల్ మాస్క్	95	80	80
(ఆకుపచ్చ నీలం రంగులో దొరికేవి)			
ఎఫ్ఎఫ్‌పీ-1	95	95	80
యాక్టివ్ కార్బన్	10	50	50
(నలుపు రంగులో దొరికేవి)			
వస్త్రంతో చేసినవి	0	50	50
స్పాంజ్	0	05	05

వైద్యసిబ్బంది కోసం డిజిన్ఫెక్షన్ చాంబర్

- కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో డీఆర్డీవో రూపకల్పన

న్యూఢిల్లీ: కరోనాపై పోరాటంలో తనవంతు తోడ్పాటునందిస్తున్న రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), వైద్యసిబ్బంది కోసం ఫుల్-బాడీ డిజిన్ఫెక్షన్ చాంబర్‌ను, ప్రత్యేకమైన ఫేస్ ప్రొటెక్షన్ మాస్కును రూపొందించింది. 'పీఎస్ఈ' అని పిలిచే ఈ ప్రత్యేక చాంబర్‌ను అహ్మద్‌నగర్‌లోని డీఆర్డీవో లేబొరేటరీ వీఆర్డీఈ (వెహికల్ రిసెర్చ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్) డిజైన్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. వ్యక్తిగత పరిశుభ్రత కోసం డిజైన్ చేసిన ఈ వాక్‌త్రూ ఎన్‌క్లోజర్‌లో శానిటైజర్, సోప్ డిస్పెన్సర్ ఉంటాయని అధికారులు వివరించారు. ప్రవేశద్వారం వద్ద ఉండే ఫుట్ పెడల్‌తో ఈ వ్యవస్థను పనిచేయించవచ్చని, విద్యుత్‌తో పనిచేసే పంపు 25 సెకన్లపాటు హైపో సోడియం క్లోరైడ్‌తో కూడిన పొగమంచును వెదజల్లి క్రిములను నాశనం చేస్తుందన్నారు. ఒకసారి రీఫిల్లింగ్ చేస్తే 650మంది శానిటైజ్‌కు పనిచేస్తుందన్నారు.

కరోనా కట్టడికి 'ఐవర్‌మెక్టిన్'

మెల్‌బోర్న్: కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు 'ఐవర్‌మెక్టిన్' అనే యాంటీ-పారాసిటిక్(పరాన్నజీవి వ్యాప్తిని నిరోధించే) మందు ఉపయోగపడుతుందని ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. ఇది కణాల్లో కరోనా వైరస్(సార్స్-కోవ్-2) వృద్ధిని 48 గంటల్లో నియంత్రిస్తుందని వెల్లడించారు. ఈ ఫలితాలు దవాఖానల్లో కరోనా చికిత్సకు, వైరస్‌ను కట్టడి చేసేందుకు కావాల్సిన ఔషధ తయారీకి సాయపడుతుందని చెప్పారు. ఈ వివరాలు 'యాంటీవైరల్ రీసెర్చ్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 'ఐవర్‌మెక్టిన్‌ను సింగిల్ డోస్ తీసుకున్నా.. 24 గంటల్లోనే తన పనిని ప్రారంభిస్తుంది. 48 గంటల్లోనే ఆర్ఎన్ఏలోని వైరల్‌ను తీసివేస్తుంది' అని పరిశోధక బృంద సభ్యుడు కైలీ వాగ్‌స్టాఫ్ పేర్కొన్నారు.

విదేశీ చదువులపై నీలినీడలు

- కరోనా నేపథ్యంలో ఆవిరవుతున్న విద్యార్థుల ఆశలు

న్యూఢిల్లీ: కరోనా నేపథ్యంలో విదేశీ చదువులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పలు దేశాలు లాక్‌డౌన్‌లో ఉండటంతో అక్కడి విద్యాసంస్థలు మూతపడగా కొన్ని ఆన్‌లైన్ కోర్సులవైపు మొగ్గుతున్నాయి. దీంతో విదేశాల్లో ఉన్నత విద్య పూర్తి చేయాలని భావిస్తున్న దేశంలోని పలువురి విద్యార్థుల ఆశలు ఆవిరవుతున్నాయి. లాక్‌డౌన్ వల్ల ఇంటర్, డిగ్రీ పరీక్షలు వాయిదాపడగా, ఇవి ఎప్పుడు జరుగుతాయో, ఫలితాలు ఎప్పుడు వస్తాయో అన్నదానిపై విద్యార్థుల్లో అయోమయం నెలకొన్నది. మరోవైపు కొన్ని సబ్జెక్టుల్లో వార్షిక పరీక్షలు నిర్వహించకుండానే ఇంటర్నల్ మార్కుల ఆధారంగా ఉత్తీర్ణతను నిర్ణయిస్తామని సీబీఎస్ఈ వంటి బోర్డులు ప్రకటించాయి. దీనివల్ల తమ గ్రేడ్లపై ప్రభావం ఉంటుందని, తద్వారా విదేశాల్లో ఉన్నత చదువుకు ఆటంకం కలుగవచ్చని కొందరు ఆందోళన చెందుతున్నారు. వీసాలు, విద్యా రుణాలు వంటివి జాప్యమయ్యే అవకాశం ఉండటంతో మరికొందరు తమ ప్రణాళికలను మార్చుకుంటున్నారు. విదేశాల్లో కోర్సులు చివరి దశలో ఉన్నవారు వీసాల పొడిగింపు, కొలువుల లభ్యత, విద్యా రుణాల చెల్లింపు వంటి సమస్యలపై ఆందోళన చెందుతున్నారు.

మరో ఐదుగురు ఉగ్రవాదులు హతం

- అమరులైన ముగ్గురు జవాన్లు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో గత 24 గంటల్లో తొమ్మిది మంది ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది. కుప్వారా జిల్లాలోని కెరాన్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వెంబడి భారత్‌లోకి చొరబడేందుకు యత్నించిన ఉగ్రవాదులపై సైన్యం ఆదివారం కాల్పులు జరిపింది. ఈ ఘటనలో ఐదుగురు ఉగ్రవాదులు హతమవ్వగా, ఎదురు కాల్పుల్లో ముగ్గురు జవాన్లు అమరులయినట్టు సైన్యం ప్రతినిధి కల్నల్ రాజేశ్ కలియా పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో కశ్మీర్ లోయలో తొమ్మిది మంది ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టినట్టైంది. దక్షిణ కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో నలుగురు పౌరులు మరణించడంతో.. అప్రమత్తమైన భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించాయి. దీంట్లో భాగంగా కుల్గం జిల్లాలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే సమాచారంతో శనివారం సైన్యం జరిపిన కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు.

మాస్క్ పెట్టుకోలేదని కాల్చిపడేశారు!

మనీలా: కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం విధించిన ఆంక్షలను అతిక్రమించినవారిపై ఫిలిప్పీన్స్ ఉక్కుపాదం మోపుతున్నది. మాస్క్ ధరించకుండా, అధికారులపైకే బెదిరింపులకు దిగిన ఒక వ్యక్తిని పోలీసులు ఆదివారం కాల్చివేశారు. నిబంధనలను పాటించకుండా తోకజాడిస్తే కాల్చివేయండంటూ అధ్యక్షుడు రోడ్రిగో డుటెర్టే ఆ దేశ పోలీసులను, మిలిటరీని ఆదేశించిన మరునాడే ఒక పౌరుడిని కాల్చిచంపడం గమనార్హం.

పసిగుడ్డును మింగిన మత వివక్ష

జైపూర్: ప్రాణాలు పోయాల్సిన ఓ డాక్టర్‌కు మత వివక్ష తలకెక్కింది. పురిటినొప్పులతో వచ్చిన గర్భిణికి పురుడు పోసేందుకు నిరాకరించింది. ఫలితంగా పుట్టిన క్షణాల్లోనే ఓ పసిగుడ్డు ప్రాణాలొదిలింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాలో జరిగింది. బాధితురాలి భర్త ఇర్ఫాన్‌ఖాన్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి ఆయన భార్య (32)కు పురిటినొప్పులు రావడంతో సిక్రిలోని ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు. కేసు క్లిష్టంగా ఉండటంతో వారు జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు. అయితే అక్కడున్న వైద్యురాలు వారి వివరాలు అడిగారు. 'మీరు ముస్లిం. మీకు ఇక్కడ చికిత్స అందించలేం' అని తిరస్కరించారు. పురిటినొప్పులు పడుతున్నా.. కనీసం కనికరించకుండా జైపూర్‌కు రెఫర్ చేయండంటూ తోటి డాక్టర్‌కు చెప్పి వెళ్లిపోయింది. దీంతో చేసేదిలేక ఇర్ఫాన్‌ఖాన్ తన భార్యను తీసుకొని అంబులెన్స్‌లో జైపూర్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించింది. అయితే వెంటనే ఆ శిశువు మరణించింది.

2 కోట్ల మందికి చేరిన..

కరోనా వాట్సాప్

న్యూఢిల్లీ: కరోనాపై సందేహాలను నివృత్తి చేసి ప్రజల్లో భయాందోళనలు పోగొట్టడంతోపాటు అవాస్తవ ప్రచారానికి అడ్డుకట్ట వేసే లక్ష్యంలో కేంద్ర ప్రభుత్వం మార్చి 20న ప్రారంభించిన కరోనా హెల్ప్‌డెస్క్ వాట్సాప్ నంబర్ 90131151515 పక్షం రోజుల్లోనే 2 కోట్ల మందికి చేరింది. రిలయన్స్ జియోకు చెందిన కృతిమ మేధ సంస్థ హెప్‌టిక్ ఇన్సోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ చాట్‌బోట్‌ను అభివృద్ధి చేసింది. ఇప్పటి వరకు 2 కోట్ల మంది వినియోగదారులు అడిగిన ప్రశ్నలకు 5.5 కోట్ల సందేశాల ద్వారా సమాధానమిచ్చినట్లు ఆ సంస్థ సహవ్యవస్థాపకుడు , సీఈవో ఆక్రిత్ వైశ్ తెలిపారు.

రైలు ఎక్కాలంటే.. మాస్క్ తప్పనిసరి

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ తర్వాత రైళ్ల పునరుద్ధరణకు రైల్వేశాఖ సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా ప్రయాణికులకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నది. ప్రయాణికులు మాస్క్ ధరించడం, రైలులో ఎక్కడానికి ముందే ఆరోగ్య సేతుయాప్‌తో వారి ఆరోగ్య స్థితిని పరీక్షించుకోవాలని కోరడం, నిర్ణీత దూరం పాటించడం వంటివి తప్పనిసరి చేయనున్నట్టు సమాచారం. కాగా, ఉత్తర రైల్వే జోన్ త్వరలో రోజుకు వంద వ్యక్తిగత రక్షణ పరికరాలు(పీపీఈ)లను తయారు చేయనున్నది. అది రూపొందించిన రెండు నమూనాలకు డీఆర్డీవో ఆమోదం తెలిపింది.

కరోనా పోరులో ఆయుర్వేద సాయం

న్యూఢిల్లీ: ఆయుర్వేద వైద్యచికిత్స రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుందని, దీంతో కరోనా ప్రభావాన్ని తగ్గించడంతోపాటు త్వరితగతిన కోలుకోవచ్చునని నిపుణులు చెప్తున్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు తులసి ఆకులు, శొంఠి, దాల్చినచెక్క, నల్ల మిరియాలు, ఎండు ద్రాక్షతో పాటు యోగా సహకరిస్తాయన్నారు.

శనగల కొనుగోలుకు అదనపు కోటా

- కేంద్రాన్ని కోరిన మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కనీస మద్దతు ధర పథకం కింద శనగల కొనుగోలుకు నిర్దేశించిన కోటాను పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు లేఖ రాశారు. రాష్ట్రం నుంచి 47,600 టన్నుల కొనుగోలుకు అనుమతిచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో 1.46 లక్షల హెక్టార్లలో శనగపంట సాగుచేశారని, హెక్టారుకు 12.95 క్వింటాళ్ల చొప్పున దాదాపు 1.89 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని పేర్కొన్నారు. మరో 27,830 టన్నులకు అదనంగా అనుమతివ్వాలని నిరంజన్‌రెడ్డి.. కేంద్రమంత్రికి విజ్ఞప్తిచేశారు.

కరోనాపై చర్చకు మేము అక్కర్లేదా!

- ప్రధాని మోదీ నిర్ణయంపై అసదుద్దీన్ నిరసన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా కట్టడికి ప్రధాని నిర్వహించే చర్చకు తమను ఆహ్వానించకపోవడంపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అసంతృప్తి వ్యక్తంచేశారు. కొవిడ్-19 వ్యాప్తి నియంత్రణ, లాక్‌డౌన్‌పై సూచనలను తెలుసుకోవడానికి ఈ నెల ఎనిమిదిన నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో ఐదుగురికంటే ఎక్కువ ఎంపీలు ఉన్న పార్టీల ఫ్లోర్‌లీడర్లే పాల్గొనాలని ప్రధాని మోదీ చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆదివారం ట్విట్టర్‌లో ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీ తరఫున లోక్‌సభలో హైదరాబాద్, ఔరంగాబాద్ ముఖ్యనగరాల నుంచి ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం ప్రధానికి తెలియదా? అని నిలదీశారు. రెండునగరాల్లో కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై తాము సూచనలు చేయాలనుకున్నామన్నారు. కానీ, ప్రధాని ఉద్దేశపూర్వకంగా మజ్లిస్ పార్టీని విస్మరించారని అసద్ ఆరోపించారు.

కరోనా పీడితులకు కల్పతరువు

వాక్యూమ్ క్లీనర్‌తో ఓపెన్‌సోర్స్ వెంటిలేటర్ • అతితక్కువ ధరకే అందుబాటులోకి

హైదరాబాద్ శాస్త్రవేత్త ఆషాఫర్హాన్ కీలకపాత్ర • ఆన్‌లైన్‌లో డిజైన్ ప్రదర్శన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచవ్యాప్తంగా కరాళనృత్యం చేస్తున్న కరోనా మహమ్మారి నుంచి మానవాళిని కాపాడేందుకు ఎవరి వంతు సాయం వారు చేస్తున్నారు. కొందరు సాంకేతికంగా.. మరికొందరు ఆర్థికంగా.. ఇంకొందరు సేవల రూపంలో తోడ్పాటునందిస్తున్నారు. కొవిడ్-19 బాధితులసంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వారికి వైద్యసేవలందించేందుకు అవసరమైనన్ని వెంటిలేటర్లు అందుబాటులో లేకపోవడం అందరికీ ఆవేదన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకురావాలని నిశ్చయించుకొన్న హైదరాబాద్ శాస్త్రవేత్త ఆషాఫర్హాన్ వెంటనే తన ఆలోచనకు పదను పెట్టారు. ముంబైలోని 'ఎక్సీడ్ స్పేస్' సంస్థలో చీఫ్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఫర్హాన్ ప్రైవేట్ ఉపగ్రహాల తయారీలో తనకున్న పరిజ్ఞానంతో వెంటిలేటర్ల రూపకల్పనకు నడుం బిగించారు. ఇండ్లలో వాడే వాక్యూమ్ క్లీనర్‌ను ఇందుకు ఆయుధంగా ఎంచుకొన్నారు. దీనితోపాటు పీవీసీ పైపులను, స్ప్రింక్లర్లను ఉపయోగించి ఎలక్ట్రానిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా పనిచేసే వెంటిలేటర్‌ను డిజైన్ చేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతోపాటు 'సెంటర్ ఫర్ సేఫ్టీ సిమ్యులేషన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ టెక్నాలజీ' సాయంతో రూపొందించిన ఈ డిజైన్‌కు 'గ్లోబల్ ఓపెన్‌సోర్స్ వెంటిలేటర్' అనే పేరు పెట్టారు. అద్భుతమైన ఈ ఆవిష్కరణలో ఫ్లోరిడాకు చెందిన శాస్త్రవేత్త సిమ్ లంపాటాంగ్ నేతృత్వంలోని యువ శాస్త్రవేత్తల బృందం కీలకపాత్ర పోషించింది. ఈ బృందంలో ఫర్హాన్‌తోపాటు అమెరికా, కెనడా, ఐర్లాండ్, వియత్నాం, బ్రెజిల్‌కు చెందినవారున్నారు.

ఓపెన్ సోర్స్ వెంటిలేటర్

సాధారణంగా ఒక వెంటిలేటర్ కొనుగోలుకు రూ.10 లక్షల వరకు వెచ్చించాల్సి ఉంటుందని, కానీ తమ డిజైన్‌కు అయ్యే ఖర్చు రూ.5 వేలలోపే ఉంటుందని, దీని సాయంతో రోగులకు ప్రాణవాయువు (ఆక్సిజన్) అందించవచ్చని ఫర్హాన్ వివరించారు. తమ డిజైన్‌కు త్వరలో శాస్త్రీయ ఆమోదం తీసుకొని వెంటిలేటర్ల ఉత్పత్తి మొదలుపెడతామన్నారు. తమ డిజైన్‌ను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచుతామని, ఈ డిజైన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రపంచంలో ఎవరైనా సులభంగా వెంటిలేటర్లను తయారుచేసుకోవచ్చని, అందుకే దీనికి 'గ్లోబల్ ఓపెన్‌సోర్స్ వెంటిలేటర్'గా నామకరణం చేశామని ఫర్హాన్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఈ డిజైన్ వివరాలను అమెరికాకు చెందిన 'నేషనల్ అసోసియేషన్ ఫర్ అమెచ్యూర్ రేడియో' వెబ్‌సైట్‌లో కూడా ఉంచారు.

కోలుకొన్నవారి రక్తమే ఔషధం!

మొదటిపేజీ తరువాయి...

రోగుల రక్తంలోని ప్లాస్మాను సేకరించి దానితో ఇతర రోగులకు చికిత్సచేయడం ద్వారా వైరస్‌ను పారదోలవచ్చని అమెరికా, చైనా శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ.. ఈ చికిత్సా విధానాన్ని ఆమోదించింది. అంతేకాకుండా 'ఎక్స్‌పాండెడ్ యాక్సెస్' పేరిట ప్లాస్మా సేకరించే కార్యక్రమం ప్రారంభించింది. ప్లాస్మాను సులువుగా సేకరించడానికి.. అవసరమైనప్పుడు వినియోగించుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. అమెరికాలో ప్లాస్మాను దానంచేయడానికి కరోనాను జయించినవారు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.

ప్లాస్మా అంటే..

రక్తంలో ఉండే పసుపురంగు ద్రవభాగం ఇది. ఇది శరీర రక్త పరిమాణంలో 55 శాతం ఉంటుంది. రక్తం నుంచి రక్త కణాలను వేరుచేయగా మిగిలేదే ప్లాస్మా. ఇందులో నీరు, లవణాలు, ఎంజైమ్‌లతోపాటు అతిముఖ్యమైన రోగ నిరోధక కణాలు ఇమ్యునోగ్లోబ్యులిన్స్ ఉంటాయి. వ్యాధులను ఎదుర్కోవటంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

ప్లాస్మాలో యాంటీబాడీలు

కాన్వాలెసెంట్ సీరంతో ఈ చికిత్స చేస్తారు. దీనిద్వారా పలుదేశాల వైద్యులు కొవిడ్-19ను నయంచేసే ప్రయత్నంచేసి విజయం సాధించారు. ప్లాస్మా చికిత్సవల్ల కొవిడ్-19 సోకినవారు సాధారణస్థితికి వస్తున్నారని చైనా, అమెరికా, ఫ్రాన్స్ దేశాల వైద్యులు ప్రకటించారు. మానవ శరీరంలోకి ఏదైనా హానికర సూక్ష్మజీవి ప్రవేశించగానే రోగనిరోధక శక్తి దాన్ని అడ్డుకుంటుంది. దానిపై పోరాడే క్రమంలో యాంటీ బాడీలుగా పిలిచే ప్రొటీన్లను తయారుచేయడం ప్రారంభిస్తుంది. ఆ వ్యక్తి కోలుకుంటున్న తర్వాత ఆ యాంటీబాడీలు అతని రక్తంలో ప్రవహిస్తూనే ఉంటాయి. ఇవి ప్లాస్మాలో కొంతకాలంపాటు ఉంటాయి. యాంటీబాడీలతో కూడిన ఈ ప్లాస్మాను సేకరించి కొత్తగా కరోనా బారిన పడిన రోగుల శరీరంలోకి ఎక్కిస్తే వైరస్‌ను ఎదుర్కొనే శక్తి ఆ వ్యక్తికి అందుతుంది. కాబట్టి కొవిడ్‌ను జయించడం సాధ్యమవుతుందని వైద్యులు చెప్తున్నారు. చారిత్రకంగా చూసినా ఇది సమర్థంగా పనిచేస్తున్నదని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జెఫరీ హెండర్సన్ అభిప్రాయపడ్డారు. వాక్సిన్లు కనిపెట్టకముందు ఇదే విధానంలో మీజిల్స్, డిఫ్తీరియా వంటి వ్యాధులను నయంచేసినట్లు తెలిపారు. 1918లో వచ్చిన ఫ్లూను నయంచేయడంలోనూ ప్లాస్మా పాత్ర కీలకమని చెప్పారు. దీనిపై ఇప్పటికే పలుదేశాల్లో పరిశోధనలు జరిగాయని వెల్లడించారు. కొవిడ్-19 సోకిన వారిపై ప్రయోగించిన సందర్భాల్లో ప్రతి ఐదుగురిలో ఒకరికి మాత్రం ప్లాస్మా ఎక్కించిన సమయంలో సైడ్ ఎఫెక్ట్ వచ్చినట్లు గుర్తించామని పేర్కొన్నారు. దాతల నుంచి కేవలం ప్లాస్మా మాత్రమే సేకరించి మిగతా రక్తాన్ని తిరిగి వారి శరీరంలోకి పంపుతుందని, ఈ ప్రక్రియ అంతా 90 నిమిషాల్లో ముగుస్తుందని తెలిపారు. ఒకరినుంచి తీసుకున్న ప్లాస్మా ముగ్గురు లేదా నలుగురు కొవిడ్ -19 పేషెంట్లకు ఉపయోగపడుతుందని హెండర్సన్ చెప్పారు. రక్తదాత కచ్చితంగా కరోనా సోకి పూర్తిగా నయం అయినవారే అయి ఉండాలని చెప్పారు. న్యూయార్క్‌లో ఏర్పడ్డ అత్యవసర వైద్యపరిస్థితుల నేపథ్యంలో కొన్ని దవాఖానలు కూడా ప్లాస్మాతో చికిత్స ప్రారంభిస్తున్నాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో డయాలసిస్ మిషన్లను ఆధునీకరించి ప్లాస్మా సేకరించేందుకు వీలుగా మార్చినట్లు హెండర్సన్ చెప్పారు. ఇక న్యూయార్క్‌లోని బ్లడ్ సెంటర్లు కొవిడ్-19 సోకి నయమైన వారు ప్లాస్మా దానంచేసేందుకు ముందుకురావాలని పిలుపునిస్తున్నాయి. కొవిడ్-19 నుంచి రికవరీ అయినవారి నుంచి ప్లాస్మా సేకరించడం ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమైన పనిఅని, భారత్‌లోనూ ఇది మొదలుకావాలని మన దేశానికి చెందిన పలువురు వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

మన దగ్గరా ప్లాస్మా చికిత్స చేయొచ్చు

కొవిడ్-19కు ప్రత్యేకమైన చికిత్సగానీ, వ్యాక్సిన్‌గానీ లేదు. చాలాదేశాల్లో ప్లాస్మా ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేషెంట్లకు చికిత్స అందిస్తున్నారు. మెరుగైన ఫలితాలు వస్తున్నట్లు తెలుస్తున్నది. కాబట్టి మనదేశంలోనూ ఈ తరహా చికిత్స ప్రారంభించవచ్చు. ఒకసారి వైరస్ సోకి నయం అయిన తర్వాత మరోసారి సోకినప్పటికీ దాదాపుగా ప్రమాదం ఉండదు. ఎందుకంటే రక్తంలో ఆ వైరస్‌ను ఎదుర్కొనే యాంటీ బాడీస్ ఉండటమే కారణం. ఇవి ఉండే ప్లాస్మాను సేకరించి కొత్తగా వైరస్ సోకినవారికి ఎక్కించడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చు. సార్స్, మెర్స్ ద్వారా వచ్చే రోగాలను ఈ విధంగా నిరోధించగలిగారు. యూరప్ దేశాల్లో ఎక్కువగా ప్లాస్మా ఆధారిత చికిత్స చేస్తున్నారు. ప్లాస్మా ఎక్కించడం వల్ల కొవిడ్ సోకినవారికి ఎలాంటి నష్టంలేదు. కాబట్టి దీన్ని అనుసరించడం మంచిదే. ప్రతి బ్లడ్‌బ్యాంకులో రక్తం నుంచి ప్లాస్మాను వేరుచేసి నిల్వ ఉంచవచ్చు. ఒకే రకం గ్రూపు ఉన్నవారిమధ్య ఈ మార్పిడి జరుగాలి. ఎయిడ్స్ వంటి రోగాలు ఉండకూడదు. కచ్చితంగా యాంటీ బాడీస్ పరీక్షలు నిర్వహించాలి.

- డాక్టర్ ఎంవీ రావు, సీనియర్ జనరల్ ఫిజీషియన్, యశోదా హాస్పిటల్స్

ఉడుములగుట్టలో రాతి చిత్రాలు

- మెదక్ జిల్లాలోని కాజీపల్లిలో గుర్తింపు

ఉడుములగుట్టలో రాతిపై చిత్రాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెదక్ జిల్లా కాజీపల్లి గ్రామశివారు ఉడుములగుట్ట (చిన్న రాతిగుట్ట)పై పాత రాతియుగం నాటి రాతిచిత్రాలను గుర్తించామని తెలంగాణ జాగృతి చరిత్ర బృందం వెల్లడించింది. తమ సభ్యుడు, రాతి చిత్రాల అన్వేషకుడు శంకర్ రెడ్డి వీటిని గుర్తించారని బృందం ప్రతినిధి శ్రీరామోజు హరగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడి పడిగెరాయి చిన్నదే అయినప్పటికీ రాతి చిత్రాలు గొప్పవని పేర్కొన్నారు. పాత రాతియుగం నుంచే తెలంగాణ ప్రాంతం మనుషులకు గొప్ప నెలవని ఇవి మరోసారి రుజువు చేస్తున్నాయని చెప్పారు. చిత్రాల్లో అందమైన ఉడుము, చేపలు, గున్న ఏనుగు వంటి చిన్న జంతువుల బొమ్మలు, తామరపువ్వు, గీతలలో మేకచిత్రం, నిలువు రేఖల్లో డబ్బాలవంటివి కనిపించాయన్నారు. ఈ చిత్రాలను మధ్యరాతియుగం (మెసొలిథిక్) కాలంనుంచి చారిత్రక కాలంవరకు వివిధదశల్లో గీసినట్టు హరగోపాల్ వివరించారు.

సిద్ధంగా 14 వేల హార్వెస్టర్లు

- వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వరి కోతలకు 14,848 హార్వెస్టింగ్ యంత్రాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పలు హార్వెస్టింగ్ యంత్రాల తయారీ కంపెనీలతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి చర్చించారు. రైతుల అవసరాల మేరకు ఇతర రాష

ఉత్తరప్రదేశ్‌లో గంగానది జలాల నాణ్యత పెరిగి పరిశుభ్రంగా మారాయి. వారణాసి, కాన్పూర్ నగరాల్లో వాయుకాలుష్యం బాగా తగ్గింది. గంగానది ఎగువ ప్రవాహం లీటరు నీటిలో ప్రాణవాయువు (ఆక్సిజన్) 8.9 ఎంజీకి, దిగువ ప్రవాహంలో 8.3 ఎంజీకి చేరాయి.
– కాళికాసింగ్, యూపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి

దీప సంకల్పం!

కరోనా రక్కసిని తరిమికొట్టేందుకు యావత్ భారతావని సమిష్టి సంకల్పాన్ని తీసుకున్నది. ప్రధాని మోదీ పిలుపునకు ప్రజలందరూ సంఘీభావాన్ని ప్రకటించారు. ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు లైట్లన్నీ బంద్ చేసి దీపాలను, కొవ్వొత్తులను, టార్చ్‌లైట్లను వెలిగించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ మొదలకొని, సామాన్య ప్రజల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో దీపాలతో రాష్ట్రపతి కోవింద్ దంపతులు

ఆదివారం ఢిల్లీలో దీపాలను వెలిగించిన వలస కార్మికులు

దీపకాంతుల్లో బెంగళూరు నగరం



ఆదివారం ఢిల్లీలో ఓ పోలీసు తుపాకీ ధరించే బెల్టులో శానిటైజర్‌ను పెట్టారు. ఆహార పదార్థాలను అందుకునే వలస కార్మికులను క్యూ కట్టించే క్రమంలో ఆయన ఇలా వ్యవహరించారు.

యువతపైనే పంజా!

- దేశంలో కరోనా బాధితుల్లో అత్యధికం యువకులే
- పాజిటివ్ కేసుల్లో 60శాతం 20-49 ఏండ్ల మధ్యవారే
- మొత్తం కేసుల్లో పురుషులు 73 శాతం
- యువత నిర్లక్ష్యం వీడాలంటున్న నిపుణులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'మేము యువకులం.. కరోనా మమ్మల్ని ఏమీ చేయదు' అని నిర్లక్ష్యం చేస్తున్నారా? ప్రభుత్వం, వైద్యుల మాటలు పెడచెవిన పెట్టి ఇష్టారీతిగా తిరుగుతున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త. మీ నిర్లక్ష్యం కరోనా వైరస్ వ్యాప్తికి ఆసరాగా నిలుస్తున్నది. మన దేశంలో కరోనా కాటు యువతరంపైనే ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ 2వ తేదీ వరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో 60శాతం కంటే ఎక్కువగా.. 20 నుంచి 49 ఏండ్ల వయస్సు వారే ఉన్నారు. ఇందులో 20-39 మధ్య వారు 43%, 40-49 వయస్కులు 17% దాకా ఉన్నారు. ఈ విషయాన్ని ఇండియా టుడే డాటా ఇంటెలిజెన్స్ యూనిట్ (డీఐయూ) వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, మన దేశంలో యువతకే కరోనా ఎక్కువగా సంక్రమిస్తున్నట్టు తెలుస్తున్నది. చైనా, ఇటలీ, అమెరికా వంటి దేశాల్లో కరోనా వైరస్ ఎక్కువగా పెద్ద వయస్సు వారికి సంక్రమిస్తుండగా.. మన దేశంలో యువతలో ఎక్కువగా కనిపిస్తున్నది. మన దగ్గర నమోదైన పాజిటివ్ కేసుల్లో వయోధికుల సంఖ్య తక్కువగా ఉండటం గమనించవచ్చు. 60 ఏండ్లకు పైబడిన వారు 19 శాతం ఉండగా, 80 ఏండ్లు దాటిన వారు 2 శాతం కంటే తక్కువగా ఉన్నారు. ఇక 10 ఏండ్ల కంటే తక్కువ వయసున్న వారు 3 శాతం ఉన్నారు.

పాజిటివ్ కేసుల్లో పురుషులే అధికం

కరోనా వైరస్ పాజిటివ్ కేసుల్లో 73 శాతం పురుషులు, 27 శాతం మహిళలు ఉన్నారు. మహిళల్లో కూడా యువతులే ఎక్కువగా ఉండటం గమనార్హం. పాజిటివ్ కేసులు నమోదైనవారి మహిళల్లో ఎక్కువగా 20 నుంచి 29 వయస్సువారు ఉన్నారు. పురుషులే ఎక్కువగా కరోనా బారిన పడుతున్నారు.

కొంప ముంచుతున్న నిర్లక్ష్యం

మనదేశంలో యువత ఇప్పటికీ తమకు కరోనా వైరస్ సోకదనే అపోహలో ఉన్నారని, ఈ నిర్లక్ష్యమే మన కొంప ముంచుతుందని వైద్యనిపుణులు చెప్తున్నారు. ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించినప్పటికీ పూర్తిస్థాయిలో సహకరించకుండా రోడ్లపై సంచరిస్తుండటం వల్ల వైరస్‌కు వాహకంగా మారి ప్రమాదం కొనితెచ్చుకొంటున్నారని హెచ్చరిస్తున్నారు. వయస్సు, లింగభేదంతో సంబంధం లేకుండా వైరస్ సంక్రమించే అవకాశం ఉన్నదని, తప్పనిసరిగా తరుచూ చేతులు శుభ్రం చేసుకోవడం, శానిటైజర్లను ఉపయోగించం, ఇంట్లోనే ఉండటం, నిర్ణీత దూరం పాటించడం వంటి చర్యలు కచ్చితంగా పాటించాలని సూచిస్తున్నారు.

వయస్సు	పాజిటివ్ కేసులశాతం		
0-9	2.5	50-59	13.3
10-19	5.0	60-69	13.2
20-29	20.8	70-79	4.3
30-39	21.7	80-89	1.1
40-49	17.4	90-99	0.1

యువ భారత్..

ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో 15-60 ఏండ్ల మధ్య వయస్కులు అధికం. 2011 జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 0-15 ఏండ్ల మధ్య వయస్కులు 29.5 శాతం, 15-59 మధ్య వయసువారు 62.5 శాతం, 60 ఏండ్లు పైబడిన వారు 8 శాతం ఉన్నారు. ఇదే ఇటలీలో అయితే మొత్తం జనాభాలో 65 ఏండ్లు పైబడిన వారు దాదాపు పావు వంతు ఉన్నారు. చైనాలో 11 శాతం మంది వృద్ధులే. స్టాటిస్టా.కామ్ గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా వైరస్ సోకినవారిలో 72 శాతం మంది 50 ఏండ్లు పైబడినవారే. అయితే మనదేశంలో మాత్రం వైరస్ బాధితులు యువతే అధికంగా ఉండడం గమనార్హం. కానీ మృత్యువాతపడిన వారు 60 ఏండ్లు పైబడినవారే.

'అమ్మ'ను మించిన దాతృత్వం

- తల్లి అంత్యక్రియలకు వెళ్లని కొడుకు
- లాక్‌డౌన్ కారణంగా ఆకలితో ఉన్న అభాగ్యులకు అన్నం పంపిణీలో సాయం

న్యూఢిల్లీ: కనిపెంచిన అమ్మ లోకాన్ని విడిచింది. కడసారి చూపులకు వెళ్లకపోతే ఆమె ఇంకెప్పుడూ కనిపించదని తెలుసు. అయినా అంత్యక్రియలకు వెళ్లొద్దని నిర్ణయించుకున్నాడా కుమారుడు. ఓ వైపు బంధువులు ఆ తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తుండగా.. కొడుకు మాత్రం అభాగ్యులకు ఆహారం పంపిణీచేస్తూ మానవత్వాన్ని చాటాడు. ఆకలి తీర్చడంలో 'అమ్మ'ను మించిన దాతృత్వాన్ని ప్రదర్శించాడు. లాక్‌డౌన్‌తో తిండీతిప్పలు లేక కష్టాల్లో ఉన్నవారికి ఆహారాన్ని అందించేందుకు సాయంచేశాడు 40 ఏండ్ల షకీర్ ఉర్ రెహ్మాన్. రెహ్మాన్ ఢిల్లీలో ఓ ట్రావెల్ ఏజెన్సీ యజమాని. బంధువులు, తెలిసిన వాళ్ల మద్దతుతో అతనితోపాటు స్నేహితులంతా ఓ బృందంగా ఏర్పడ్డారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా కడుపుకాలుతున్న వలస కూలీలు, నిరాశ్రయులు, నిరుపేదలకు ఉచితంగా ఆహారం పంపిణీ చేస్తున్నారు. బీహార్ సమస్తిపూర్ జిల్లాలోని నౌషబా ఖతూన్‌లో రెహ్మాన్ తల్లి శుక్రవారం అనారోగ్యంతో చనిపోయినట్టు బంధువులు సమాచారం ఇచ్చారు. అంత్యక్రియలకు వెళ్లాలని, కడసారి చూసి రావాలని స్నేహితులు.. రెహ్మాన్‌కు సూచించారు. కానీ, అందుకు రెహ్మాన్ నిరాకరించాడు. 'ఢిల్లీలో ఇప్పుడు నా అవసరం ఉన్నది. ఏ ఒక్క తల్లి కూడా ఆకలితో చనిపోకుండా చూసుకోవాలి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో అవసరమైన వాళ్లకు సాయం చేయగలిగితే అదే మా అమ్మకు ఇచ్చే అసలైన నివాళి' అని రెహ్మాన్ చెప్పినట్టు అతని స్నేహితుడు, సామాజిక కార్యకర్త మహమ్మద్ తెలిపారు.

కొంపముంచిన దశ దినకర్మ

- 26,000 మంది క్వారంటైన్

మురేనా: కరోనా విజృంభిస్తున్న సమయంలో మధ్యప్రదేశ్‌లోని ఒక వ్యక్తి తన తల్లి సంస్మరణార్థం నిర్వహించిన దశ దినకర్మ కార్యక్రమం.. వేల మందిని ప్రమాదంలోకి నెట్టింది. ఆ కార్యక్రమానికి వెయ్యిమందికిపైగా హాజరుకాగా, వారిలో ఇప్పటికే 10 మందికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ కార్యక్రమానికి హాజరైన వారు, వారి కుటుంబీకులు, సన్నిహితులను కలిపి మొత్తం 26,000 మందిని హోం క్వారంటైన్‌లో ఉంచారు. దుబాయ్‌లోని ఒక హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్న ఆ వ్యక్తి తన తల్లి మరణవార్తతో గత నెల 17న భారత్‌కు తిరిగివచ్చారు. 20న తల్లి దినకర్మను నిర్వహించాడు. అయితే తాను దుబాయ్ నుంచి తిరిగి వచ్చిన విషయాన్ని అతడు అధికారుల వద్ద దాచాడు. మార్చి 27న భార్యతోపాటు తనకూ అనారోగ్యం రావడంతో దవాఖానకు వెళ్లారు. కరోనాగా అనుమానించిన వైద్యులు శాంపిళ్లను సేకరించి వారిని ఐసోలేషన్ ఉంచారు. కరోనా సోకినట్లు తేలడంతో తాను దుబాయ్ నుంచి వచ్చినట్లు అధికారులకు తెలిపాడు.

స్పెయిన్‌లో తగ్గుముఖం

- ప్రపంచవ్యాప్తంగా 68 వేలు దాటిన మృతులు
- 12 లక్షలు దాటిన కరోనా కేసులు

మాడ్రిడ్/పారిస్: ప్రపంచంలోని 190 దేశాల్లో కరోనా కేసుల సంఖ్య 12 లక్షలు దాటగా, మరణాలు 68,255కు చేరాయి. 1,28,948 కేసులు, 15,887 మరణాలతో ఇటలీ తొలిస్థానంలో కొనసాగుతున్నది. రెండోస్థానంలో ఉన్న స్పెయిన్‌లో వైరస్ తీవ్రత తగ్గుముఖం పట్టడం ఊరట నిస్తున్నది. గత మూడు రోజులుగా మరణాల సంఖ్య తగ్గిందని, ఆదివారం 674 మంది మరణించగా, మృతుల సంఖ్య 12,418కి, కేసుల సంఖ్య 1,30,759కి చేరినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రత్వశాఖ తెలిపింది. మరణాల పరంగా 9,351 సంఖ్యతో అమెరికా మూడోస్థానంలో ఉండగా కేసులపరంగా ప్రపంచంలోనే అత్యధికంగా 3,28,332 సంఖ్యతో తొలిస్థానంలో కొనసాగుతున్నది. ఫ్రాన్స్‌లో వైరస్‌తో చనిపోయినవారి సంఖ్య 7,560కి పెరిగింది. కరోనా బారినపడిన వారి సంఖ్య 89,953కి చేరింది. సింగపూర్‌లో వైరస్ సోకిన 72 మంది భారతీయుల్లో పదిమంది కోలుకున్నట్లు భారత హైకమిషనర్ తెలిపారు. విమాన సర్వీసులు నిలిచిపోవడంతో సుమారు 700 మంది భారతీయులు అక్కడ చిక్కుకుపోయారు.

రానున్నది గడ్డుకాలం

- భారీగా మరణాలు సంభవించవచ్చు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, ఏప్రిల్ 5: వచ్చే రెండు వారాలు అమెరికా అత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నదని, ఈ గడ్డుకాలాన్ని అధిగమించేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. కరోనా కాటుకు రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో మరణాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. అమెరికాలో కరోనా బారిన పడిన వారి సంఖ్య 3.20 లక్షలు దాటింది. 9100 మందికిపైగా మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో శనివారం శ్వేత సౌధంలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. 'అమెరికా అత్యంత గడ్డుకాలాన్ని చవిచూడబోతున్నది. భారీగా ప్రాణనష్టం జరుగువచ్చు. అయితే అమెరికా ఎన్నటికీ షట్‌డౌన్ కాకూడదు. దేశాన్ని ధ్వంసం కానివ్వబోం. సమస్య కంటే చికిత్స మరింత దిగజార్చేలా ఉండకూడదు. నేను ముందు నుంచీ ఇదే చెబుతున్నా' అని వ్యాఖ్యానించారు.

న్యూయార్క్‌లో శవాలను ర్యాకుల్లో భద్రపరిచిన దృశ్యం

మోదీజీ.. ఆదుకోండి

కరోనా రోజురోజుకూ కోరలు చాస్తున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్ సాయం కోరారు. మలేరియా వ్యాధి నివారణకు వినియోగించే హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను తమకు ఎగుమతి చేసి ఆదుకోవాలని భారత ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తిచేశారు. 'ఈ ఉదయం మోదీతో ఫోన్లో మాట్లాడాను. దేశ అవసరాల నిమిత్తం హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను ఎగుమతి చేయాలని విజ్ఞప్తిచేశాను. దీన్ని భారత్ తీవ్రంగా పరిశీలిస్తున్నది' అని ట్రంప్ చెప్పారు.

ఆ ఔషధాల ఎగుమతిపై నిషేధం

మలేరియా వ్యాధి నిరోధక ఔషధ ఎగుమతులపై భారత ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకొన్నది. తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు హైడ్రాక్సీ క్లోరోక్విన్ వంటి మలేరియా నిరోధక ఔషధాల ఎగుమతిపై నిషేధం కొనసాగుతుందని భారత ప్రభుత్వ ఫారిన్ ట్రేడ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం (డీజీఎఫ్‌టీ) శనివారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నోటిఫికేషన్ విడుదలైన కొన్ని గంటలకే ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఎగుమతి చేయాలంటూ కోరడం గమనార్హం. శానిటైజర్లు, వెంటిలేటర్లు, సర్జికల్ మాస్కులతో పాటు పలు వైద్య పరికరాల ఎగుమతులను నిషేధిస్తూ భారత ప్రభుత్వం కొన్ని వారాల కిందటే నిర్ణయం తీసుకొన్నది.

న్యూయార్క్‌కు చైనా వెంటిలేటర్లు

కరోనాతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న న్యూయార్క్‌ను ఆదుకొనేందుకు చైనా ముందుకొచ్చింది. విజ్ఞప్తిచేసిందే తడవుగా చైనా తమకు వెంటిలేటర్లు పంపినట్టు న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమో శనివారం వెల్లడించారు. చైనా నుంచి 1,000, ఒరెగాన్ రాష్ట్రం నుంచి 140 వెంటిలేటర్లు అందినట్టు ఆయన తెలిపారు. 17 వేల వెంటిలేటర్లను సరఫరా చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరామని, అయితే ప్రభుత్వం వద్ద 10 వేల వెంటిలేటర్లు మాత్రమే ఉండటంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో ఎగుమతి చేయాల్సిందిగా చైనాను కోరినట్టు ఆయన తెలిపారు.

కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు గానూ 21 టన్నుల అత్యవసర వైద్య పరికరాల్ని చైనా నుంచి భారత్‌కు తీసుకొచ్చిన ఎయిరిండియా విమానం

తబ్లీగీ వల్లే వేగంగా రెట్టింపు

- దేశంలో 4.1 రోజుల్లోనే కరోనా కేసులు డబుల్
- సదస్సు జరుగకుంటే 7.4 రోజులు పట్టేది: కేంద్రం

న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగిన తబ్లీగీ జమాత్ కార్యక్రమానికి హాజరైన వ్యక్తుల కారణంగా గత 4.1 రోజుల్లోనే దేశంలో కరోనా కేసుల సంఖ్య రెట్టింపయిందని, లేకుంటే 7.4 రోజుల సమయం పట్టేదని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొత్తగా 505 కరోనా కేసులు నమోదయ్యాయని చెప్పారు. దీంతో కేసుల సంఖ్య 3,577కు, మృతుల సంఖ్య 83కి పెరిగిందన్నారు. 274 మంది కోలుకున్నట్టు చెప్పారు. మరోవైపు దేశవ్యాప్తంగా పలుప్రాంతాల్లో తబ్లీగీ లింకులు బయటపడుతున్నాయి. గత నెలలో తమకు చెందిన నాలుగు విమానాల్లో ప్రయాణించిన ప్రయాణికులందరు కచ్చితంగా క్వారంటైన్‌కు వెళ్లాలని ఎయిర్ ఇండియా సూచించింది. ఈ విమానాల్లో ప్రయాణించిన ముగ్గురికి కరోనా పాజిటివ్‌గా తేలిన నేపథ్యంలో ఈ సూచన చేసింది. మరోవైపు తబ్లిగీ సమావేశాలకు హాజరైన ఎనిమిది మంది మలేషియా పౌరులు దేశం నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకున్నారు. మరోవైపు ఏపీలో ఒక్కరోజే 23 కేసులు నమోదయ్యాయి. దీంతో కేసుల సంఖ్య 226కు పెరిగింది. ఏపీ నుంచి తబ్లిగీ సమావేశాలకు వెళ్లినవారిలో ఇంకా 30 మంది ఆచూకీ తెలియలేదని అధికారులు తెలిపారు.

జిల్లాకో కరోనా పరీక్షల ల్యాబ్

జిల్లా కేంద్రాల పరిధిలో కరోనో వైరస్ నిర్ధారణకు టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) అడ్వైజరీ జారీచేసింది.

కరోనా క్లాక్

5-4-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు	12.56 లక్షలు
కోలుకున్నవారు	2,59,544
మరణాలు	68,255

దేశం	కేసులు	మరణాలు
అమెరికా	3,28,332	9,351
స్పెయిన్	1,30,759	12,418
ఇటలీ	1,28,948	15,887
జర్మనీ	99,862	1,550
ఫ్రాన్స్	89,953	7,560
చైనా	81,669	3,329
ఇరాన్	58,226	3,603
యూకే	47,806	4,934
టర్కీ	27,069	574
స్విట్జర్లాండ్	21,100	685

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు	4,111
కోలుకున్నవారు	315
మరణాలు	126

దేశంలో కరోనా కేసులు

మహారాష్ట్ర	తమిళనాడు	ఢిల్లీ
748	571	503
తెలంగాణ	కేరళ	ఉత్తరప్రదేశ్
334	314	278
రాజస్థాన్	ఏపీ	మధ్యప్రదేశ్
266	252	215
కర్ణాటక	గుజరాత్	కశ్మీర్
151	128	106
హర్యానా	పంజాబ్	ప. బెంగాల్
76	68	68

స్వీయ నిర్బంధంలో సీఆర్పీఎఫ్ డీజీ

న్యూఢిల్లీ: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) డైరెక్టర్ జనరల్ మహేశ్వరి (59) స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. ఈ నెల 2న ఓ వైద్యుడికి వైరస్ సోకడంతో కేంద్ర హోంశాఖ సీనియర్ భద్రతా సలహాదారు కే విజయ్‌కుమార్ సహా 24 మంది ఉన్నతాధికారులు క్వారంటైన్‌లోకి వెళ్లారు. విజయ్‌కుమార్, డీజీ మహేశ్వరి గతవారం విమానంలో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారు.

విద్యాసంస్థలను తెరువడంపై 14న సమీక్ష

న్యూఢిల్లీ: దేశంలోని విద్యాసంస్థల పునఃప్రారంభంపై ఈ నెల 14 సమీక్షిస్తామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పొఖ్రియాల్ పేర్కొన్నారు. ఆ తర్వాతే పాఠశాలలు, కళాశాలలను తెరువడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

సోనియాతో మోదీ చర్చ

న్యూఢిల్లీ: దేశంలో కరోనా పరిస్థితులపై విపక్ష పార్టీ నేతలతో ప్రధాని మోదీ ఆదివారం చర్చించారు. ప్రధాని చర్చలో పాల్గొన్న వారిలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, మాజీ రాష్ట్రపతులు ప్రణబ్, ప్రతిభా పాటి ల్, మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, దేవెగౌడ తదితరులు ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. కరోనా పరిస్థితులపై చర్చించేందుకు ఏప్రిల్ 8న మోదీ మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. దీనికి హాజరు కావాల్సిందిగా తెలంగాణ సీఎం కేసీఆర్, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో పాటు పలువురు పార్టీ నేతలకు ఆహ్వానం అందినట్టు అధికారులు వెల్లడించారు.

నిత్యావసరాల సరఫరాపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ నేపథ్యంలో నిత్యావసరాల సరఫరాపై కేంద్రం దృష్టిసారించింది. తయారీ సంస్థలు రవాణా, కూలీల కొరత సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో లారీ డ్రైవర్లు, కూలీలను ఆయా పనులకు వెళ్లేందుకు అనుమతించాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది.

- 2019 ఏప్రిల్ 4.. సందర్శకుల హడావుడి

- 2020 ఏప్రిల్ 5.. కరోనా దెబ్బకు ఎడారి

నిత్యం వేలాది సందర్శకులతో సందడిగా కనిపించే ఇంగ్లాండ్‌లోని బ్రైగ్‌టన్ నగరంలో ఉన్న బ్రైగ్‌టన్ అండ్ హోవ్ బీచ్.. కరోనా ప్రభావంతో ఇలా నిర్మానుష్యంగా మారింది.

లాక్‌డౌన్ పొడిగిస్తారంటూ.. సోషల్ మీడియాలో నకిలీవార్త

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: వదంతులు వ్యాప్తిచేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా కేటుగాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. గాలివార్తలు పోగేసి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. భారత్‌లో లాక్‌డౌన్‌కు సంబంధించి తాజాగా ఒక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దేశంలో లాక్‌డౌన్ ఏవిధంగా నిర్వహించాలన్న దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాలు జారీచేసిందని అందులో పేర్కొన్నారు. దీని ప్రకారం మొదటి విడుతలో ఒక రోజు, రెండో విడుతలో 21 రోజులు, అనంతరం ఐదు రోజులు విరామం ఇచ్చి మూడో విడుతలో 28 రోజులు, ఆ తర్వాత ఐదురోజుల విరామం అనంతరం మళ్లీ 15 రోజులు లాక్‌డౌన్ విధిస్తారంటూ ప్రచారం చేస్తున్నారు. మనదేశంలో ఇప్పటికే రెండో దశ లాక్‌డౌన్ నడుస్తున్నదని, ఏప్రిల్ 14 తర్వాత ఐదు రోజులు విరామం ఇచ్చి, మళ్లీ లాక్‌డౌన్‌ను పొడిగిస్తారని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ వట్టి పుకార్లేనని తేలింది. లాక్‌డౌన్‌కు సంబంధించి డబ్ల్యూహెచ్‌వో ఎలాంటి అధికారిక మార్గదర్శకాలు జారీచేయలేదు.

కరోనాపై 80% తప్పుడు వార్తలు

- సామాజిక మాధ్యమాలపై ప్రజాభిప్రాయం

నాగపూర్: కరోనాపై సామాజిక మాధ్యమాల్లో 50-80 శాతం మేర తప్పుడు వార్తలు లేదా సమాచారం ప్రచారమవుతున్నదని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. నాగపూర్‌లోని రాష్ట్రసంత్ తుకోజీ మహరాజా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ విభాగం మార్చి 28 నుంచి ఏప్రిల్ 4 వరకు ఓ సర్వే చేసింది. వివిధ రంగాలకు చెందిన 1200 మందికి పలు ప్రశ్నలు సంధించింది. సామాజిక మాధ్యమాల్లో 50-80 శాతం తప్పుడు వార్తలు వస్తున్నట్లు 39.1 శాతం మంది చెప్పగా 80 శాతం అవాస్తవమేనని 10.8 శాతం మంది పేర్కొన్నారు. అధికార వర్గాల ద్వారా తెలిసిన తర్వాత తాము చూసింది తప్పుడు సమాచారమని గ్రహించినట్లు 36.5 శాతం చెప్పారు. మీడియా అతిగా స్పందిస్తున్నదా అన్న దానికి 32.7 శాతం మంది అవునని, 32.3 శాతం మరో అభిప్రాయాన్ని చెప్పగా, 34.9 శాతం తటస్థంగా ఉన్నారు.

తండ్రిని చూసేందుకు.. సైకిల్‌పై ముంబై టు కశ్మీర్

ముంబై/రాజౌరీ: దవాఖానలో ఉన్న కన్న తండ్రిని చూసేందుకు ఓ కొడుకు కనీవినీ ఎరుగని సాహసం చేశాడు. జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లకు చెందిన మహ్మద్ ఆరిఫ్ (36) ముంబైలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో ఉన్న తండ్రికి గుండెపోటు వచ్చిందని ఈనెల 1న సమాచారం అందడంతో కశ్మీర్‌కు వెళ్లాలనుకున్నాడు. లాక్‌డౌన్ నేపథ్యంలో రవాణా స్తంభించడంతో తోటి ఉద్యోగి పాత సైకిల్‌ను రూ.500కు కొనుగోలు చేసి ప్రయాణాన్ని మొదలుపెట్టాడు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న సీఆర్పీఎఫ్.. అతడి తండ్రిని రాజౌరీ జిల్లా దవాఖానకు తరలించి చికిత్స అందించింది. ఈ సంగతిని ఆరిఫ్‌కు చెప్పిన అధికారులు కశ్మీర్‌కు రావద్దని సూచించారు. అయితే, ఆరిఫ్ తన తండ్రిని చూడకుండా ఉండలేకపోయాడు. అష్టకష్టాలు పడుతూ ఆదివారం గుజరాత్ వరకు చేరుకున్నాడు. స్థానిక పోలీసులు మొదట అడ్డగించినా.. విషయం తెలుసుకున్న తర్వాత చలించిపోయారు. కశ్మీర్ వెళ్తున్న ఓ ట్రక్కులో ఆరిఫ్‌ను పంపారు.



నిర్జనమ్

మొట్టమొదటి సారిగా నగరంలో కోడి కూసింది
నిర్నిద్ర రాగాలలో సోలిపోయే నగరం
వేకువకు ముందే కళ్ళు విప్పి నిద్ర లేచే జనం
ఈ రోజు బారెడు పొద్దెక్కినా
బండెడు మెసేజ్‌లు In box లో మేట వేసినా
ఇంకా మంచం దిగలేదు..
దేహం పైనా ముక్కు చుట్టూ మాత్రమే కాదు
కన్రెప్పల పైన కూడా ముసుగు మాస్క్‌ని తొలగించ లేదు
బస్తీల నుండి బంజారా హిల్స్ వరకు
శామీర్ పేట నుండి శంషాబాద్ వరకు
కూకట్ పల్లి నుండి కర్మాన్ ఘాట్ వరకు
ఎవరి ఇళ్లల్లో వాళ్ళు గృహ నిర్బంధ ఖైదీలు
ఇప్పుడు నగరం మొత్తం ఓ బందీఖానా..!

ఇప్పటి దాకా దేశాల మధ్య సరిహద్దు కంచెలు
రక్షణ వలయాలు భద్రతా బలగాల పహారాలు
కరచాలనాలే ఖడ్గ చలనాలు – ఆలింగనాలే ఆయుధ సంపదలు
సామీప్యతలే అధికారాలు – సమక్షాలే ప్రాముఖ్యతలు
ఇవన్నీ.. వందలాది ఏళ్లుగా వాళ్ళు నిర్మించిన విలువలు!
రేణువు రేణువుతో కట్టుకున్న ఇసుక గూడులు!
సమాజమే బలం – సమూహమే స్థిరం
సమైక్యతే ప్రగతి – సంఘటితమే జగతి
ఇప్పటిదాకా వాళ్ళు రచించిన కీర్తనలు..!

అంతేనా.. సూత్రాలు–సిద్ధాంతులు ,తత్వాలు–
దార్శనికులు, మానిఫెస్టోలు– మహనీయులు
సమాజాన్నంతా రంగులు, వర్గాలు, కులాలుగానే లెక్కించారు
మతాలు, దేశాలు, జాతులుగానే చూసారు
ఐక్యత– సంఘీ భావం అంటే వాళ్ల మధ్య మాత్రమే ఏకత్వం అని
జాతి స్పృహను, రంగు సోయిని, దేశీయ చైతన్యాన్ని రగిలించారు..!

కానీ, కరోనా.. యెంత పని చేసావు?
వేలాది ఏళ్లుగా వాళ్ళు సృష్టించిన సౌధాలను నేల కూల్చావు
శరీర స్పృహను అందరిలో కొత్తగా ఎగదోసి
దేహ భక్తి లోనే దేశ భక్తి ఉందని
Thermal Screening తో నిర్ధారణ చేసావు
కలిసి పోయి కాకుండా విడిగా ఉండటంలోనే మనుగడ ఉందని
Social Distance సాక్షిగా నిరూపించావు..!
వ్యక్తి గొప్పా సమాజం గొప్పా అనే చిరంతన అనాది ప్రాచీన చర్చలో
వ్యక్తి తత్వానికే పట్టాభిషేకం చేసావు
మీసాలు మెలేసే సామ్రాజ్యాలను సరెండర్ చేయించి
సలాం చేయించుకున్నావు!
డౌన్ డౌన్.. పెన్ డౌన్.. గన్ డౌన్ మాత్రమే తెల్సిన సమాజాలకు
Lock down మంత్రాన్ని సరికొత్తగా నేర్పించావు
డిజిటల్ క్లాక్ తళుకుల మధ్య పరుగులు పెట్టె గుంపులన్నిటినీ
స్వయం రక్షకులని చేసి గృహ గస్తీలోకి మళ్ళించావు
ఎవరికి వారే జీవించే అపార్ట్ మెంట్ సమయాలలోకి
మరింత అపనమ్మకపు పొగను Spray చేసావు
రన్ వే నుండి ఆకాశంలో తేలిపోయే విమానాలన్నిటినీ
వాటిలో ఎగిరెళ్లే స్వప్నాలన్నిటినీ లాక్కొచ్చి Hangerలో నిలిపేసావు
నగరం రోడ్ల వైశాల్యాన్ని నగ్నంగా చూపించి
Dooms Day భీభత్స సౌందర్యాన్ని గ్రాఫిక్స్ లేకుండా ఆవిష్కరించావు!

కరోనా.. కరోనా..Great Wall ను దూకి వచ్చిన
క్షణాల్లోనే ఎంతో పని చేసావు?!
సరస్సులో చేప పిల్లలా బిజీగా ఉండే నగరాన్ని నిర్జనం చేసి
నా ఇంట్లోనే నన్ను Isolation లో పెట్టి
ఏనాడో తొక్కిపెట్టిన నాలోని మానవుని
Mummy ని పునరుజ్జీవితుణ్ణి చేసావు
ఆఖరికి ఇక్కడి ఒక్కో దేహాన్ని ఒక్కో దేశంగా మార్చావు..!

–మామిడి హరికృష్ణ, 8008005231

నీవే భయానివేమో!

ఈ కష్టసమయంలో నాకు నీవు, ఎదురుగా కనబడుతున్నావు..
అలలు ఎగసి పడుతున్నా.. అందంగా కనబడుతున్నావు
ఆకాశంలో సూర్యుడు అసహాయుడుగా.. నీవు మాత్రం ఎదురుగా
అందరూ తలుపులు వేసుకున్నారు, నీవు బయట తిరుగుతున్నావు..!
నీకు భయం లేదా.. భయానికి కారణం నీవేనేమో.. నీవే భయానివేమో...
వందలుగా వాహనాలుండేవి, తలలు వంచుకుని కూచున్నాయా, నిద్రపోతున్నాయా
అందరూ అందంగా తయారయి తిరుగుతుండేవారు
అమాంతం నిశ్శబ్దంగా ఇంట్లో పడి ఉన్నారు
కాలింగ్ బెల్ మోగదు, కాళ్ల చప్పుడు వినిపించదు
ఆలోచనలు ఎక్కువయ్యాయి, అలవాటులేని పద్ధతి..
అంతర్నేత్రం ఎక్కడుంది, ఏమన్నా చూపిస్తుందేమో..!
అంతా యంత్రాలలాగా హాయిగా బతుకుతున్నాము గదా..
ఇప్పుడేమిటీ కొత్త అనుభవం..!
అలలు మనసులో అల్లరి చేస్తున్నాయి.. అయినా నీవు అందంగా కనబడుతున్నావు
అప్పటి వరకు నా ప్రపంచంలో నేను ఎప్పటి లాగే..
అనుకోని ఆలోచనలలో, ఆనందంలో, ఆత్మచింతనలో..
అందరి మధ్యన ఒంటరిగా, మందల మధ్యన ఒంటరిగా..
ఎప్పటిలాగే.. అనుమానం లేకుండా.. ఎవరికీ అనుమానం రాకుండా...

ఇంతకూ నీవెవరు.. చూచాను.. నేనే నీవు...
అంటే అనుమానం ఆకారం నేను, అనుమానం ఆధారం నేనే...
నాలో ధైర్యం నేనే, స్థైర్యం నేనే, మరెవరికొరకో..
నేను ఆగనవసరం లేదు.
అంతా చక్కబడుతుంది.
ఆ లోపల నీవు అంటే నేను
అంతులేని సముద్రాలు దాటి అందరినీ క్షేమం అడుగుదాం..
అందుకే ఎవరికీ కనబడకుండా మసలుదాం..
ఎంత సౌకర్యంగా వచ్చింది ఈ సంకటం..!
ఎన్నడూ ఎవరూ ఊహించని, నటించని నాటకం..
కాదంటే అందరూ ఇంత బుద్ధిగా కడప వదలకుండా
కడుపులో చల్ల కదలకుండా ఉండేది కలలో కూడా తోచలేదుగదా..
అంతా చక్కబడుతుంది.. అప్పటివరకూ ఓపిక ఉంది.. ...

– డాక్టర్ కె.బి.గోపాలం, 9849062055

‘శిశుర్వేత్తి పవుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః’ అన్న మాటలు మనకు తెలుసు. శిశువునైనా, పశువునైనా గానం ఆకర్శిస్తుందన్నది అక్షర సత్యం. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ‘శిశువు ముందు పశువైనా తలవంచునులే’ అంటారు. పిల్లలనైనా పెద్దలనైనా ఇట్టే ఆకట్టు కుంటుంది గీతం, పాట. నిజానికి బాల సాహిత్యం ఎప్పుడు పుట్టిందో తెలియదు. చిన్న పిల్లల మనసెరిగిన తల్లులు, పెద్దవాళ్లు తొలి బల సాహిత్య స్రష్టలుగా కనిపిస్తారు. ‘బాల వాఙ్మయంలోని చాలా పాటలకు, కథలకు తల్లి హృదయమే కర్తృత్వం వహిస్తుంది’ అంటారు. మనమందరం బాల్యంలో అమ్మపాడే జోలపాటలు విని ఎదిగిన వాళ్లమే. ‘చిట్టి చిలుకమ్మ.. అమ్మకొట్టిందా ’, ‘చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ’ అంటూ ఆడుతూ పాడుతూ గడిపిన వాళ్లమే. తొలినాటి బాల సాహిత్యమంతా జానపద గేయాలు, కథలు, పొడుపు కథల వంటి వాటిద్వారా వచ్చిందే. శిష్ట సాహిత్యం కంటే ముందు వెలసిన సాహిత్యమిది. ఇందులో లాలి పాటలు, జోల పాటలు, ఆటల పాటలు, పండుగ పాటల వంటివి అనేకం ఉన్నాయి. వీటికి తోడు వందలాది మంది బాల సాహితీవేత్తలు పిల్లల కోసం నిరంతరం గొప్ప బాల సాహిత్య సృజన చేస్తున్నారు. ఇటీవల ఒక దశాబ్ది కాలంగా తెలుగు రాష్ట్రాల్లో బాల సాహిత్యం విరివిగా వస్తున్నది. కొత్త పుంతలు తొక్కుతున్నది. అన్ని ప్రక్రియల్లో లాగానే బాల సాహిత్యం లోనూ వివిధ ప్రయోగాలు, అస్థిత్వ వాదాలు చోటుచేసుకోవటం గమనార్హం.

నాన్సెన్స్ రైమ్స్

ఆంగ్లాన్ని వెక్కిరించేలా తెలుగు గుబాళింపుల | బాల లయలు

తెలుగునాట బాల సాహిత్యం, బాల సాహిత్య వికాసం అనగానే గుర్తు కు వచ్చే పేర్లల్లో బాలా సాహితీ వేత్త డాక్టర్ పత్తిపాకమోహన్ ఒకరు. మన బడి పిల్లలను రచయితలుగా చూడాలన్న ఉద్దేశ్యంతో వందలాది కార్యశాలలు, కార్య క్రమాలు రూపొందించి తెలుగు బాలసాహిత్యంలో కొత్త విప్లవంగా తలెత్తిన ‘బాల బాలిక రచనల ఉద్యమం’కు ముందు వరుసలో నిలబడ్డారు. బాలల కోసం వందలాదిగా గేయ సంకలనాలు, గేయ సంపుటులు వస్తున్నాయి. అంద మైన బొమ్మలతో బాల బాలికలను అలరిస్తున్నాయి. బడికి వెళ్లే మన చిన్నారి బాల బాలికలు ఇంటికి వచ్చి ముద్దు ముద్దు పలుకులతో **‘రింగా రింగా రోజెస్’** వంటి రైమ్స్‌ను, లయ తప్ప అర్థంలేని ఆంగ్లభాషలోని **‘నాన్‌సెన్స్ రైమ్స్’**ను పాడు తూ, హావ భావ విన్యాసం చేస్తుంటే తల్లిదండ్రులుగా మనం సంతోషపడుతు న్నాం. ఈ నేపథ్యంలోనే తెలుగులోనూ పిల్లల కోసం ‘నాన్‌సెన్స్ రైమ్స్’ రాస్తే ఎలా ఉంటుంది అంటూ పత్తిపాక మోహన్‌కు కలిగిన ఆలోచనకు అక్షరరూపం ఈ **‘అ ఆ ఇ ఈ’బాల లయలు**. నాన్సెన్స్ రైమ్స్‌ను **‘బాల లయలు’** అన్నారు కవి మోహన్. పిల్లల కోసం ఇప్పటికే ఎన్నో కథలు, గేయాలు, పాటలు వచ్చినప్పటికీ **‘బాల లయలు’**లోని లయ పిల్లల్ని ఎంతగానో ఆకర్షిస్తున్నది.

నేటి పోటీ ప్రపంచంలో, యాంత్రిక వాతావరణంలో పెరుగుతున్న పిల్లలకు మానవ సంబంధాలు, సంబంధ బాంధవ్యాల గురించి బొత్తిగా అవగాహన లేకుండా పోతున్నది. బంధాలు, బంధుత్వాల మాట పక్కన పెడితే.. చిన్నమ్మ, అత్తమ్మ, బాబాయి, మామయ్య లాంటి పదాలకు అర్థాలే తెలియకుండా పోతు న్నాయి. మరి ఇప్పుడు పిల్లల్లో విలువలు ఎలా పెంపొందించాలి? పిల్లల మన సులు వికసింప చేసే బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్న ఏ ఒక్కరిదో కాదు, మనంద రిది. ఆలోచించాల్సిన బాధ్యత కూడా అందరిది. యంత్రాల్లాగా పిల్లలు, తల్లిదం డ్రులు ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు ఒక మూస పద్ధతికి అలవాటు పడిపోయారు. ఇటువంటి సందర్భంలో ఆరోగ్యం, అలవాట్లు, కుటుంబ విలు వలు, పర్యావరణం, ఇతిహాస గాథలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని సరళమైన భాషలో, దైనందిన బాలల ప్రపంచానికి దగ్గరగా ఉంచటం కొంచెం కష్టమే. అయినప్పటికీ పిల్లలు సహజ సిద్ధంగా నేర్చుకొని, సమగ్ర వికాసాన్ని పెం పొం దించే చక్కని తాయిలాన్ని **‘బాల లయల’** రూపంలో మన ముందుంచారు పత్తిపాక మోహన్.

పిల్లల కోసం.. మన కవులు ‘చందమామ రావె’, ‘వెన్నముద్దలు’, ‘ఆకుపచ్చని పాట’, ‘స్వచ్ఛ సర్వేక్షణ’ బాలల గేయాలు, ‘ఒక్కేసి పువ్వేసి చంద మామ’, ‘పిల్లలకోసం సినారె కథ’, ‘బాలల తాతా బాపూజీ గాంధీ గేయాలు’, ‘గేయ కథ’ వంటివి ప్రచురించారు. ఇవే కాకుండా ‘పిల్లల కోసం మన పాటలు’, ‘పిల్లల కోసం పొడుపు కథ లు’, ‘వానా వానా వల్లప్ప’ బాల గేయాలు, ‘ఆకు పచ్చని ఆశల తో’ తెలంగాణ బడి పిల్లల అక్షర సంతకాలకు సంపాదకత్వం వహించారు. ఆంగ్లం, ఇతర భారతీయ భాషల్లోంచి పదహారు పుస్తకాలు పిల్లల కోసం తెలుగులోకి అనువ దించారు. ఇప్పుడు వీటన్నిటికి భిన్నంగా ఒక వినూత్న మైన రీతిలో పిల్లల కోసం **‘అఆఇఈ’ బాల లయల** ను మనకు అందించారు.

ఈ బాల లయల సంపుటి రూపంలోనే కాక విష యంలోనూ కొత్తదనాన్ని సంతరించుకున్నది. ఈ బాల లయలన్నీ మన వర్ణమాలలోని **అ** నుండి **ఆ** వరకు గల అక్షరాలను ఉపయోగించి రాసినవి. ప్రముఖ బాల సాహితీవేత్త భూపాల్ తన చిట్టిపొట్టి గేయాలను **‘బాల లయలు’** అన్నారు. అంటే మోహన్ పేర్కొన్నట్టు చాలా సందర్భాలలో లయ తప్ప అర్థం లేని ద్విపదలు లేదా బాల లయలు ఇందులో ఉన్నాయి.

ఆధునిక కాలంలో గేయం ఒక ప్రత్యేక ప్రక్రియగా వెలుగొందింది. గతంలో ఈ గేయ రూపంలో చాలా మంది పిల్లలకు అక్షరాలను, పదా లను పరిచయం చేశారు. కానీ చిన్న చిన్న పిల్లలను సైతం ఆకట్టుకునేలా రాస్తే బాగుంటుందని, వాటిని బాల బాలికలకు సుల భంగా కంఠ స్థం అయ్యేలా ఉండాలనే వర్ణమాల లోని అన్ని అక్షరాలను **‘లయలు’**గా కూర్చారని వీటిని చూస్తే తెలు స్తుంది. ఏది ఏమైనా మన పిల్లలకు పద సంపదను పరి చయం చేయటంతో పాటు హాయిగా పాడుకుంటూ ఆడుకోవడానికి అనుగుణంగా రాయటమే ఈ **‘బాల లయ’** ఆంతర్యమని మోహన్ ఉద్దేశం. ఈ బాల లయ లన్నీ రెండు రెండు వరుసలకు కలిపి ఒక ఇతివృత్తాన్ని కలిగిఉంటూ ‘ద్విపద’లను తలపిస్తున్నాయి.

యాభైనాలుగు పేజీల ఈ పుస్తకంలో ‘అ’ మొదలు ‘ఱ’ వరకు వర్ణమాలలోని అక్షరాలతో మొదలయ్యే పదాలతో అల్లిన గేయ లయలు ఉన్నాయి. ‘శ్రీరామ రక్ష’ ఇందులోని మొదటి లయ. తనకు చిన్నప్పుడు అక్షర భిక్షను పెట్టిన సిరిసిల్ల జిల్లా పరిషత్ పాఠశాల సార్లను తలుచుకుంటూ రాసాడు కవి.

‘మనుషులుగా తీర్చిదిద్దిన/సర్కారు బడులే శ్రీరామ రక్ష’ అంటారు. సర్కారు బడులే తొలి తరం సాహితీవేత్తలం దరికి శ్రీరామరక్షగా నిలిచి అక్షర భిక్షను పెట్టాయి.

‘అమ్మ మొదటి దైవము/అవని తల్లితో సమం’
అరక దున్ను పరికరం/అన్నదాతయే ఘనం’

అమ్మ, అవని, అరక, అన్నదాత వంటి పదాల పరి చయం చేసే విధానం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.

‘క్షత్రియుడు వీరుడు/యుద్ధంలో ధీరుడు
అర్జునుని పేరు ఫల్గుణుడు/ పాండవులలో మధ్యముడు
భీష్ముడు శపథం చేసాడు/ కృష్ణుడు గోవులు కాసాడు
అర్జునుడు శరం వేసాడు/ హనుమ శరధి దాటాడు
సీతారాముల చరితము/ వాల్మీకి రామాయణము..’

వంటివి అనేక అంశాలతో పాటు ఆలోచనా పరిధిని పెంచడంలో బాలలకు చక్కగా దోహదం చేస్తాయి.

ఆంగ్లంలోని నాన్సెన్స్ రైమ్స్ కేవలం పిల్లల్లో జ్ఞాపక శక్తిని, నాలుక తిరగడానికి సాయ చేస్తే, పత్తిపాక మోహన్ రాసిన ఈ తెలుగు లయలు వీటితో పాటు, పురాణేతిహాసాలను, భారతీయ సాంస్కృతిక వార సత్వం పట్ల ఆసక్తి కలిగించటాన్ని చేశాయి. ఇవి కేవలం ఏ ఒక్క అంశం వద్ద ఆగిపోలేదు. అన్ని విషయాలను అంశాలను స్పృశించాయి. అదే కోవలో..

యమునా నది నల్లన/ తాజ్‌మహల్ తెల్లన
మల్లెపూలు తెలుపు/ మందారం ఎరుపు
టమాటలు ఎర్రన/ మంచుకొండ తెల్లన అంటూ

తెలిసిన అంశాన్ని పిల్లలకు మరింతగా తెలిసేట్లుగా చెబుతూనే, రంగులు, ప్రాంతాలు, కట్టడాలు వంటి వాటిపట్ల అవగాహన కలిగించే అంశాలు అందులో ఉండటం విశేషం.

అలాగే..

ఉదయం పూట లేవాలి/ ఉతికిన బట్టలు కట్టాలి
ఓనమాలు నేర్వాలి/ ఓంకారం పలకాలి
పనికెందుకు తొందర/ పంకలా బలపం ముందర
తప్పక బడికి వెళ్లాలి/ చెప్పే పాఠం వినాలి
చద్దన్నం తిందాం/చదువులన్నీ చదువుదాం..

అంటూ బాలలకు నైతిక వర్తనకు సంబంధించిన విష యాలను సరళమైన భాషలో లయబద్ధంగా పాడుతూ నేర్చుకుంటారు.

ప్రపంచీకరణ పుణ్యమా అని మనం అన్నింటిని మరిచిపోతున్నాం. పండుగల ప్రాముఖ్యతను విస్మరి స్తున్నాం. ఎంత సేపు సెల్‌ఫోన్ కంప్యూటర్లు అంటూ కలవరించే వారికి ఆలోచననే కాక, కనువిప్పు కలిగిస్తాయి.

–వడ్డేపల్లి సంధ్య, 7036000123

మనిషికీ చెవుల్లేవు

బుర్రలేని వైరస్‌ను నిందించలేను.మన్నించాలి. గమ్యం లేని సూక్ష్మక్రిమిని తూలనాడలేను. ఎవరినీ సమ ర్థించలే ను. ఏ నీతినీ తప్పు పట్టలేను. దీనికి కారణం ఏ ఒక్కరినీ చూపలేను. ఏ దేశాన్నీ, దేశాధినేతలను బోనులో నిలబెట్టలేను.. ఏమంటాను మరి...

సర్ పీటర్ మెడావర్ అనే శాస్త్రవేత్తను స్మరిస్తాను. వైర స్‌ను నిర్వచిస్తూ ఆయన ఏమన్నాడంటే... **‘పీస్ ఆఫ్ బ్యాడ్ న్యూస్ రాప్‌డ్ అప్ ఇన్ ఎ ప్రొటీన్’**. ప్రొటీన్ కాగితంలో చుట్టచుట్టిన దుర్వార్తగా అనువదించనూ లేను..

ఓ మహాశాస్త్రవేత్తా.. జాషువా లెడర్‌బర్గ్ ఏమన్నావేమ న్నావు.. **‘ది సింగిల్ బిగ్గెస్ట్ థ్రెట్ టు మీన్స్ కంటిన్యూడ్ డామినన్స్ ఆన్ ది ప్లానెట్ ఈజ్ వైరస్’** అని కదా వచించా వు, ప్రవచించావు.ఎవడు విన్నాడెవడు విన్నాడు నీ మాట. ఎవడు కన్నాడెవడు కన్నాడు శాస్త్ర సత్యాన్ని..

ఆ ఒక్క పదం ఉంది చూశావూ.. కొనసాగుతున్న మాన వ ఆధిపత్యానికి భూ మండలం మీద పొంచి ఉన్న పెను ప్రమాదం.. వైరస్ వల్లనే అని. అది సత్యం, అదే సత్యం.

మనిషి, వైరస్ సృష్టిలో కవల పిల్లలు. లాసా, ఎబోలా, హంటా, హెచ్ఐవీ, హెచ్ఐఎన్ఐ.. ఒకటా రెండా.. అన్ని టితోనూ యుద్ధమే..!

1976 గుర్తుందా.. ఉత్తర జైరేలో అటవీప్రాంత గ్రామం.. యంబకు. ఓ ఉపాధ్యాయుడు తలనొప్పి జ్వరం తో స్థానిక మిషన్ స్టేషన్‌కు వచ్చాడు. బెల్జియన్ నర్సమ్మలు యాంటి మలేరియా ఇంజెక్షన్ ఇచ్చారు. అతనిది మలేరి యా కాదు, ఎబోలా. వైద్యం చేసిన నర్సు, అతని కుటుం బమూ ఎబోలాకు బలైపోయింది. 318 మందికి సంక్ర మించి 280 మందిని ఆ చిన్న సూక్ష్మజీవి తన వెంట తీసు కు పోయింది.

నైజీరియాలో లాసా జ్వరాలు, అమెరికాలో హంటా వైరస్‌లు విధ్వంసం మానవాళికి కొత్తేమీ కాదు. అంతెందు కు హెచ్ఐవి మాత్రం తక్కువ తిన్నదా. మానవాళి లైంగిక నీతులను బట్టబయలు చేసింది. బ్యాక్టీరియాలు వేరు, వైర స్‌లు వేరు. పురుషులు స్త్రీలు వేర్వేరే కదా. ప్రకృతి రెండో ప్రకృతి వేరు కదా. విజ్ఞానమూ, నాగరికత వేరు వేరు కదా. తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేయలేని నిస్సహాయ మాన వులం కరోనాతో ఏం పోరాడుతాం.

నా కులము, నా పక్కింటి వారి కులమూ వేర్వేరే కదా. ఒకే అపార్ట్‌మెంట్‌లో మీ వాళ్ళూ మా వాళ్ళూ వేరే కదా. నీ కారు, నా కారు ఒకే కంపెనీవి కాదు కదా.

ఏవో బ్యాక్టీరియాలంటావా, ప్రొటోజువాలంటావా, ఫంగి వేరు, అన్నీ చంపవు అంటావా.. కొన్నే చంపుతాయి. కానీ.. వైరస్‌లు అలా కాదు. మనుషుల నుంచి చాలా డిమాండ్ చేస్తాయి. అవి కూడా బతకాలి. కొన్నిటికి పున రుత్పాదించాలి. అది సజీవ కణాల్లోకి వెళ్ళాలి. లోపలికి వెళ్ళాక అవి తీసుకోవటమే తప్ప ఇచ్చేదేమీ ఉండదు.

నేను తీసుకోవడంలా ప్రకృతి నుంచి.. తిరిగి నేనేమైనా ఇచ్చానా.. నా కారు తాళాలిచ్చానా? నా ఏటీఎం కార్డు ఇచ్చానా.. లేదే..! కనుక మనలాగే వైరస్‌లు పరాన్నజీవులే. కనీసం అవి కణాలు కూడా కావు. అవి ఒర్థి పార్టికల్స్. వాటికి ఎనర్జీ సోర్సేమీ ఉండదు. అవి ప్రొటీన్లను ఉత్పత్తి చేసుకునే సెల్యూలార్ యంత్రాంగమూ ఉండదు. ప్రతి పార్టికల్స్ చుట్టూ జన్యు పదార్థం ఉంటుంది. ప్రొటీన్ షీట్ ని కాపాడేదే కాప్సిడ్. మన చట్టూ లేరేంటి అధిక్యవాదులు. వైరస్ అంటే 400 జన్యువులంత. అదే మనిషికి ముప్పై వేల జన్యువులు నో ప్రయోజనం. జన్యు సంకేతమే గొప్ప ది. ఈ చిన్న జన్యు పదార్థ శకలాలు వాటిని పునరుత్పా దించుకోవడానికి సంకేతాలను మోసుకు తిరుగుతాయి. లివింగ్ సెల్ లోకి రావటమే ఆలస్యం.. అంతా వాటి నియంత్రణే. అవేమీ చేయవు.. దేహాన్ని వైరస్ ఫ్యాక్టరీగా మార్చుకంటాయి. వ్యాధినిద్దాం, జబ్బు చేద్దాం అనే దృష్టి తో రావు వైరస్‌లు. మానవ బలహీనతలే వాటి బలం. పది రోజులు ఇంటి పట్టున ఉండలేనోడివి.. పది సార్లు చేతులు శుభ్రంగా కడుక్కోలేనోడివి.. సంక్షోభంలో ప్రభుత్వం చెప్పి న నాలుగు నియమాలు అమలు చేయలేనోడివి...

నువ్వు అనబడే మనిషివి. నేను అనబడే నరుడిని, అభం శుభం ఎరుగని వైరస్‌లతో ఎలా నెగ్గగలవ్? కవులం అట మేము. కవనమట మాది. ఏ ఒక్కడిని మార్చలేకపో యిన వాళ్ళం. నాలుగు ధైర్యవచనాలు మాత్రమే చెప్ప గలం. చెవులు వైరస్‌కు లేనట్టే మనిషికీ లేవు.

– సీతారాం

నువ్వు నా అతిథివి మాత్రమే అధినాయకుడివి కావు!

మనం మన లోకంలో నిద్రపోయాం
లేచేసరికి మరో లోకంలో ఉన్నాం

డిస్నీ తన మ్యాజిక్‌ను కోల్పోయింది
ప్యారిస్ ఇక రొమాంటిక్ కాదు
న్యూయార్క్ ఆకర్షణీయం కాదు
చైనా గోడ దుర్గమ దుర్గం కాదు
మక్కా ఖాళీగా ఉంది కదూ!

హఠాత్తుగా కౌగిలింతలూ ముద్దులే
ఆయుధాలైపోయాయి
ఇప్పుడు తల్లిదండ్రులను, మిత్రులను
కలవకుంటేనే ప్రేమున్నట్టు!

అకస్మాత్తుగా అధికారం, అందం, డబ్బు
అన్నీ నిష్ఫలమే
అవేవీ మనకు ప్రాణవాయువునివ్వలేవు

ప్రపంచం సాగుతూనే ఉంది
అది అందంగానే ఉంది
కేవలం అది మనుషులను బోనులో
బంధించింది.
ఇది ప్రకృతి ఇస్తున్న సందేశమేమో!

మనిషీ
ఈ భూగోళంపై నీ అవసరమేమీ లేదు
నీవు లేకుంటేనే ఈ భూమి, గాలీ నీరూ
ఆకాశం స్వచ్ఛంగా ఉంటాయి.
నీవు మళ్ళీ వస్తే– ఇల్లు దాటి వస్తే...
గుర్తుంచుకో–
నా అతిథిగా మాత్రమే ఉండాలి
అధినాయకుడిలా కాదు

(వాట్సాప్‌లో కనిపించిన ఓ మంచి పోస్ట్..)

ఎవరు జ్ఞాని?

నమస్తే.. నమస్తే.. నమః

రావుల నిరంజనాచారి

భారతీయ జ్ఞానసంపద పురాతన కాలం నుండీ విలక్షణంగా విరాజిల్లుతున్నది. ప్రపంచ నాగరికతలు ప్రారంభమయ్యే సరికే భారతావని లో జ్ఞానసంపద సాగరమై విలసిల్లింది. **‘అతతి సర్వత్ర వ్యాప్నోతి ఇతి ఆత్మః’**. **‘అంతటా వ్యాపించి ఉన్నదే ఆత్మ..’** అంటూ ఏనాడో ఆత్మకు నిర్వచన మిచ్చి ఆత్మసాక్షాత్కారం పొందిన పవిత్ర నేల ఇది. వేదాలు కర్మకాండల ద్వారా దేవతల దీవెన లు పొందేందుకు నిర్దేశించి ఉండగా, కొంతమంది ఋషులు తర్కమార్గంలో సమస్త చరాచరానికి హేతువు ఎవరనే ఆసక్తితో శోధన మొదలుపెట్టారు. వారు కనిపించే ప్రాకృతిక పదార్థాల మూలతత్వా న్ని ఆధారంగా చేసుకుని, కంటికి కనిపించని అనంతతత్వాన్ని పట్టుకున్నారు. ఆ జ్ఞానసంపదను ‘వేదాంతాలు’గా చెప్పబడే ఉపనిషత్తుల రూపంలో నిక్షిప్త పరిచారు. ప్రాకృతిక రూపాలకు హేతువైన సూర్యుడిని ఛేదించి, ఆ తేజస్సుకు ఆవల ఉన్న దానిని అన్వేషించి దాన్ని సాధించడం ఉపనిషత్తుల్లో కనిపిస్తుంది.

ఈ జ్ఞానఫలాలు జిజ్ఞాసి సాధన చేయనంత వరకు అర్థం కావంటే అతిశయోక్తి కాదు. **‘పూర్ణమదః పూర్ణమిదం’** అన్నది శాస్త్రం. అంటే, పూర్ణమైనటువంటి ఆత్మనుండే దృశ్యమాన ప్రపంచం ఉద్భవించింద నీ, ఆ పూర్ణం నుండి ఏ పూర్ణాన్ని తీసి వేసినా పూర్ణమే మిగులుతుందని ఓ అద్భుత నాందీ ప్రస్తావన **‘ఈశావాస్యోపనిషత్తు’**లో కనిపిస్తుంది. ఈ శ్లోకార్థం ఖగోళ, గణితసూత్రాలను ప్రతిబింబిస్తుంది.

జ్ఞానం అరిషడ్వర్గాలను హరించి వేస్తుంది. తపస్సు, ధ్యానం లాంటివి అరిషడ్వర్గాలకు తాత్కాలిక విరామాన్నే ఈయగలుగుతాయి. విశ్వామిత్రుడు, దుర్వాసుడులాంటి వారి చరిత్రలు నిరూపించింది కూడా ఇదే. కానీ, జ్ఞానమొక్కటే మేథలో ఆత్మతత్వాన్ని నిలుపగా అరిషడ్వర్గాలకు చోటులేకుండా పోతుంది. ఐతే, ఆత్మతత్వాన్ని అర్థంచేసుకోవడం అంత సులువైన విషయం కాదు. అర్థమైనా ఆచరించడానికి నిరంతర తపన అవసరం. ఆదిశంకరులు విశ్వనాథుని దర్శనార్థం గంగానదినుండి బయలుదేరగా, ఎదురైన అపరి శుభ్ర వ్యక్తిని పక్కకు తప్పుకోమంటాడు.

ఆ తర్వాత ఆ వ్యక్తి ఆత్మ చైతన్య తత్వాన్ని ఈ అద్వైత సిద్ధాంతకర్తకే విడమర్చి చెప్పడం సదా స్మరణీయం. అంతుచిక్కని జ్ఞానం సముపార్జించడమంటే, వేదవేదాంగాలను మించిన పనిగా ‘ముండకోపనిషత్తు’ ప్రకటించింది.

ఉపనిషత్తుల అధ్యయనం అనేది జిజ్ఞాసిని, చరాచర ప్రపం చాన్ని సృష్టించి, తనలోనే నిలుపు కున్న ఆ అనంత విశ్వాంత రాళాల లోకి తీసుకెళ్తుంది. ఆత్మతత్వాన్ని దొరకబుచ్చుకున్న సాధకుడిని ఆ తాత్త్వికత ఓ అద్భుతమైన వర్ణనాతీ తమైన ఆనంద డోలికల్లో ఓలలాడింప జేస్తుంది. ఆత్మసాక్షాత్కారం సాధకుడిని ’అహం బ్రహ్మాస్మి’ గా మార్చివేస్తుంది. అతనిలో భేదభావం నశించిపోతుంది. దీనివల్ల అలాంటి వారు

‘సర్వాంతర్యామి’ని తనలోనే అనుభవిస్తారు. తను చూసే దృశ్యమాన ప్రపంచం అంతా తానుగానే గ్రహిస్తారు. అదో అవ్యాజమైన, అనిర్వచనీయమైన ఆనందస్థితి. ‘కేనోపనిషత్తు’లో ప్రకటించినట్లుగా ప్రతి చైతన్యస్థితిలోనూ ఆత్మ ను గ్రహించే వ్యక్తే జ్ఞాని. అతనికి చర, అచరాల నడుమ భేదమేమీ కని పించదు. ఆత్మనుండి శక్తి లభించినట్లుగా, జ్ఞానం నుండే అమరత్వకరమూ లభిస్తుంది. అతనే జ్ఞానరూపంలో ఆత్మయై నిత్యమూ విరాజిల్లుతాడు.

లాక్‌డౌన్ కారణంగా దవాఖానల్లో సాధారణ వైద్య సేవలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైతే వైద్యులను సంప్రదించడానికి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో 'కాల్ ఏ డాక్టర్' కేంద్రం ఏర్పాటు చేశాం. ఎవరైనా 08732-231850 నంబర్‌కు ఫోన్ చేసి ఆరోగ్య సమస్యలపై వైద్యులతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. - ఆదిలాబాద్ కలెక్టర్ శ్రీదేవసేన

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి

లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు	పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు	హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్	సైబరాబాద్ కమిషనరేట్	రాచకొండ కమిషనరేట్	కొవిడ్-19 కాల్‌సెంటర్
	1967	100 (24/7)	9490617440	9490617234	040-23434343

• ఇంటికే సరుకులు

లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నిత్యావసర సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు మొబైల్ వాహనాలను సమకూర్చింది. ఆదివారం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి ప్రత్యేక వాహనాల్లో ఇంటింటికీ వెళ్లి సరుకులు అందజేశారు. - వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ

• పనిచేస్తా.. పరిరక్షిస్తా

తమ ఊరి ప్రజలకు కరోనా రాకుండా మహిళా సర్పంచ్ నడుంబిగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని కనుకునూర్ సర్పంచ్ కుడుముల లక్ష్మి ఇప్పపూలు సేకరించే మహిళలతో కలిసి పనిచేస్తూనే కరోనా వైరస్ బారినపడకుండా మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించేలా అవగాహన కల్పిస్తున్నారు. - మహాముత్తారం

• సేవకు వందనం

లాక్‌డౌన్ సందర్భంగా అత్యవసర విధులు నిర్వహిస్తున్న పోలీసులు, వైద్య, పారిశుద్ధ్య సిబ్బందిని ఆదివారం సూర్యాపేటలో కౌన్సిలర్ ఎస్‌కే బాషా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదనపు కలెక్టర్ సంజీవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, కౌన్సిలర్ వారికి శాలువాకప్పి, పూలు చల్లి వందనం చేసి, వారి సేవలను కొనియాడారు.- సూర్యాపేట బొడ్రాయిబజార్

ఆపద్బాంధవులు

కష్టాల్లో ఉన్నవారికి అండగా సామాన్యులు • తోచిన సాయంతో తోటివారికి భరోసా

వారంతా సామాన్యులే.. ప్రభుత్వ తోడ్పాటుతో బతుకుబండి లాగిస్తున్నవారే.. అయినా ఆపద కాలంలో తోటివారికి ఆపన్నహస్తం అందిస్తున్నారు. తాము క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఉన్నదాంట్లో కొంత సాటివారికి పెడుతూ మానవత్వం చాటుకొంటున్నారు. లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్నవారికి ఆసరాగా నిలుస్తున్నారు. కరోనా రక్కసి విలయతాండవంతో ఏం చేయాలో పాలుపోక దిక్కులు చూస్తున్నవారికి బతుకుపై భరోసానిస్తూ ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ఓ ఇటుక బట్టీ వద్ద కార్మికులకు దాత బాల్‌లింగం తరపున సరుకులు అందజేస్తున్న సహాయకుడు

భళా.. బాల్‌లింగం

- రూ.3 లక్షల అద్దె మాఫీ
- 200 మందికి రూ.వెయ్యి చొప్పున నిత్యావసర సరుకులు పంపిణీ

గంభీరావుపేట: లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన తన ఇంట్లో కిరాయి ఉంటున్న 50 కుటుంబాలకు అద్దె మాఫీ చేసి పెద్ద మనసు చాటుకున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన కొడూరి బాలలింగం. వ్యాపారవేత్తగా, సామాజిక కార్యకర్తగా పేరుపొందిన బాల్‌లింగంకు సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలో షాపింగ్ కాంప్లెక్స్, నివాస సముదాయం ఉన్నది. అందులో సుమారు 50 కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. లాక్‌డౌన్‌తో వారి వ్యాపారాలు సాగకపోవడంతో సుమారు రూ.3 లక్షల అద్దెను మాఫీ చేశారు. అంతేకాదు తన స్వగ్రామం గంభీరావుపేట మండలంలోని ఆయా గ్రామాల్లోని దాదాపు 200 మంది వలస కార్మికులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.2 లక్షల విలువ చేసే నిత్యావసరాలను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

కొడూరి బాల్‌లింగం

కూలీలకు నగదు, బియ్యం అందజేస్తున్న రైతు సామ నాగారెడ్డి

రైతన్న.. సాయం మిన్న

ఆదిలాబాద్ ప్రతినిధి, నమస్తేతెలంగాణ: వలస కూలీలకు అండగా నిలిచాడు ఓ రైతు. ఆదిలాబాద్ జిల్లా తాంసికి చెందిన సామ నాగారెడ్డి తన కున్న 10 ఎకరాల్లో పత్తి, శనగ, జొన్న సాగుచేశాడు. మహారాష్ట్రకు చెందిన పలువురు కూలీలు అతడి వద్ద పనిచేస్తున్నారు. లాక్‌డౌన్‌తో పనిలేక పస్తులు ఉంటున్నారని తెలుసుకున్న నాగారెడ్డి దాదాపు 20 కుటుంబాలకు ఐదు కిలోల చొప్పున బియ్యం, రూ.500 చొప్పున నగదు అందజేశాడు.

హ్యాట్సాఫ్ రాజేశం..

- వైకల్యమున్నా నిత్యం 50 మందికి ఆహారం
- యాచకుల కడుపు నింపుతున్న మానవతామూర్తి

వేములవాడ, నమస్తేతెలంగాణ: కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి డబ్బులు ఉండాల్సిన అవసరం లేదు.. సేవ చేయాలనే మనసు ఉంటే చాలని నిరూపిస్తున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన పొలాస రాజేశం. పోలియోతో ఎడమ కాలు పనిచేయకపోయినా స్వశక్తితో ఎదిగి వంటలు చేసే నలభీముడిగా పేరు సంపాదించిన రాజేశం.. లాక్‌డౌన్‌తో తిండిలేక ఇబ్బంది పడుతున్న పేదలు, యాచకుల పరిస్థితి చూసి చలించిపోయాడు. తనవంతు సాయంగా నిత్యం 50 మందికి ఆహారాన్ని అందించాలని నిర్ణయించుకున్నాడు. వెజ్‌బిర్యానీ, సాంబార్ రైస్, అన్నం, పప్పు లాంటివి ఇంటివద్ద తయారు చేసి, మోదుగ ఆకుల్లో ప్యాక్ చేసి ఆలయం వద్ద నిరుపేదలకు అందిస్తున్నాడు. ఉదయం ఉప్మా, పోపు చేసిన తడి అటుకులు ఇతర అల్పాహారం అందించడం ఆయన సేవా గుణానికి నిదర్శనం. గతంలో సీఎం కేసీఆర్ వేములవాడకు వచ్చిన సందర్భంలో రాజేశం చేతి వంటను రుచిచూశారు. కష్టం వచ్చినప్పుడే సాటి మనిషికి సహాయంగా నిలబడాలనేది తన ఆకాంక్ష అని.. సీఎం కేసీఆర్, ప్రధాని మోదీ సార్లు చేస్తున్న సంకల్ప దీక్షలో తనవంతుగా సహాయాన్ని అందించాలనే ఇలా నిరుపేదలకు భోజనం అందిస్తున్నానని రాజేశం పేర్కొంటున్నారు.

వేములవాడలో నిరుపేదలకు ఉచితంగా అల్పాహారం అందిస్తున్న రాజేశం

నిరుపేదల కోసం బియ్యం అందజేస్తున్న పెద్దషాపూర్‌తండా వాసులు

అడవిబిడ్డల ఆపన్నహస్తం

శంషాబాద్: వారంతా అడవిబిడ్డలు.. సొంతభూములు లేనివారు.. రోజు కూలీలు.. అయినా పరోపకారం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. లాక్‌డౌన్‌తో ఇబ్బందిపడుతున్న వారిని ఆదుకొనేందుకు ముందుకొచ్చారు. తమకు ప్రభుత్వం కేటాయించిన రేషన్ బియ్యంలో సగం అందజేసి ఉదారతను చాటుకున్నారు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్ తండావాసులు. తండాకు చెందిన పంచాయతీ కార్మికులు సభావట్ అమృత, లక్ష్మి, ఆశ వర్కర్ కళతోపాటు గ్రామస్థులు కమ్లి, శాంతి తమకు వచ్చే రేషన్‌లో కొంతభాగాన్ని పేదలకు అందజేశారు.

• చివరి గింజనూ కొంటాం

నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్‌లో మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. చివరిగింజ వరకు కొంటామని భరోసానిచ్చారు.- మామడ

• మద్దతు ధరకే మక్కల కొనుగోలు

జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వమే మద్దతు ధరకు మక్కలు కొంటుందని మంత్రి చెప్పారు. - గొల్లపల్లి

• గ్రామాల్లోనే కొనుగోళ్లు

వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి శివారులో మక్కల కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం ప్రారంభించారు. - పర్వతగిరి

పేదలకు కడుపునిండా భోజనం

- ఎంపీ సంతోష్‌కుమార్ చొరవ అభినందనీయం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

కరీంనగర్ కార్పొరేషన్, నమస్తేతెలంగాణ: నిరుపేదలందరికీ కడుపునిండా భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషిచేస్తున్నదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఎంపీ సంతోష్‌కుమార్ సొంత ఖర్చుతో స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం మంత్రి గంగుల పరిశీలించారు. అక్కడికి వచ్చిన వారికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లాక్‌డౌన్‌తో ఉపాధి కరువైన వలస కూలీలకు ఎంపీ సంతోష్‌కుమార్ భోజనం అందించడం ఆనందంగా ఉన్నదన్నారు. రూ.1,100 కోట్లతో రాష్ట్రంలోని 2.81 కోట్ల మంది ఆకలి తీర్చిన మహానుభావుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. వలస కార్మికులకు 12 కిలోల బియ్యంతోపాటు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున నగదు అందిస్తున్నామని చెప్పారు.

కరీంనగర్‌లో ఎంపీ సంతోష్‌కుమార్ చేపడుతున్న అన్నదాన కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో మేయర్ వై సునీల్‌రావు

ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన పర్సనల్ శానిటైజర్ ఎన్‌క్లోజర్‌లో నుంచి వస్తున్న మంత్రి పువ్వాడ

శానిటైజర్ ఎన్‌క్లోజర్ పనితీరు భేష్

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

మయూరిసెంటర్: కరోనా వైరస్ వ్యాప్తి నివారణ కోసం ఏర్పాటుచేసిన పర్సనల్ శానిటైజర్ ఎన్‌క్లోజర్ పనితీరు బాగుందని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన శానిటైజర్ ఎన్‌క్లోజర్‌ను ఆదివారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్, నగర మేయర్ డాక్టర్ పాపాలాల్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ప్రజలు పర్సనల్ శానిటైజర్‌లో 25 సెకన్లపాటు నిలబడితే వారి దుస్తులపై ఉండే వైరస్‌లు నశిస్తాయని, కరోనా వ్యాప్తిని అరికట్టడంలో ఇంది ఎంతో దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

వైద్య సలహాలకు.. 'కాల్ ఏ డాక్టర్'

- లాక్‌డౌన్ నేపథ్యంలో ఆదిలాబాద్‌లో వినూత్న ప్రక్రియ
- ఫోన్ ద్వారా 24 గంటలు వైద్య సేవలు
- రోజుకు 50 మందికి వైద్య సలహాలు

'కాల్ ఏ డాక్టర్' కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ శ్రీదేవసేన

ఆదిలాబాద్, నమస్తేతెలంగాణ ప్రతినిధి: లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు వైద్యపరమైన ఇబ్బందులు పడకుండా ఆదిలాబాద్ కలెక్టర్ శ్రీదేవసేన వినూత్న కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. ప్రజలు వైద్య సలహాలు పొందడానికి వీలుగా కలెక్టరేట్‌లో 'కాల్-ఏ-డాక్టర్' కేంద్రాన్ని ప్రారంభించారు. కరోనా లక్షణాలు, ఇతర ఆరోగ్యసమస్యలుతలెత్తితే ప్రజలు 08732-231850 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలియజేస్తే.. వైద్యులు సలహాలు ఇవ్వడంతోపాటు ఏ మందులు వాడాలో సూచిస్తారు. 24 గంటలు పనిచేసే 'కాల్ ఏ డాక్టర్' కేంద్రంలో జనరల్ ఫిజిషియన్‌తోపాటు ఇతర వైద్యులు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంటారు. వారం రోజుల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం ద్వారా రోజుకు 50 మంది వరకు ఫోన్ చేసి వైద్య సాయాన్ని పొందుతున్నారు. ఫోన్‌చేస్తే సలహాలు, సూచనలు ఇస్తుండటంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు.. కలెక్టర్ శ్రీదేవసేనతోపాటు వైద్యులకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

• బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పూలమాల వేసి నివాళులర్పించారు. - యాదగిరిగుట్ట, నమస్తేతెలంగాణ

వలస కార్మికులకు రూ.5లక్షలు

దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఉపాధి కోసం వలస వెళ్లిన కార్మికుల కోసం రూ.5 లక్షలు అందిస్తానని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. నియోజకవర్గం నుంచి హైదరాబాద్, ముంబై, పుణె, బెంగళూరు, చెన్నైలాంటిప్రాంతాలకు ఉపాధి కోసం వలసవెళ్లిన ప్రతి కుటుంబానికీ సాయం అందిస్తానని చెప్పారు. ఆదివారం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని తన నివాసం నుంచి ఎమ్మెల్యే రెండు వేలమందితో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. లాక్‌డౌన్ దృష్ట్యా వలస వెళ్లిన కూలీలు ఎక్కడివారు అక్కడే ఉండాలని సూచించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున వంద కుటుంబాలకు రూ.5 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. కూలీల జాబితా సిద్ధం కాగానే వారికి డబ్బులు అందజేస్తానని తెలిపారు.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
కరీంనగర్
సోమవారం 6 ఏప్రిల్ 2020
www.ntnews.com

జిందగీ

వైరస్ లాకెట్ అదుర్స్!

కరోనా చుట్టూ ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచమూ తిరుగుతున్నది. దానికి ఉదాహరణే ఈ నగలు. రష్యాకి చెందిన డాక్టర్ వోరోబియో ఈ లాకెట్టు సృష్టికర్త. అతను ఆరోగ్య, విజ్ఞాన రంగాలకు సంబంధించిన నమూనాలతో నగలు ఉత్పత్తి చేయడంలో దిట్ట. వైరస్ మైక్రోస్కోపిక్ చిత్రం ఆధారంగా ఓ లాకెట్టును తయారు చేశాడు. వెండితో చేసిన ఆ లాకెట్ ధర 1000 రూబెల్స్. ప్రపంచవ్యాప్తంగా దీన్ని 1000 మంది దాకా కొనుగోలు చేశారు. ఈ పెండెంట్‌ని డాక్టర్లు, నర్సులు.. ఇతర ఆరోగ్య కార్యకర్తల త్యాగాలకు గుర్తుగా రూపొందిస్తున్నట్లు వోరోబియో ప్రకటించాడు. అయితే కొంతమంది ప్రాణాంతక వైరస్‌ని ఇలా మెడలో అలంకరించుకోవడం ఏమిటని ఆక్షేపిస్తున్నారు. మరికొందరు దీన్ని ప్రేరణగా తీసుకొని కొత్త రూపాలతో పెండెంట్‌లు తయారు చేస్తున్నారు.

సమాజం పట్ల ప్రతీ ఒక్కరికీ బాధ్యత ఉండాలి. మనిషికి.. మహమ్మారికీ జరుగుతున్న యుద్ధంలో బాధ్యతే కీలకం. బాధ్యత ఉంది కాబట్టే.. ఓ డాక్టర్.. ఫ్యామిలీ కంటే వృత్తికే ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఓ నర్స్.. జీతం కంటే సాటివారి జీవితమే ముఖ్యం అనుకుంటున్నది. ఓ పోలీస్.. తన రక్షణ కన్నా ప్రజల భద్రతకే పెద్దపీట వేస్తున్నాడు. 'పౌరులుగా మేమూ ఈ యుద్ధంలో పాల్గొంటాం' అని కళాకారులూ కదం తొక్కుతున్నారు !

కరోనాపై కళల యుద్ధం!

ఔను.. కరోనాపై పోరాడటానికి కళాకారులు కూడా కదిలారు. దేశమంతా లాక్‌డౌన్ అయినా... ఆశీర్వాద్ ఆటా కోసమో.. పాలకూర కట్ట కోసమో రోడ్ల మీదికి వస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నవారి మీద పంచులు వేస్తున్నారు. వైరస్ తీవ్రతల గురించి.. పౌరుల బాధ్యతల గురించి.. పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నారు. 'ఈ పోరాటంలో అంతిమంగా మనిషే గెలుస్తాడు' అనే భరోసాను కల్పిస్తున్నారు.

జానపదం ఘల్లుమన్నది..

ప్రాణం కన్నా విలువైనదేముంది? మనకున్న ధైర్యం ముందు కరోనా ఓ పెద్ద లెక్కా?... అంటూ ధైర్యం నూరిపోస్తున్నారు కళాకారులు. 'వుయ్ గానా ఫైట్ కరోనా ఏదేమైనా.. చిన్నదేగా మనలో ఉన్న ధైర్యం కన్నా.. జాగ్రత్తలు పాటిస్తూ ఎదిరిద్దాం చిన్నా.. ఏముందీ విలువైందీ మన ప్రాణం కన్నా' అంటూ అవగాహన కల్పిస్తున్నారు. కరోనా క్రైసిస్ చారిటీ పేరుతో కోటి కంపోజ్ చేయగా చిరంజీవి.. నాగార్జున.. సాయిధరమ్ తేజ్.. వరుణ్‌తేజ్ ఇండ్లలో ఉంటూనే తమవంతు మద్దతు అందించారు.
కరోనాపై యుద్ధంలో కళాకారులు విసిరిన మరో పవర్‌పుల్ అస్త్రం... 'చేతులెత్తి మొక్కుతా' పాట. 'చౌరస్తా బ్యాండ్' ఈ యుద్ధాన్ని ప్రకటించింది. 'చేతులెత్తి మొక్కుతా చేయిచేయి కలపకురా.. కాళ్లుగూడ మొక్కుతా అడుగు బైటపెట్టకురా. ఉన్నకాడె ఉండరా గంజిదాగి పండరా.. మంచిరోజులొచ్చెదాక నిమ్మలంగ ఉండరా' అంటూ.. 'బతికుంటే బలుసాకు తినైనా ఉండొచ్చు.. ముందు జాగ్రత్తగా ఉండి ప్రాణాలు రక్షించుకోండి..' అనే సందేశం ఇచ్చారు.

నిగ్గదీసే ఒగ్గుకథ

కరోనాపై పోరాటంలో ఒగ్గుకథ కూడా కాలికి గజ్జెకట్టి జనాలను ఆలోచింపజేస్తున్నది.'శారదా.. నీకు దండమమ్మా' అంటూ జబ్బకు డోలు వేసుకొని పోరాడుతున్న బీర్ల శ్రీనివాస్ ఒగ్గుకళా బృందం రూపొందించిన ఓ కథ... 'కరోనా వైరస్ కాటేయ వచ్చె.. మనుషులందరినీ మాయంజేయవచ్చె రామా రామా.. తెలంగాణకు వచ్చెనమ్మా లాకుడౌను.. అటువంటి కరోనా వైరసు.. దేవాన దేవతల పూజలు చేసేది.. తిరుపతి తీరంగం.. భద్రాచలం.. కొమురెల్లి దేవస్థానాలు బందుచెయ్యవట్టెనమ్మా రామా రామా.. ఎవరి మేడల్ల వారే ఉంటున్నరు.. కలో గంజో తాగుతూ కడుపు నింపుకుంటున్నరమ్మా రామా రామా' అంటూ కరోనాపై పోరాటం చేస్తున్నది. ఆపత్కాలంలో ఆర్భాటాలెందుకు అనే సందేశాన్ని ఇస్తున్నది ఈ ఒగ్గుకథ. అదే సమయంలో మనిషి నిర్లక్ష్యాన్ని నిగ్గదీస్తున్నది.

పేరడీ ఫైట్

పేరడీలు కూడా గారడీల కరోనాపై పంజా విసురుతున్నాయి. 'ముత్తు' సినిమాలోని 'థిలానా థిలానా.. నీ కసి కళ్లలోనా' అనే పాట గుర్తుంది కదూ.. దానికి పేరడీ అస్త్రంగా 'కరోనా కరోనా మా కనుగప్పీ కూనా.. చైనా వాల్ దాటే వచ్చావా. ముట్టుకుంటే చాలా అది ఒక సెకనూ అయినా చకాచకా సోకేస్తున్నావా? కన్ను నులిమితే హైరానా.. ఇక ఎవరు దగ్గినా డౌటేనా'... అంటూ సాగుతుంది ఆ అనుకరణ. బయట ఎవరైనా దగ్గినా.. తుమ్మినా భయపడాల్సి వస్తున్నదని ఈ పాటలో కళాకారుల ఆవేదన. 'చైనా గోడ దూకి వచ్చావా' అంటూ చైనా నిర్లక్ష్యాన్నీ ప్రస్తావించారు. దీక్షిత్‌రెడ్డి దీనికి లిరిక్స్ రాశారు. సింగర్ మానసా ఆచార్య కూడా కరోనాపై పేరడీ యుద్ధం ప్రకటించింది. 'అక్బర్ సలీమ్ అనార్కలీ'లోని 'హసీనా.. ఓ హసీనా' పాటను 'కరోనా.. ఓ కరోనా.. మాపై ఎంత ఎంత ఘోర దాడి చేశావో.. నీ పగ మనిషిపై ఆపు ఇకనైనా' అంటూ వైరస్ తీవ్రతను తెలియజేసే ప్రయత్నం చేసింది. కీరవాణి, ఆర్జీవీ కూడా ఇలాంటి మంచి ప్రయత్నమే చేశారు.

పద్యాస్త్రాలు

'ఇంటి నుంచి కదలకు.. వీధిలోన మెదలకు.
బయటకొచ్చి నీవు బడితపూజ తినకు.
సామాజిక దూరమే.. సమాజ రక్షణ
వినుము వినుము రామ విశ్వ వైరస్ డ్రామా'
..వంటి పద్యాలు కరోనా పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి. 'ఎంతెంత దూరం.. ఐదు ఫీట్ల దూరం.. నీకూ నాకూ నిశ్శబ్ద హారం.. ఎక్కడికక్కడే నిషేధ దారం.. కాదని కదిలితే జరుగును ఘోరం' వంటి కవితలు చిన్నవే అయినా కరోనాపై పెద్ద సమరమే చేస్తున్నాయి. ఐనంపూడి శ్రీలక్ష్మి వంటి వారి పెద్ద కవితలూ కరోనాపై యుద్ధం ప్రకటించి కళల పదునును చాటాయి. 'క్వారంటైనే మన వాలంటైన్.. ఏమైందిప్పుడు.. క్షణాలు మాత్రమే కల్లోలితం. ఆత్మ స్థైర్యాలు కాదు కదా..' అంటూ ఐనంపూడి అందర్నీ ఆలోచింపజేశారు. సోషల్ మీడియా వేదికగా 'డౌన్ డౌన్ కరోనా.. సబ్‌కో లాక్‌డౌన్ కరోనా.. న బైఠక్ న సడక్.. జా అందర్ జా.. అలగ్ సలగ్ చలోనా' అంటూ కవితాస్త్రాలు ప్రయోగించిన వారూ ఉన్నారు. కరోనాపై యుద్ధంలో కార్టూనిస్టులూ కుంచెతో ఫైట్ చేస్తున్నారు. ఆర్టిస్ట్ చిత్ర వేసిన కరోనా కార్టూన్‌లో.. ఒకవ్యక్తి ఇంటి గడపదాటే ప్రయత్నం చేస్తుంటాడు. 'గడపదాటితే.. కనపడని శత్రువుతో దోస్తాన చేసినట్టే'.. అంటూ ఆ కార్టూనిస్టు హెచ్చరిక లాంటి సందేశం ఇచ్చారు.

టిక్‌టాక్ దెబ్బ

కళాకారులు సమయం చూసి కొడతారు. ఇప్పుడు కరోనాను కొట్టినట్టే. టిక్‌టాక్ వంటి మాధ్యమాల్లో సందేశాన్ని హాస్యంతో జోడించి రక్తికట్టిస్తున్నారు. దూరంగా ఉంటూ.. ఎలా దగ్గర కావొచ్చో వీడియోల ద్వారా సందేశమిస్తున్నారు. ఇంట్లోనే ఉంటూ వైరస్‌పై యుద్ధం చేయాలనే అవగాహన కల్పిస్తున్నారు. 'బాహర్‌సే కోయి అందర్ నా ఆ సకే.. అందర్ సే కోయి నా జా సకే.. సోచో కబీ ఐసా హోతో క్యా హో'... 1973లో వచ్చిన బాలీవుడ్ హిట్ మూవీ 'బాబీ' సినిమాలోనిది ఈ పాట. ఇదిప్పుడు టిక్‌టాక్‌లో తెగ తిరుగుతున్నది. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీతం సమకూర్చిన గీతాన్ని ప్రస్తుత పరిస్థితికి తగినట్టు టిక్‌టాక్ యూజర్లు మలుచుకొన్నారు.'బయటి నుంచి ఇంట్లోకి ఎవరూ రాకండీ.. ఇంట్లో నుంచి బయటకు ఎవరూ వెళ్లకండీ' అంటూ పరోక్షంగా కరోనా తీవ్రతను గుర్తుచేస్తున్నారు.

చేయూత

కరోనాపై ఒక చేత్తో ఫైట్ చేస్తూనే మరో చేత్తో సహాయం చేసేందుకు.. టాలీవుడ్.. కోలీవుడ్.. బాలీవుడ్ అనే తేడా లేకుండా కళాకారులంతా కదిలారు. తమకు తోచిన విధంగా విరాళాలు అందజేశారు. అక్షయ్‌కుమార్ రూ.25 కోట్లు ఇచ్చి మానవతను చాటుకున్నారు. అక్షయ్ విరాళం ప్రకటించినప్పుడు ఆయన భార్య ట్వింకిల్ 'ఒక్కసారి ఆలోచించుకోండి' అని సలహా ఇచ్చారట. 'కెరీర్ ప్రారంభంలో నా దగ్గర డబ్బులు లేవు. ఇప్పుడు కావలసినంత ఉంది. మనం ఒక్కరమే సంతోషంగా ఉండటం కాదు కదా జీవితమంటే?' అంటూ ఆమెకు సమాధానమిచ్చి అందరి మనసులనూ గెలుచుకున్నాడు. చిరంజీవి.. కమల్‌హాసన్.. నాగార్జున.. పవన్‌కల్యాణ్ వంటి సినీ అగ్రతారలంతా తమకు తోచిన సాయం చేసి కరోనాపై కళాయుద్ధం ప్రకటించారు.

డాక్యుమెంటరీ

కొవిడ్ మహమ్మారి ఎంత తీవ్రమైందో ఇటలీ.. అమెరికా వంటి దేశాల పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా అల్లకల్లోలం మొదలుకాగానే... అసలు కరోనా అంటే ఏంటి? అన్న ఉత్కంఠ మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కరోనా గురించి శోధించడం మొదలుపెట్టారు. కరోనా అంటే గత్తర అని కొందరు.. కాదుకాదు, అదొక శక్తి అని మరికొందరు.. ఇలా ఎవరికి తోచినట్టు వారు మాట్లాడారు. ఏది నిజం? ఏది అపోహ? అనే విషయాన్ని చెప్పడానికి యూట్యూబ్ చానల్స్ ప్రయత్నించాయి. అలా తెలుగులో 'రియల్ మిస్టరీస్' ఒక వీడియో చేసి అందరినీ ఆకట్టుకుంది. లాక్‌డౌన్ వల్ల అందరం ఇంట్లోనే ఉంటున్నాం. మరి వీడియోలు మాత్రం ఎలా తీయగలం? అని ఆలోచిస్తూ ఖాళీగా కూర్చోకుండా లాక్‌డౌన్‌ను కూడా వీడియో చేసింది మైవిలేజ్ షో టీమ్. ఈ చానల్ క్రియేటివ్ హెడ్ శ్రీకాంత్ వీలాగ్స్ పేరిట ఆర్టిస్ట్‌లందరినీ ఎవరి ఇంట్లో వాళ్లు ఏమేం చేస్తున్నారో వీడియో తీసి పంపారు. దాన్ని శ్రీకాంత్ తన ఇంట్లోనే చక్కగా రూపొందించి అందరికీ అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.

...✍ దాయి శ్రీశైలం

> అతి తేలికైన వైరస్.. సమాజం పట్ల మన బరువూబాధ్యతలు గుర్తుచేసింది. ప్రాణమేలేని వైరస్... దేశమంటే, ప్రజలంటే తమకు ప్రాణమని ప్రతి ఒక్కరూ ఎలుగెత్తేలా చేసింది. వేడికి భయపడే వైరస్.. చల్లని మనసు ఉన్న ప్రతి ఒక్కరూ తమవంతుగా సాయం చేసేలా ప్రోత్సహించింది. ఇన్ని కలాల్నీ గళాల్నీ కుంచెల్నీ కదిలించిన కరోనా.. నీ మహోపకారానికి కృతజ్ఞతలు. ఇక బయల్దేరు. తక్షణం వెళ్లిరా! మళ్లీ రావద్దు!

కరోనా గురించి ఎప్పుడు భయపడాలి?



సందేహం	సమాధానం
గొంతునొప్పి ఉంటే కరోనా టెస్టు చేయించాలా?	
మూడు రోజుల నుంచి జలుబు ఉంది. పరీక్ష అవసరమా?	
గొంతులో కొంచెం మంటగా ఉంది. నాకు కరోనా వస్తుందా?	
గొంతునొప్పి. కొంచెం ఆయాసంగా కూడా ఉంది. కొవిడ్ పరీక్ష చేయించాలా?	
దగ్గు, జలుబు. గొంతు ఇన్‌ఫెక్షన్ అప్పుడప్పుడూ వస్తూనే ఉంటుంది. కరోనా ఉన్నట్టా?	

పాఠకుల నుంచి వచ్చిన అన్ని ప్రశ్నలకీ ఒకే సమాధానం

మీ ప్రశ్నల్లో ఎన్ని రోజుల నుంచి మీకు ఇలాంటి సమస్యలు ఉన్నాయో చెప్పలేదు. కరోనా ఇన్‌ఫెక్షన్‌లో ప్రధానమైన లక్షణం జ్వరం. దీంతో పాటు దగ్గు. ఈ రెండూ బాధిస్తుంటే టెస్టు అవసరం పడొచ్చు. అయితే కొవిడ్-19 ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు ముందుగా గొంతునొప్పి మొదలవుతుంది. ఆ తర్వాత జ్వరం, ఒళ్లు నొప్పులు వస్తాయి. నీరసం, నిస్సత్తువ ఉంటాయి. వీటితో పాటు దగ్గు ఉన్నట్టయితే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. ఈ లక్షణాలు ముదిరిన తరువాతే ఆయాసం వస్తుంది. కేవలం జలుబు మాత్రమే ఉంటే ఆందోళన అవసరం లేదు. కరోనా ఆందోళనతో సాధారణ జలుబుకు కూడా భయపడిపోతున్నారు. ఇప్పుడు నేను చెప్పిన పద్ధతిలో లక్షణాలు కనిపిస్తేనే అనుమానించాలి. అప్పుడప్పుడు జలుబు, దగ్గు, గొంతు ఇన్‌ఫెక్షన్ వస్తున్నాయంటే మీకు వేరే సమస్య ఉండొచ్చు. మొన్నటి వరకు బాగానే ఉండి, ఇప్పుడు లక్షణాలు కనిపిస్తున్నాయంటేనే అనుమానించాలి. పైగా 14 రోజుల క్రితం మీరు ఎక్కడికైనా ప్రయాణం చేసి ఉన్నా, ప్రయాణం చేసి వచ్చిన వాళ్లను కలిసినా, బయటి వ్యక్తులతో సన్నిహితంగా మెలిగినా, శ్వాసకోశ సమస్యలున్నవాళ్లను పరామర్శించి వచ్చినా... ఆ తరువాత మీకు ఈ లక్షణాలు కనిపిస్తే మాత్రం అశ్రద్ధ చేయకుండా డాక్టర్‌ను కలవాలి. 104కి అయినా కాల్ చేయొచ్చు. లేదా మీ ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదించండి. గాంధీ, ఫీవర్ హాస్పిటల్, కోఠి హాస్పిటల్, ఛాతీ వైద్యశాలల్లో వెళ్లి కలవొచ్చు. లేదా దాదాపు అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ కూడా కరోనా ఇన్‌ఫెక్షన్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. అక్కడైనా సంప్రదించొచ్చు.
మీరు ముందుగా భయం వదలండి. ఒత్తిడి పెంచుకోవద్దు. అలాగని నిర్లక్ష్యం తగదు. సామాజిక దూరం పాటించడం, ఎప్పటికప్పుడు చేతులు కడుక్కోవడం లాంటి జాగ్రత్తలు పాటిస్తే భయపడాల్సిన అవసరం లేదు.

డాక్టర్ ఎం.వి. రావు
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

మీ సందేహం - మా సమాధానం

కరోనా వ్యాధి గురించి మీకు ఎటువంటి అనుమానాలు, భయాలు ఉన్నా ఆందోళన పడకండి. మీ ప్రశ్నలు మాకు వాట్సప్ చేయండి. నిపుణులతో మీకు సమాధానాలు ఇప్పిస్తాం. ప్రశ్నలు పంపవలసిన వాట్సప్ నెంబర్ : 91827 77177.

అండగా ఐటీ కమిషనర్

ప్రస్తుత సంక్షోభ సమయంలో.. ముంబైకి చెందిన ఐటీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మేఘా భార్గవ్ 66 కుటుంబాల బాధ్యతను తీసుకొన్నారు. ముంబైలోని కోరేగావ్‌లో రోజువారీ వేతనాలపై బతికే అరవై ఆరు కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కున్నాయి. ఈ విషయం డాక్టర్ మేఘా భార్గవ్‌కు తెలిసింది. వెంటనే ఆమె సమర్పణ్ అనే ఎన్జీవో ద్వారా నిధుల సేకరణ ప్రారంభించింది. తన సోదరి డాక్టర్ రుమాతో కలిసి ఈ సేవకు పూనుకుంది. ఇద్దరూ కలిసి పేదల కోసం కొన్ని కిట్లు తయారు చేశారు. ప్రతి కిట్‌లో వెయ్యిరూపాయల విలువైన సరుకులు పెట్టారు. ఇప్పటికి 750 మందికి పైగా ఈ కిట్లను అందచేశారు. 10,000 కుటుంబాలకు చేరాలన్నది లక్ష్యం. దీనికి ముంబై పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు, వైద్య నిపుణులు సహకారం అందిస్తున్నారు. పంపిణీ ప్రక్రియకు ఆటంకం కలుగకుండా ముంబై పోలీసులు సమన్వయం చేసుకుంటున్నారు. ముంబై పోలీసుకులకు 800 బాటిళ్ల శానిటైజర్లను, గుజరాత్ పోలీసులకు 1300 బాటిళ్ల శానిటైజర్లను అందచేయగలిగింది మేఘా భార్గవ్. ఆమెతో కలిసి పనిచేయడానికి ముంబైలోని కొన్ని కాలనీవాసులు ముందుకు రావడంతో ఆ పని మరింత సులువైంది.

బ్యాడ్మింటన్ శిక్షణ @ ఆన్ లైన్

కరోనా మహమ్మారి కారణంగా క్రీడాలోకం వెలవెలబోతున్నది. ఏకంగా ఒలింపిక్స్‌ను సైతం వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. దీంతో క్రీడాకారులంతా మెరుగైన శిక్షణ కోసం వివిధ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఫిట్‌నెస్ కోసం... చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఓ మంచి ఆలోచన చేశారు. అదే.. ఆన్‌లైన్ ట్రైనింగ్. లాక్ డౌన్ నేపథ్యంలో ఇదే సరైన నిర్ణయమని అంటున్నారు గోపీచంద్. మన దేశంలో అగ్రశ్రేణి షట్లర్ల కోసం ప్రత్యేకంగా ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి, శిక్షణ ఇస్తున్నారు గోపీచంద్. ఆటకు, ఫిట్‌నెస్‌కు సంబంధించిన విషయాలు ఆ గ్రూపులో పంచుకుంటున్నారు. వీరికి ప్రముఖ ఫిట్‌నెస్ కోచ్ దినాజ్ వెర్వత్వాలా జత కలిశారు. ఈమె కూడా జూమ్ యాప్ ద్వారా క్లాసులు తీసుకుంటున్నారు. 'ప్రస్తుతం కోర్టుల్లో ఎవ్వరికీ ప్రవేశం లేని కారణంగా ఇలా ఆన్ లైన్ శిక్షణ ఇస్తున్నాం. ఇలాగైనా మేం చేయగలిగింది చేస్తున్నాం. ఇది సాధారణమైన కార్యక్రమమే అయినా.. క్రీడాకారులు ఫిట్‌గా ఉండేందుకు దోహదపడుతుంది' అని గోపీచంద్ అంటున్నారు.

అమ్మ చేతి మసాజ్!

ప్రతీ సెలెబ్రిటీ ఇప్పుడు మామూలు జీవితాన్ని గడుపుతున్నారు. కంగనా రనౌత్ హిమాచల్‌ప్రదేశ్‌లో తన కుటుంబంతో గడపడానికి వెళ్లింది. కంగనాకి ఆమె తల్లి నూనె పెడుతూ మసాజ్ చేస్తున్న ఫొటో బాగా వైరల్ అవుతున్నది. తమ బాల్య స్మృతులు గుర్తుకువస్తున్నాయని చాలామంది కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు ఆమె చేతిలో ఉన్న నూనె గురించి ప్రశ్నల మీద ప్రశ్నలు వేశారు. జవాబుగా కంగనా.. 'దాని పేరు చులీ ఆయిల్' అని పోస్ట్ పెట్టింది. ఇప్పుడు ఈ చులీ నూనె గురించే చాలామంది సెర్చ్ చేస్తున్నారట. ఈ తైలానికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది జుట్టు మందంగా, ఏపుగా పెరగడానికి సహాయపడుతుంది. స్థానికంగా దొరికే చులీ పండ్లతో దీన్ని తయారు చేస్తారు. లడఖ్, హిమాచల్ ప్రదేశ్ వంటి ప్రాంతాలలో ఇది బాగా ప్రాచుర్యం పొందింది.

ఇంటిపట్టునే కేలరీలను కరిగిద్దాం

కూర్చుని తింటే కొండలు కరుగుతాయంటారు... ఇదెంత వరకు నిజమోగానీ! కూర్చుని తింటుంటే శరీరంలో కొవ్వు మాత్రం అమాంతంగా పెరిగిపోతుంది. సాధారణ రోజుల్లో పెద్దగా వ్యాయామం చేయకపోయినా రెండు అడుగులు వేసి బయటికి వెళ్తాం. కాస్తో కూస్తో చేసే శారీరక శ్రమతో కొంతైనా కొవ్వు కరుగుతుంది. కానీ అసలే కరోనా భూతం! ఆపై లాక్‌డౌన్!! అడుగు బయట పెట్టాలంటే భయం. ఈ నేపథ్యంలో ఇంటి పట్టునే ఉండి... వేళకు ఇంత తినడం మంచిదే అయినా, అదేపనిగా కూర్చోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోవడం ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఇలాంటి సమయాల్లో మారథాన్‌లు చేయకున్నా... నాలుగు గోడలమధ్యే శరీరంలో వందలాది కేలరీలను ఖర్చు చేయొచ్చంటున్నారు నిపుణులు. చిన్న పాటి పనులే... పైగా ఇంటికి పనికొచ్చే పనులు... అంత కుమించి ఇల్లాలికి కాస్త అండగా ఉండే పనులు... మరి ఇంకెందుకు ఆలస్యం? ఏ పని చేస్తే ఎన్ని కేలరీలు ఖర్చవుతాయో చూసుకోండి. పిండికొద్దీ రొట్టె అన్నట్లు... మీ శ్రమకొద్దీ కేలరీలు అలా... అలా... మండుతూ మీకు ఆరోగ్యాన్ని తెచ్చి పెడతాయి.
ఏ పని చేస్తే ఎన్ని కేలరీలు కరుగుతాయనే లెక్కల్ని... 20 ఏండ్ల వయసున్న...(75 కిలోల ఆడవారు, 88 కిలోల మగవారు) వారిని ప్రామాణికంగా తీసుకొని సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (వ్యాధుల నియంత్రణ, నివారణ కేంద్రం) రూపొందించింది. అందునా యువతను ప్రామాణికంగా తీసుకొని లెక్కించారు. వయసు, శరీర బరువు వేరేగా ఉన్న వారికి కాస్త అటు ఇటుగా కేలరీల ఖర్చులో తేడా ఉంటుంది. ముఖ్యంగా ఈ పనులను అరగంట పాటు చేస్తే ఖర్చయ్యే కేలరీలు ఇవి... అంతకుమించి చేస్తే ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి. ఉదాహరణకు.. కింది పట్టికలో ఫ్లోర్‌ను శుభ్రం చేసే విషయంలో గంట లెక్కనూ ఇచ్చారు.

ఏ పనిలో ఎన్ని క్యాలరీలు ఖర్చు...

ఇంట్లో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం	102	87
అదే, ఒక గంట పాటు చేస్తే	204	174
ఇంట్లో ఫర్నీచర్, ఇతరత్రా దుమ్ము దులపడం (ఈ పని చేసేటపుడు కచ్చితంగా మాస్క్ ధరించాలి)	66	57
పడక గదిని అందంగా తీర్చిదిద్దుకోవడం	223	189
వంటపాత్రలు శుభ్రం చేయడం	58	49
పెరట్లోని చెట్లకు నీళ్లు పోయడం	66	57
వాహనాలను కడగడం	89	76

అర్థాలేంటి?

1. Quarantine (క్వారంటైన్)
2. Nutrition (న్యూట్రిషన్)
3. Isolation (ఐసొలేషన్)
4. Pulmonary specialist (పల్మనరీ స్పెషలిస్ట్)
5. Respiratory system రెస్పిరేటరీ సిస్టమ్



పెద్దల మాట

మీరేం చేసినా సరే .. మంచి వ్యక్తిగా పేరు సాధించండి.

- అబ్రహం లింకన్

చుక్కలు కలుపండి



జవాబులు

పూర్తి పదాన్ని రాయండి..

1. intensive care unit- అత్యవసర చికిత్సగది
2. Equated monthly installment- సమాన నెలవారీ వాయిదా
3. Visitors International Stay Admission- అంతర్జాతీయ సందర్శకుల రాక కోసం అనుమతి
4. Right to Information Act- సమాచార హక్కు చట్టం
5. Outpatient department- అరోగ్య పరీక్షలు చేయించుకొని వెళ్లేవారికి కోసం దవాఖానలో ఉండే విభాగం

అర్థాలు చెప్పండి

1. వ్యాధి వ్యాప్తిని నిరోధించడానికి.. వ్యక్తులను లేదా జంతువులను వ్యాధి విస్తరించే పరిస్థితుల నుంచి దూరంగా ఉంచడం.
2. పోషక విలువ
3. దిగ్బంధం
4. ఊపిరితిత్తుల వైద్యనిపుణులు
5. శ్వాసవ్యవస్థ

కథ

పిచ్చుకల స్నేహం..

ఒక చెట్టు మీద రెండు పిచ్చుకలు ఉండేవి. వాటి పేర్లు చిట్టి, పొట్టి. రెండూ మంచి స్నేహితులే. రోజూ కలిసి ఆహారం కోసం తిరిగేవి. సాయంకాలానికి చెట్టు మీదికి చేరుకొనేవి. పొట్టి పిచ్చుకకు చిట్టి పిచ్చుక అంటే ఎంతో ఇష్టం. తన కోసం ఏదైనా సరే ఇవ్వాలని అనుకొనేది. ఒక్కోసారి తనే బయటకు వెళ్లి ఇద్దరికీ సరిపడా ఆహారాన్ని తెచ్చేది. ఇలా వీటి స్నేహం ఆనందంగా సాగుతూ వచ్చింది. ఇంతలోనే ఆ చెట్టు మీదికి రెండు కాకులు వచ్చాయి. పిచ్చుకల స్నేహాన్ని చూసి ఈర్ష్య పడ్డాయి. చిట్టి పిచ్చుకతో స్నేహం చేసి పొట్టి పిచ్చుకను ఒంటరి చేయాలనుకున్నాయా కాకులు. పథకం ప్రకారం మాటలు కలిపాయి. ఇది గ్రహించని చిట్టి పిచ్చుక ఆ కాకులతో కూడా స్నేహం చేసింది. వాటితో కలిసి అజ్ఞానంగా ప్రవర్తించేది. సాధారణంగానే పొట్టి పిచ్చుకకు ఇది నచ్చలేదు. తన స్నేహితురాలి ప్రవర్తనను చూసి కోపం తెచ్చుకుంది. ఎప్పుడైనా చిట్టి పిచ్చుక తనను పలకరిస్తే చాలా కోపంగా జవాబు ఇచ్చేది, ఒక్కోసారి తిట్టేది కూడా. ఒకరోజు చిట్టిపిచ్చుక ఆహారం తెస్తే పొట్టి పిచ్చుక తిరస్కరించింది . దీంతో ఆ చిట్టి పిచ్చుక బాధపడింది. ప్రతిసారి తనపై కోపం అవుతున్నందుకు పొట్టి పిచ్చుకతో మాట్లాడటం మానేయాలనుకుంది చిట్టి పిచ్చుక. 'ఇలాంటి పిచ్చుకతోనా నేను స్నేహం చేసింది?' అనుకున్నది. మరోవైపు పొట్టి పిచ్చుక మాత్రం స్నేహితురాలితో అలా ప్రవర్తించినందుకు పశ్చాత్తాపపడేది. తనలో తాను బాధపడేది. కానీ నేరుగా వెళ్లి చెప్పలేకపోయేది. కొద్ది రోజులకే రెండు పిచ్చుకల మధ్య మాటలు దూరమయ్యాయి. కలిసి ఆహారం కోసం వెళ్లడం మానేసాయి. ఇలా చాలా రోజులు గడిచాయి. ఇక చెట్టు మీద నుంచి కాకులు వలస వెళ్లిపోయే కాలం దగ్గరపడింది. దీన్ని గమనించిన పొట్టి పిచ్చుక, చిట్టి పిచ్చుక ఒంటరవుతుందేమో అనుకుంది. వెంటనే వెళ్లి మాటలు కలిపే ప్రయత్నం చేసింది. దానికి చిట్టి పిచ్చుక కూడా సానుకూలంగా స్పందించింది. గతంలో తమ స్నేహాన్ని గుర్తు చేసింది. ఇంకా పొట్టి పిచ్చుక వల్ల కలిగిన బాధను కూడా చెప్పింది. 'ఇంకోసారి అలా చేయను' అని పొట్టిపిచ్చుక మాట ఇచ్చింది. 'మన స్నేహం ఇలాగే సంతోషంగా సాగాలని చిట్టి పిచ్చుక కోరింది.' దానికి 'సరే' అన్నది పొట్టి పిచ్చుక. ఆ పిచ్చుకలు మళ్లీ కలిశాయి. చిట్టి పిచ్చుక సంతోషించింది.

నీతి

ఎక్కడ ఇష్టం ఉంటుందో అక్కడ కోపం కూడా ఉంటుంది. పంతాలకు వెళ్లవద్దు. అన్నిటినీ అర్థం చేసుకొనేవారే నిజమైన మిత్రులు.

దారి కనుక్కోండి



జర నవ్వుకో!

కిట్టు: చాలా మంది లెక్కల పాఠం అనగానే ఎందుకు దిగులు పడతారు.

చింటు: లెక్కల పుస్తకంలో అన్నీ సమస్యలే కదా టీచర్.

***

బంటి: లెక్కల్లో నా ఫ్రెండ్ కంటే నాకు ఐదు మార్కులే తక్కువ వచ్చాయి డాడీ.

డాడీ: పోన్లేరా బాధపడకు.. ఇంతకీ మీ ఫ్రెండ్‌కి ఎన్ని మార్కులొచ్చాయి?

బంటి: ఐదు మార్కులు డాడీ.

పూర్తి పదాన్ని రాయండి

1. ICU
2. EMI
3. VISA
4. RTI
5. OP

నేర్చుకొందాం..

మా నాన్న ఒక రైతు.

My father is a farmer.
మై ఫాదర్ ఈజ్ ఎ ఫార్మర్.

నాకు ఎరుపు రంగు ఇష్టం.

I like Red colour.
ఐ లైక్ రెడ్ కలర్.

నాకు ఇద్దరు సోదరులు ఉన్నారు.

I have two brothers.
ఐ హావ్ టూ బ్రదర్స్.

మీకు తెలుసా

- నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యాంలో 40 శాతం ప్రజలు వీధుల్లోకి సైకిళ్ల మీదనే వెళ్తారు.
- తూనీగలకు ఆరు కాళ్లు ఉంటాయి. అయినా అవి నడవలేవు.
- మన తల వెంట్రుకల కంటే సబ్బు బుడగల మంద పదివేల రెట్లు సన్నగా ఉంటుంది.
- అతి ఖరీదైన మసాలా దినుసు కుంకుమ పువ్వు.
- స్ట్రాబెర్రీలో కంటే నిమ్మకాయల్లోనే చక్కెర శాతం ఎక్కువ.
- బాతులు తలను కదపకుండా నడవలేవు

శబ్దాల్లో తేడాలెందుకు?

సైకిల్ ట్యూబ్, బెలూన్ పగిలినప్పుడు ఒకలా శబ్దం వస్తుంది. అదే పాలిథిన్ కవర్లని మామూలుగా పగలగొడితే, నీటిని నింపి పగలగొడితే వచ్చే శబ్దాల్లో చాలా తేడా ఉంటుంది. అదే ఇంట్లో ఉండే బల్బు పగిలితే మరో శబ్దం వస్తుంది. ఈ తేడా ఎందుకో తెలుసా? వస్తువులు పగిలినపుడు వచ్చేశబ్దాలకు అనేక కారణాలుంటాయి. గాలి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చలించినపుడు రకరకాల శబ్దాలు ఉత్పన్నమవుతాయి. సైకిల్‌ట్యూబ్, బెలూన్ పగిలినపుడు వాటిలో గాలి హఠాత్తుగా బయటికి రావడంతో పేలిన శబ్దం వస్తుంది. అదే విద్యుత్ బల్బులో గాలి ఉండదు గనుక, అది పగిలితే మరోలా శబ్దం వినిపిస్తుంది. బల్బు పగిలినప్పుడు చుట్టూ ఉన్న గాలి ఒకేసారి దాని దిశగా దూసుకోస్తుంది. దానిమూలంగా 'ఢాం'అంటూ శబ్దం వినిపిస్తుంది. అదే విద్యుత్‌బల్బు శూన్యంలో పగిలిపోతే.. దానిచుట్టూ గాలి ఉండదు కాబట్టి అప్పుడు ఎలాంటి శబ్దమూ రాదు. అదే బల్బు నీటిలో పగిలితే.. దాని దిశగా నీరు దూసుకుపోయే కారణంగా మరోరకమైన శబ్దం వస్తుందన్నమాట! ఆయా వస్తువుల ధర్మాన్ని బట్టి కాకుండా చుట్టూ ఉన్న పరిస్థితులను బట్టి అవి పగిలేటప్పుడు వచ్చే శబ్దంలో మార్పు వస్తుంది.

చిత్రం









స్ఫూర్తికాంతుల తారాదీపాలు

దీపం జ్వలించింది. తిమిరం హరించుకుపోయింది. వెలుగు దివ్వెల్లో అఖిల భారతావని సమైక్యతా కాంతుల్ని వర్షించింది. కరోనాపై సమరంలో అఖండమైన ఐక్యతా ప్రదర్శనకు ప్రతీకగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం దేశవ్యాప్తంగా దీపప్రజ్వలన జయప్రదమైంది. దీపకాంతులతో ఆసేతుహిమాచలం దేదీప్యమానంగా వెలుగులీనింది. యావత్ సినీ లోకం ఈ మహాదీపయజ్ఞంలో పాలుపంచుకుంది. కరోనా భూతాన్ని పారద్రోలే బృహత్ సంకల్పంతో తారలందరూ తమ గృహాల్లో దీపాల్ని వెలిగించి సంఘీభావాన్ని చాటారు. ఇందుకు సంబంధించిన చిత్రాల్ని సోషల్‌మీడియాలో పంచుకొని కరోనాపై విజయం సాధించాలనే ధృడసంకల్పాన్ని చాటారు. ఈ దీపజ్యోతి జ్వలనంలో అగ్రహీరోలు చిరంజీవి, రజనీకాంత్, వెంకటేష్, నాగార్జున, అక్షయ్‌కుమార్, రణ్‌వీర్‌సింగ్, దీపికాపదుకునే, జాన్వీకపూర్ మోహన్‌బాబు, పూజాహెగ్డే, తమన్నా తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

సమాజానికి తిరిగివ్వాలి

సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడంలోనే అసలైన సంతృప్తి ఇమిడి ఉంటుందని చెబుతోంది రకుల్‌ప్రీత్‌సింగ్. మన ద్వారా సాయాన్ని పొందిన వారి ముఖాల్లో కనిపించే ఆనందాన్ని ప్రపంచంలో ఏది ఇవ్వలేదని అంటోంది. లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న పేదవారిని వివిధ రూపాల్లో ఆదుకుంటున్నారు సినీ నటీనటులు. గుర్‌గావ్‌లో తన ఇంటి సమీపంలో ఉన్న రెండు వందల మంది పేదవారికి ప్రతి రోజూ రెండు పూటల భోజనాన్ని అందిస్తోంది రకుల్‌ప్రీత్ సింగ్. ఆమె మాట్లాడుతూ 'కనీస అవసరాల్ని పొందలేని స్థితిలో మా ఇంటి సమీపంలోని కాలనీ వారు ఉన్నారని నాన్న ద్వారా తెలిసింది. లాక్‌డౌన్ కొనసాగిననన్నీ రోజులు వారికి ఆహారాన్ని అందజేయాలని నిర్ణయించుకున్నాను. ఒకవేళ లాక్‌డౌన్ పొడిగించే పరిస్థితులు ఉంటే ఆహార పంపిణీని కొనసాగిస్తాను. కఠిన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఇతరులకు సాయం చేయడానికి ముందుకు రావాలి. సమాజానికి తిరిగి ఇవ్వాలి. నా వంతుగా నేను చేస్తున్న చిన్న సాయమిది' అని తెలిపింది. కరోనా వ్యాప్తితో షూటింగ్‌లకు బ్రేక్ పడటంతో ఫిట్‌నెస్‌పై దృష్టిసారిస్తున్నది రకుల్‌ప్రీత్‌సింగ్.

రకుల్‌ప్రీత్‌సింగ్

స్థానికం

- కరీంనగర్ • జగిత్యాల
- పెద్దపల్లి • రాజన్న సిరిసిల్ల
- మంచిర్యాల
- కుమ్రం భీం ఆసిఫాబాద్

దీపాలతో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, చెన్నమనేని రమేశ్‌బాబు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నడిపెల్లి దివాకర్‌రావు, జడ్పీ అధ్యక్షులు పుట్ట మధు, కనుమల్ల విజయ, న్యాలకొండ అరుణ, కోవలక్ష్మి, మేయర్ వై. సునీల్‌రావు

దీపాలతో కరీం'నగరం'లో మహిళలు

ఐక్యతా కాంతులు

- ప్రధాని, సీఎం పిలుపునకు విశేష స్పందన
- రాత్రి తొమ్మిది గంటలకు ఇంటింటా వెలిగిన దీపాలు
- పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

కరీంనగర్‌లోని తన నివాసంలో వెలిగించిన క్యాండిళ్లతో మంత్రి గంగుల, కుటుంబసభ్యులు

దీపాలతో ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవిశంకర్, వొడితల సతీశ్‌బాబు దంపతులు

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరోనా చీకట్లను పారదోలేందుకు ప్రతి ఇంట్లో దీపాలను వెలిగించాలని ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపునకు ఉమ్మడి జిల్లాలో విశేష స్పందన వచ్చింది. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి 9 నిమిషాలపాటు ప్రజలు ఇంటింటా దీపాలను వెలిగించి ఐక్యతను చాటారు. ఇండ్లల్లో లైట్లు ఆర్పేసి దీపాలు, కొవ్వొత్తులు, టార్చిలైట్లు, మొబైల్ ఫోన్లలోని ఫ్లాష్ లైట్లను వెలిగించారు. ఆలయాల్లో సహస్ర దీపాలంకరణ చేసి, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. కరీంనగరంలో ఎక్కడ చూసినా దీపాలు వెలిగిస్తూ కనిపించారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి తమ నివాసాల్లో దీపారాధన చేశారు. ఎమ్మెల్యేలు కూడా తమ ఇళ్లల్లో దీపాలు వెలిగించారు. లైట్లన్నీ ఒకే సారి నిలిపివేస్తే విద్యుత్తు గ్రిడ్‌లో సమస్యలు ఎదురు కావచ్చని భావించిన అధికారులు 9 నిమిషాల పాటు ఉన్నత స్థాయిలో పర్యవేక్షించారు.

కోటపల్లి: గుడిసె ఎదుట దీపాలతో గిరిజనులు, వేములవాడ ఆలయ ఆవరణలో సిబ్బంది

దీపాలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, కరీంనగర్ జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి దంపతులు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దంపతులు, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, కృష్ణభాస్కర్, కరీంనగర్, రామగుండం సీపీలు కమలాసన్‌రెడ్డి, సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే, మహిళ

పేదలు, కూలీలను ఆదుకోవాలి

- సర్కారు సంకల్పానికి చేయూతనివ్వాలి
- జగ్జీవన్‌రాం జీవితం స్ఫూర్తిదాయకం
- మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నమస్తే తెలంగాణ : దినసరి కూలీలు, వలస కూలీలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలోని మంచిర్యాల చౌరస్తాలోని ఆయన విగ్రహానికి మేయర్ సునీల్‌రావుతో కలిసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ సౌజన్యంతో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో పేదలు, కూలీలకు అన్నదానం చేశారు. ఆ తర్వాత గణేశ్‌నగర్‌లో వ్యాపారవేత్త భద్రు కిమాని ఆధ్వర్యంలో వంద మందికి నిత్యావసరాల సరుకులను, భగత్‌నగర్‌లో 300 మందికి బిర్యానీ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎవరూ ఆకలితో ఉండొద్దన్న ప్రభుత్వ సంకల్పానికి చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయాచోట్ల ఆయనవెంట మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్లు శ్రీనివాస్, స్వప్న, కొలిపాక అంజయ్య, తదితరులు ఉన్నారు.

స్వీయ నియంత్రణతోనే కట్టడి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్ : స్వీయ నియంత్రణతోనే కరోనాను కట్టడి చేయవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పొరండ్లలో టీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 500 మాస్కులను జడ్పీ అధ్యక్షురాలు దావ వసంతతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జగిత్యాల పట్టణంలోని 2వ వార్డు కౌన్సిలర్ బద్దం లత జగన్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. అనంతరం కార్మికుల సేవలకు గానూ జగన్, బోగ రమేశ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.25వేలను అందజేశారు. రాంబజార్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు అల్పాహారం అందజేశారు. ఆ తర్వాత 44వ వార్డుకు చెందిన కోటగిరి భూపతి, 29వ వార్డుకు చెందిన గంగారాజానికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. సారంగాపూర్‌లో పలు గ్రామాలకు చెందిన ఐదుగురికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ₹1,67,500 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ నిబంధనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఎంపీపీ గాజర్ల గంగారాం గౌడ్, వైస్ ఎంపీపీ పాలెపు రాజు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరోనా.. కటింగ్

లాక్‌డౌన్ నేపథ్యంలో అన్నీ మూసివేతే. దుకాణాలు, హోటళ్లే కాదు, హెయిర్ సెలూన్లూ బందే. ఈ నేపథ్యంలో ప్రజలు తమకు తామే కటింగ్, షేవింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోశమ్మవాడకు చెందిన ఇల్లెందుల ప్రవీణ్ తన కొడుకు తుషార్‌కు కటింగ్ చేస్తుండగా, 'నమస్తే' కెమెరా క్లిక్‌మనిపించింది.

- జగిత్యాల, నమస్తే తెలంగాణ

❖ శెభాష్ కనకయ్య..

కరోనా నియంత్రణకు ఒక్కొక్కరు ఒక్కో విధంగా కృషి చేస్తున్నారు. పలువురు పేదలకు అండగా నిలుస్తుంటే.. మరికొందరు ప్రభుత్వానికి బాసటగా ఉంటున్నారు. అందులో భాగంగా సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన దర్జీ కనకయ్య సిరిసిల్లతోపాటు టెక్స్‌టైల్ పార్క్‌లోని పేదలకు పంపిణీ చేసేందుకు వీలుగా మణికంఠ టైలర్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యుల సహకారంతో 3వేల మాస్కులను తయారు చేశారు. వాటిని కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు అందజేయగా, 'శెభాష్ కనకయ్య' అంటూ కృష్ణభాస్కర్ అభినందించారు.

- కలెక్టరేట్

❖ సెప్పినట్టే జేసింది జగ్గవ్వ

దేవునిగుట్టతండాలోని జగ్గి తండాకు చెందిన భూక్యా జగ్గవ్వ చెప్పినట్టు జేసింది. తనకు వచ్చిన రేషన్ బియ్యాన్ని పేదోళ్లకు ఆదివారం పంచేసింది. ఇప్పటికే తన రెండు నెలల ఆసరా పింఛను డబ్బులతో నిత్యావసర సరుకులను తండావాసులకు అందజేసిన విషయం తెలిసిందే. తనకు వచ్చే రేషన్ బియ్యం కూడా లేనోళ్లకు ఇస్తానని ఈ సందర్భంగా ప్రకటించారు. అన్నట్టుగానే తనకు ప్రభుత్వం ద్వారా వచ్చిన బియ్యంలోంచి తాను కొన్ని ఉంచుకుని, అందులో నుంచి 30 కిలోల బియ్యాన్ని తండాలోని పేదోళ్లకు పంపిణీ చేసి తన దయాగుణాన్ని చాటుకున్నది.

- ఎల్లారెడ్డిపేట

అప్రమత్తంగా ఉండండి

- లాక్‌డౌన్ ముగిసే దాకా ఇండ్ల నుంచి బయటకు రాకండి
- పేదలు, కూలీలను ఆదుకునేందుకు ముందుకు రావాలి
- మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ బుగ్గారం/గొల్లపల్లి : లాక్‌డౌన్ ముగిసే దాకా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇండ్ల నుంచి బయటకు రావద్దని రాష్ట్ర మంత్రి కొప్పుల సూచించారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గొల్లపల్లిలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డితో కలిసి ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ధర్మపురి ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లు, లాక్‌డౌన్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. పటిష్టమైన నిర్ణయాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ కరోనా నియంత్రణకు పాటుపడుతున్నారని, వైద్య, పోలీస్, పారిశుధ్య సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారని ప్రశంసించారు. లాక్‌డౌన్‌తో మన వద్ద ఇబ్బంది పడుతున్న కూలీలను, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వలస కూలీలను పెద్ద మనసుతో ఆదుకోవాలని, అందుకు ప్రజాప్రతినిధులు, వర్తక వ్యాపారులు ముందుకు రావాలని కోరారు. మహారాష్ట్రలో ఉన్న ధర్మపురి నియోజకవర్గంలోని వలస కూలీలకు తాను ఒక్కో వ్యక్తికి ₹వెయ్యి చొప్పున బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేశానని తెలిపారు. మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఇతర రాష్ట్రాల్లో ఉన్న వలస కూలీలను ఆదుకునేందుకు ఒక్కొక్కరి ఖాతాలో ₹వెయ్యి జమ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బుగ్గారం మండలంలో 83 మంది గల్ఫ్ నుంచి, 40 మంది ముంబై నుంచి వచ్చారని, వారిని నిత్యం హోం క్వారంటైన్‌లో ఉండేలా చూస్తున్నామని తాసిల్దార్ సుజాత తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని, ఈ కేంద్రాల్లోనే మక్కలు విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయాచోట్ల కార్యక్రమాల్లో ఎంపీపీలు రాజమణి, నక్క శంకరయ్య, జడ్పీటీసీలు రాజేందర్, జలంధర్, విండో అధ్యక్షులు డాక్టర్ రాజసుమన్ రావు, గందె వేణుమాధవ రావు, ఎంపీడీవో తిరుపతి, సీఐ లక్ష్మీబాబు, స్థానిక నాయకులు, అధికారులు ఉన్నారు.

జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొప్పుల

కరీంనగర్ కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డికి చెక్కు అందిస్తున్న కిమ్స్, సహజ విద్యాసంస్థల చైర్మన్, వైస్ చైర్మన్లు డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు, సాకేత్‌రామారావు

సీఎం సహాయనిధికి విరాళాలు ఇచ్చిన వారి వివరాలు

డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు పేర్యాల సాకేత్‌రామారావు	₹2,01,116
ఆది శ్రీదేవి, శ్రీనివాస్ (వైద్యులు)	₹లక్ష
కోరుట్ల ఐఎంఏ సభ్యులు	₹లక్ష
మెట్‌పల్లి ఐఎంఏ సభ్యులు	₹51వేలు
చింతోజు నారాయణ (ఐఎంఏ ముస్తాబాద్ మండలాధ్యక్షుడు)	₹25వేలు
కొమురవెల్లి విష్ణుప్రియ గుప్తా	₹11వేలు

కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న శ్రీదేవి నర్సింగ్ హోం వైద్యురాలు ఆది శ్రీదేవి, శ్రీనివాస్ దంపతులు

ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు చెక్కు ఇస్తున్న ఐఎంఏ సభ్యులు

వలస కార్మికుడికి రూ. 500 నగదు అందిస్తున్న శకుంతల

పారిశుధ్య కార్మికురాలి గొప్ప మనసు

ధర్మారం: లాక్‌డౌన్ నేపథ్యంలో నిరుపేదలు, వలసకూలీల కోసం సర్కారు అనేక చర్యలు తీసుకుంటూ కడుపునింపుతుండగా, తమ వంతు సాయంగా ఉన్నోళ్లు.. లేనోళ్లు.. చిరుద్యోగులు సాయం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసే 12మంది వలస కార్మికులు తమ సొంత రాష్ట్రం మహారాష్ట్రకు వెళ్తూ మార్గమధ్యలో ఆదివారం ధర్మారం మండల కేంద్రానికి వచ్చారు. వారి పరిస్థితిని చూసిన స్థానిక పారిశుధ్య కార్మికురాలు బైన్‌వాల్ శకుంతల (మున్ని) దారి ఖర్చుల కోసం రూ. 500 ఆర్థిక సాయం చేసి గొప్ప మనసును చాటుకుంది.

కోరుట్ల టౌన్: కోరుట్లలో పహారా కాస్తున్న పోలీసులు

రెడ్‌జోన్‌గా కోరుట్ల కొత్త బస్టాండ్ ఏరియా

కోరుట్ల/ కోరుట్ల టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతానికి చెందిన వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. కరోనా వైరస్ కట్టడికి అదనపు కలెక్టర్, డీఎస్పీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు కొత్త బస్టాండ్, భీమునిదుబ్బ, రహ్మత్‌పురా కాలనీలను రెడ్‌జోన్‌గా గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జన సంచారం పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇల్లు దాటి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించినవారిని కొండగట్టు జేఎన్టీయూ క్వారంటైన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. రెడ్ జోన్ పరిధిలోని ప్రజలు నిత్యావసర సరుకుల కోసం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు 1800 425 4346 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కోరుట్ల పట్టణంలోని భీమునిదుబ్బలో ఒకరికి, కల్లూరులో మరొకరికి కరోనా పాజిటివ్ రాగా, ఆయాహోట్ల ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. బాధితులతో ఎవరెవరు సన్నిహితంగా మెలిగారో.. ఆరా తీసి వైద్య పరీక్షలు నిర్వహించారు. కోరుట్లలో డీఎస్పీ గౌస్‌బాబా, సీఐ రాజశేఖర్‌రాజు నేతృత్వంలో కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లకు చెందిన ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. వైద్య సిబ్బందికి సహకారం అందించేందుకు పోలీసులు ర్యాపిడ్ సర్వే చేపట్టారు. కల్లూరులో డాక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో టెస్టులు చేశారు. అదనపు కలెక్టర్ రాజేశం గ్రామాన్ని సందర్శించారు. కరోనాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నీరజ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

కోరుట్ల మండలం కల్లూరులో సర్వే చేస్తున్న వైద్యాధికారులు

❖ హెల్పింగ్ హ్యాండ్స్..

వృద్ధుడిని ఆశ్రమానికి తీసుకెళ్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, సర్పంచ్

అనాథ వృద్ధుడిని జగిత్యాలకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు చేరదీసి వృద్ధాశ్రమంలో చేర్పించి మానత్వాన్ని చాటారు. జగిత్యాల మండలం బాలపెల్లికి చెందిన లింగం (60) భూపతిపూర్‌కు వెళ్లి అక్కడే ఉంటూ స్థానికులు పెడితే తింటూ జీవిస్తున్నాడు. లాక్‌డౌన్ నేపథ్యంలో వృద్ధుడి పరిస్థితి దయనీయంగా మారడంతో సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు సమాచారమిచ్చాడు. వారు వృద్ధుడికి కొత్త బట్టలు తొడిగి హైదరాబాద్‌లోని జార్జ్ అనాథ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డెక్క శ్రవణ్, విజేత యూత్ అధ్యక్షుడు రమేశ్, సురేశ్, వెంకటేశ్, ప్రసాద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. – రాయికల్ రూరల్

❖ పారిశుధ్య కార్మికులూ మీకు సలాం..

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న జడ్పీటీసీ, అఖిల్‌రావు

ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో పారిశుధ్య కార్మికులను జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు సన్మానించారు. కరోనా కట్టడికి వారు చేస్తున్న సేవలను గుర్తించి, తన కొడుకు చీటి అఖిల్‌రావుతో కలిసి శాలువాతో సత్కరించారు. మెడలో కరెన్సీమాల వేసి కార్మికులపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. – ఎల్లారెడ్డిపేట

❖ అన్నార్తులకు అండగా నరేన్ ఫౌండేషన్

పేదలకు భోజనం ప్యాకెట్లను అందిస్తున్న నరేన్ ఫౌండేషన్ సభ్యులు

లాక్‌డౌన్ నేపథ్యంలో సిరిసిల్లతోపాటు పరిసర ప్రాంతాల్లోని పేదలు, వలస కూలీల ఆకలిని నరేన్ ఫౌండేషన్ సభ్యులు తీర్చుతున్నారు. రోజువారీగా భోజనం తయారు చేయించి ప్యాకెట్ల రూపంలో అందిస్తున్నారు. వాట్సప్ గ్రూప్‌ల్లో పేదలు, అన్నార్తుల విషయాన్ని తెలుసుకుని, వారి చెంతకే వెళ్లి ఆహార ప్యాకెట్లను అందిస్తూ తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. జిల్లాలో సహాయం అవసరమున్న వారు 90102 22266 నంబర్‌లో సంప్రదించాలని కోరుతున్నారు. – సిరిసిల్ల రూరల్

తరగని ఔదార్యం..

పేదలు, వలసకార్మికులకు అండగా నిలుస్తున్న దాతలు

చందుర్తి: వలసకూలీలకు అన్నదానం చేస్తున్న ఎస్ఐ సునీల్

కరీంనగర్‌లో అదనపు డీసీపీకి శానిటైజర్లను అందిస్తున్న అశోక్

> లాక్‌డౌన్‌తో ఉపాధిలేక ఇండ్లకే పరిమితమైన పేదలకు దాతలు అండగా నిలుస్తున్నారు. తరగని ప్రేమను చూపుతూ ఔదార్యం చాటుకుంటున్నారు. అభాగ్యులకు చేయూతనిస్తున్నారు. కొందరు నిత్యావసర సరుకులు అందజేస్తుండగా, మరికొందరు అన్నదానం చేస్తూ కడుపునింపుతున్నారు.

కరీంనగర్ జిల్లా..

కార్పొరేషన్/ కరీంనగర్ క్రైం/హెల్త్/ హుజూరాబాద్ టౌన్/సైదాపూర్/తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ/తిమ్మాపూర్ రూరల్/శంకరపట్నం: నగరంలోని అరుంధతినగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్ ఇంటింటికి వెళ్లి కూరగాయలను పంపిణీ చేశారు. శివ మెడికల్ ఏజెన్సీ స్పెయిన్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ పోలీస్ శాఖ కోసం 200 శానిటైజర్ బాటిళ్లను అడిషనల్ డీసీపీ చంద్రమోహన్‌కు అందజేశారు. పీడీ సెల్ ఇన్‌చార్జి పండరి ఉన్నారు. అల్గునూర్ జడ్పీ హైస్కూల్ 2006-07 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు సుమారు 350 పులిహోర, వాటర్, మజ్జిగ ప్యాకెట్లను నగరంలో పోలీస్, పారిశుధ్య సిబ్బంది, పేదలకు పంచారు. హుజూరాబాద్‌లో పలువురు కార్మికులకు 2వ వార్డు కౌన్సిలర్ యాదగిరి నాయక్, టీఆర్ఎస్ నేత ఖాళీద్‌హుస్సేన్ పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ తన కొడుకు మనోజ్‌తో కలిసి వలస కూలీలకు పులిహోర ప్యాకెట్లు అందజేశారు. సైదాపూర్ మండలం వెన్నంపల్లిలో ఆల్‌ఇండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా కార్యదర్శి మొలుగూరి హరికృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు కూరగాయలు, బీజేపీ మండలాధ్యక్షుడు కే శ్రీనివాస్‌రెడ్డి పోలీసులు, విలేకరులకు శానిటైజర్లను అందజేశారు. తిమ్మాపూర్ మండలం పోరండ్లలో పలువురికి ఎంపీటీసీ చింతల రజిత-లక్ష్మారెడ్డి కూరగాయలు పంపిణీ చేశారు. రామకృష్ణకాలనీలో వలస కార్మికులకు బియ్యం, ₹500 చొప్పున నగదు అందజేశారు. సర్పంచ్ మీసాల అంజయ్య 100 కుటుంబాలకు కూరగాయలు, తడి, పొడి చెత్తబుట్టలను అందజేశారు. శంకరపట్నం మండలం తాడికల్‌లో వలస కార్మికులకు బీజేపీ నాయకుడు వడ్లకొండ రాజేందర్ ఆధ్వర్యంలో బియ్యం, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.

జగిత్యాల జిల్లా

జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి, నమస్తే తెలంగాణ/ మెట్‌పల్లి టౌన్/మల్లాపూర్/సారంగాపూర్/మల్యాల/జగిత్యాల టౌన్/పెగడపల్లి/మేడిపల్లి/గొల్లపల్లి/ మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం/రాయికల్: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. చల్‌గల్‌లో వలస కూలీలకు జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఎంపీపీ చేతుల మీదుగా ఆహార పొట్లాలు అందజేశారు. ఐఎంఏ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు గంగసాగర్, వైద్యులు రవి, జాకబ్ కిరణ్, ఆనంద్‌బాబు, విద్యాసాగర్, నిర్మల్‌రెడ్డి, మాధురి, వెంకట్‌రెడ్డి, త్రిలోక్‌కుమార్, రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ₹3 లక్షల విలువ చేసే బియ్యం, పప్పులు, నూనె తదితర వంట సామగ్రిని సుమారు 350 మంది పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. పద్మనాయక వెలమ యువత (ఉప్పరిపేట) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్, కొత్త బస్టాండ్ వద్ద సుమారు 50 మంది నిరాశ్రయులకు అన్నదానం చేశారు. వారిని జడ్పీ సీఈవో శ్రీనివాస్ అభినందించారు. మెట్‌పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు పట్టణంలో 150 మంది పేదలకు అన్నదానం చేశారు. మాస్కులు, శానిటైజర్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, సభ్యులు అందజేశారు. ధర్మపురిలో ఎల్ఎం కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో 100మంది వలసకూలీలకు, యాచకులకు చికెన్ రైస్ ప్యాకెట్లను వారి వద్దకు వెళ్లి అందజేశారు. మెట్‌పల్లిలోని రైల్వేస్టేషన్, కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, డిపో, వేంపేట రోడ్డు తదితర ప్రాంతాల్లోని వలస కార్మికులు, దవాఖానల్లోని రోగులు, వారి సహాయకులకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆర్థికసాయంతో ఆదివారం అన్నదానం చేశారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు చెర్లపల్లి అమర్‌దీప్‌గౌడ్, కో కన్వీనర్ వెల్ముల శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ జావిద్ తదితరులున్నారు. మల్లాపూర్ మండలంలోని వైద్య సిబ్బందికి ఎంపీపీ కాటిపల్లి సరోజన ఆధ్వర్యంలో మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. సారంగాపూర్ మండలంలో వలస కార్మికులకు మండల బీజేపీ నాయకుడు వరుణ్ కుమార్ నిత్యావసరాలు, నగదును పంపిణీ చేశారు. మల్యాలకు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ లక్ష్మీకాంతం వందకు పైగా మాస్కులను సీఐ కోరె కిశోర్, ఎస్ఐ ఉపేంద్రచారికి అందజేశారు. జగిత్యాలలో 330 మందికి సామాజిక కార్యకర్త రేగొండ నరేశ్ ఆహార ప్యాకెట్లను అందించారు. కొడిమ్యాలలో జగన్మాత శంకర్ మల్లన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. పెగడపల్లి మండలం నామాపూర్‌లో కొండం రమణారెడ్డి వంద శానిటైజర్లను అందజేయగా, సర్పంచ్ ఇనుగాండ్ల కరుణాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. మేడిపల్లిలో మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ ఆధ్వర్యంలో వలస కూలీలకు అన్నదానం చేశారు. జగిత్యాలకు చెందిన శ్రీ ఓం సాయి హాస్పిటల్ డాక్టర్లు ఫణీంద్రకుమార్, సాయిసుధ ఆర్థిక సహాయం చేశారు. గొల్లపల్లి మండలం వెనుగుమట్లలో 50మంది పేదలకు బీజేపీ నాయకులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో సుమారు 30 కుటుంబాలకు 6వ వార్డు సభ్యుడు మారు నరేందర్‌రెడ్డి 12కిలోల చొప్పున బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండకు చెందిన పారిశుధ్య సిబ్బంది, ఆశ వర్కర్లకు ₹15వేల నగదును మామిడి సురేశ్‌రెడ్డి పంపిణీ చేశారు. రాయికల్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ యోడపెల్లి నర్సారెడ్డి జన్మదినం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ అధ్యక్షుడు మోర హన్మాండ్లు సమక్షంలో నిత్యావసరాలను అందజేశారు. గొల్లపల్లి మండలం వెనుగుమట్లలో 50మంది పేదలకు బీజేపీ నాయకులు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

సిరిసిల్ల జిల్లా..

వేములవాడ రూరల్/ సిరిసిల్లటౌన్/ చందుర్తి/ కోనరావుపేట/ ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/ సిరిసిల్ల కల్చరల్/ ముస్తాబాద్ : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శివపార్వతి కాలనీలోని 30 కుటుంబాలకు టీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి నిత్యావసర సరుకులను అందజేశారు. సిరిసిల్లకు చెందిన వైద్య దంపతులు డాక్టర్ వాణి-రమణారావు స్థానిక అనంతనగర్‌లో 400 మందికి శానిటైజర్లు, మాస్కులను పంపిణీ చేశారు. చందుర్తి మూడపల్లిలో ప్రముఖ వ్యాపారవేత్త జోగినపల్లి పృథ్వీధర్‌రావు సాయంతో సర్పంచ్ చిలుక అంజిబాబు ప్రతి ఇంటికీ మూడు రకాల కూరగాయలు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. మల్యాలలో వివేకానంద సేవా సమితి, మర్రిగడ్డలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను ఎస్ఐ సునీల్ అందజేశారు. అదేవిధంగా 60 మంది వలస కార్మిక కుటుంబాలకు దాతల సహకారంతో సర్పంచ్ సిరికొండ ప్రేమలత, ఉప సర్పంచ్ తిరుపతితో కలిసి ఎస్ఐ సునీల్ అన్నదానం చేశారు. కోనరావుపేటలో ఉప సర్పంచ్ దండు శ్రీనివాస్, యువకుల ఆధ్వర్యంలో శ్రీ సూర్య ట్రేడర్స్ హార్డ్ వేర్ యాజమాని మంకు మధూకర్‌రెడ్డి నిరుపేద కుటుంబాలకు 25కిలోల బియ్యంతో పాటు ₹వెయ్యి నగదును అందజేశారు. కొలనూర్‌లో పేద కుటుంబాలకు ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, మరిమడ్లలో సర్పంచ్ మాట్ల అశోక్, ఎంపీటీసీ కోనేటి రేఖ బియ్యం నిత్యావసర సరుకులను అందజేశారు. ఎల్లారెడ్డిపేటలో నందికిషన్ ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం అన్నదానం చేశారు. గొల్లపల్లిలో అడ్డగుల్ల మహేశ్ (యూకే ఎన్ఆర్ఐ) 20మందికి, ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య, ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, దాసరి గణేశ్, పాటి దేవయ్య, 40మందికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బీజేపీ నాయకుడు ఆవునూరి రమాకాంత్ బొప్పాపూర్‌లో పేదలకు బియ్యం, నిత్యావసరాలను అందించారు. మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు బొమ్మకంటి రాజయ్య, సభ్యులు ఆంజనేయులు, రాజేశం ఆధ్వర్యంలో పంచాయతీ, పోలీసు సిబ్బందికి శానిటైజర్లు, గ్లౌజులు, మాస్క్‌లను అందించారు. ఇల్లంతకుంటకు చెందిన నిరుపేదలకు సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి వారానికి సరిపడే నిత్యావసరాలను దాతల సహకారంతో అందజేశారు. సిరిసిల్ల పట్టణంలోని కర్త ఫౌండేషన్ పట్టణంలోని 32మంది పోలీసులకు ప్రతి రోజూ ఉదయం టిఫిన్లు, భోజనం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే రాజీవ్‌నగర్, చంద్రంపేటలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న వారికి నిత్యావసర సరుకులను అందిస్తున్నారు.

తిమ్మాపూర్: పొరండ్లలో కూరగాయలు పంపిణీ చేస్తున్న లక్ష్మారెడ్డి

ఎల్లారెడ్డిపేట: గొల్లపల్లిలో పేదలకు సరుకులను పంపిణీ చేస్తున్న దాతలు

మెట్‌పల్లిటౌన్: సరుకులను అందిస్తున్న ఐఎంఏ సభ్యులు

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరీంనగర్‌లో మంత్రులు కొప్పుల, గంగుల, మిగతా చోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, సేవలను కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జగిత్యాల : నివాళులర్పిస్తున్న జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత

కరీంనగర్ జిల్లా..

చొప్పదండి,నమస్తేతెలంగాణ /హుజూరాబాద్‌టౌన్/ జమ్మికుంట/ వీణవంక/తిమ్మాపూర్ రూరల్/టవర్‌సర్కిల్: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మేయర్ సునీల్‌రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ పూలమాల వేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ కూడా నివాళులర్పించారు. చొప్పదండి అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆవరణలో మున్సిపల్ వైస్‌చైర్పర్సన్ గుర్రం నీరజతో కలిసి బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాళులర్పించారు. కరీంనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో జడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ నివాళులర్పించారు. జమ్మికుంట మున్సిపల్, తాసిల్ కార్యాలయాల్లో చైర్మన్ రాజేశ్వర్‌రావు, తాసిల్దార్ నారాయణ, వీణవంక ఎంపీపీ రేణుక జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. హుజూరాబాద్ బల్దియా కార్యాలయంలో చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, తాసిల్ కార్యాలయంలో డీటీ సందీప్ జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

జగిత్యాల జిల్లా..

జగిత్యాల నమస్తే తెలంగాణ/జగిత్యాల రూరల్/పెగడపల్లి/కొడిమ్యాల/మేడిపల్లి: జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జడ్పీ కార్యాలయంలో జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత జగ్జీవన్‌రామ్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మున్సిపల్ అధ్యక్షురాలు బోగ శ్రావణి, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్ తదితరులు పాల్గొన్నారు. కొడిమ్యాలలో తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరి స్వామి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేశారు. మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నివాళులర్పించారు.

సిరిసిల్ల జిల్లా..

కలెక్టరేట్/ సిరిసిల్ల రూరల్/ ఎల్లారెడ్డిపేట/చందుర్తి/ రుద్రంగి/కోనరావుపేట/ వేములవాడ రూరల్/బోయినపల్లి/ముస్తాబాద్: కలెక్టర్ కృష్ణభాస్కర్, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ అంజ య్య, ఎస్పీ కులాల అభివృద్ధి అధికారి రాజేశ్వరి కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళలర్పించారు. తంగళ్లపల్లి ఎంపీపీ మానస, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మధు, ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బోయినపల్లి ఎంపీపీ వేణుగోపాల్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండయ్య, రుద్రంగి జడ్పీటీసీ మీనయ్య, ముస్తాబాద్ ఎంపీపీ శరత్‌రావు, జడ్పీటీసీ నర్సయ్య ఆయా మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు. జగ్జీవన్ రాం చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

నగరం దేదీప్యమానం

లాక్‌డౌన్‌తో నిర్మానుష్యంగా మారిన నగరం ఆదివారం రాత్రి జిగేల్‌మన్నది. ఎటుచూసినా విద్యుద్దీపాల వెలుగులతో సరికొత్తగా కనిపించింది.

జర.. సునోనా..

కరుణాకర్

శ్యాం

ఆర్టీసీ మెకానిక్ కరుణాకర్, కళాకారుడు శ్యాం కరోనాపై వినూత్న పద్ధతిలో అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణచౌక్‌లో వైరస్ వేషధారణలో కరుణాకర్, మంచిర్యాల చౌరస్తాలో యముడి వేషంలో శ్యాం ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు.

- కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి రైతులకు టోకెన్లు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోళ్లకు అధికారయంత్రాగం సన్నద్ధమవుతోంది. 3.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యానికి అనుగుణంగా, రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ఈ సారి 215 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 9నుంచి కొనుగోళ్లు ప్రారంభించేందుకు కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆధ్వర్యంలో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో వారికి టోకెన్లు పంపిణీ చేసి, వాటి ఆధారంగా ధాన్యం సేకరణ ప్రక్రియను క్రమపద్ధతిలో చేపట్టనున్నారు. జిల్లాలోని 13మండలాల్లో 72వేల మంది రైతులకు సోమవారం నుంచి టోకెన్లు పంపిణీ చేయనుండగా, అందుకోసం 150 మంది సిబ్బందిని ఇప్పటికే నియమించారు.

నిరాడంబరంగా చిన్న హనుమాన్ జయంత్యుత్సవాలు

మల్యాల: కొండగట్టులో సోమవారం నుంచి బుధవారం వరకు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలను నిరాడంబరంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లాక్‌డౌన్ అమలులో ఉన్నందున భక్తులకు అనుమతి లేదన్నారు. దీక్షాపరులు తల్లిదండ్రుల చేతుల మీదుగా ఇంట్లోనే మాల విరమణ చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఉచిత కౌన్సెలింగ్

కరీంనగర్‌హెల్త్: కరోనా వైరస్‌పై ప్రజల్లో నెలకొన్న మానసిక ఆందోళన, భయాన్ని తొలగించేందుకుగానూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి ఈ నెల 14 వరకు ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్లు సాగర్ల రఘు, ముస్కు తిరుపతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ల రఘును 6281298690, ముస్కు తిరుపతిరెడ్డిని 7386886909 నెంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

సైదాపూర్: రాంచంద్రాపూర్ పరిధిలోని కురుమపల్లికి చెందిన ఎగ్గడి మల్లికార్జున్ (21) ఆదివారం తన ఇంటి దగ్గర చెట్టును కొడుతున్నాడు. కొమ్మలకు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై పడిపోయాడు. స్థానికులు గమనించి హుజూరాబాద్ దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి మంకయ్య ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్ఐ ప్రశాంతరావు తెలిపారు.

దుకాణాదారుడికి జరిమానా

మారుతీనగర్: మెట్‌పల్లి మండలం వేంపేటలో లాక్ డౌన్ నిబంధనలను ఉల్లంఘించి తెరిచి ఉంచిన కిరాణా దుకాణాదారుడికి అధికారులు నోటీసులు అందించారు. అతడి నుంచి రూ.500 జరిమానా వసూలు చేశారు.

అసభ్యకర పోస్ట్ పెట్టినందుకు కేసు

ధర్మపురి, నమస్తేతెలంగాణ: ధర్మపురికి చెందిన తాహెర్ పాషా ఫేస్‌బుక్‌లో ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా పోస్టు చేశాడు. దీనిపై స్థానికుడు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ వెల్లడించారు.

epaper.ntnews.com

సమైక్య దీప్తి.. భారతీయ స్ఫూర్తి

వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

ఫారం ధర	75.00	రిటైల్ లైవ్	97.00
డ్రెస్‌డ్	141.00	స్కిన్‌లెస్	160.00

గుడ్ల ధరలు (వందకు)

హైదరాబాద్	345.00	వరంగల్	348.00
మెదక్	345.00	కరీంనగర్	348.00
రంగారెడ్డి	345.00	డజన్ ధర	54.00

ఉద్యోగాలకు ముప్పు

ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం

- లాక్‌డౌన్ దెబ్బకు స్తంభించిన పరిశ్రమ
- ఉత్పత్తికి విరామం.. ఆదాయం దూరం
- వ్యయ నియంత్రణపై కంపెనీల దృష్టి
- కోతలు తప్పవంటున్న 52% సంస్థలు
- సీఐఐ సర్వేలో సీఈవోల వెల్లడి

కరోనా.. కరోనా.. కరోనా. ఎక్కడ చూసినా.. ఎవ్వరి నోట విన్నా.. ఈ వైరస్ భయమే. ఆరోగ్యపరంగా, ఆర్థికంగా మానవాళి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నదీ మహమ్మారి. యావత్ ప్రపంచాన్ని తన గుప్పిట బంధించిన కొవిడ్-19 దెబ్బకు భవిష్యత్ కలలన్నీ కల్లలైపోయాయి. స్తంభించిన వ్యాపార, పారిశ్రామిక ప్రపంచం.. ఉద్యోగులను ప్రభావితం చేస్తున్నది. ఈ గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు కొలువుల కోతలే దిక్కని సంస్థలు భావిస్తున్నాయి.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:

మాయదారి కరోనా అన్ని రకాలుగా మనుషుల ఉసురు తీస్తున్నది. వీలైతే బతుకును.. లేకపోతే బతుకుతెరువును మింగేస్తున్నది. కరోనా వైరస్ సృష్టిస్తున్న బీభత్సంతో జన నష్టమే కాదూ.. ఆర్థిక నష్టమూ పెద్ద ఎత్తున వాటిల్లుతున్నది. ముఖ్యంగా భారత్‌కు కరోనా సెగ గట్టిగానే తగులుతున్నది. అసలే ఆర్థిక మందగమనంతో అల్లాడిపోతున్న దేశ ఆర్థికవ్యవస్థను ఈ మహమ్మారి ఏకంగా మాంద్యంలోకి పడేసింది. కరోనా కట్టడి కోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న లాక్‌డౌన్.. ప్రజల ప్రాణాలను నిలబెడుతున్నా.. అన్ని రంగాలను నష్టాల ఊబిలోకి నెట్టింది. దీంతో వ్యయ నియంత్రణపై దృష్టి పెడుతున్న సంస్థలు.. భారీ ఎత్తున ఉద్యోగాలను ఎత్తివేయాలనుకుంటున్నాయి. అవును.. వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ నిర్వహించిన సీఈవోల సర్వేలో ఇదే తేలింది. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా అన్ని రంగాలకు చెందిన సంస్థల్లోని సుమారు 200 మంది సీఈవోలు పాల్గొన్నారు. ఇందులో 52 శాతం మంది లాక్‌డౌన్ తర్వాత ఉద్యోగ కోతలు ఉంటాయన్నారు.

ఈ ఆర్నెళ్లు ఆగమాగం

గతేడాది డిసెంబర్‌లో చైనాలో కరోనా వైరస్ పురుడు పోసుకున్న దగ్గర్నుంచి ప్రపంచానికి యమగండం మొదలైంది. చైనా కష్టాలు నెమ్మదిగా మిగతా దేశాలను ప్రభావితం చేస్తూ వచ్చాయి. ఆ తర్వాత వైరస్ వ్యాప్తీ జరుగుతూ వచ్చింది. దీంతో ఈ ఏడాది మొదలు అన్ని దేశాల్లో కరోనా భయం కనిపించింది. ముఖ్యంగా చైనా లాక్‌డౌన్ దేశీయ ఉత్పాదక రంగాన్ని పెద్ద దెబ్బే కొట్టింది. ఇప్పుడు మన దేశంలో ఉన్న లాక్‌డౌన్ తయారీ రంగ కొన ఊపిరినీ కొండెక్కించేస్తున్నది. జనవరి-మార్చి త్రైమాసికంలో ఆదాయం, లాభాలు పెద్ద ఎత్తునే పడిపోవచ్చన్న అంచనాలున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని మెజారిటీ సీఈవోలు అంటున్నారు. గత నెల ద్వితీయార్ధం నుంచి మొదలైన లాక్‌డౌన్.. ఈ నెల ప్రథమార్ధం వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. అత్యవసర సేవలు మినహా అన్ని సేవలూ మూతబడ్డాయి. అయితే కేసుల సంఖ్య నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో లాక్‌డౌన్ కొనసాగవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. స్తంభించిన వ్యాపార కార్యకలాపాలు మళ్లీ సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుందని అంటున్నారు.

అన్ని రంగాల్లో కోతలు

ప్రస్తుతం అన్ని రంగాలకు కరోనా సెగ తగులుతున్నది. దీంతో లాక్‌డౌన్ తర్వాత దాదాపు మొత్తంగా వ్యయ నియంత్రణ చర్యలు ఉంటాయని తాజా సర్వేలో మెజారిటీ సీఈవోలు సంకేతాలిచ్చారు. అయినప్పటికీ 47 శాతం సీఈవోలు.. ఉద్యోగాల్ని కోల్పోయేవారు 15 శాతం దిగువనే ఉండొచ్చనగా, 32 శాతం సీఈవోలు మాత్రం 15-30 శాతంగా ఉండొచ్చని చెప్తున్నారు. స్థూలంగా దాదాపు 52 శాతం సంస్థలు లాక్‌డౌన్ తర్వాత ఉద్యోగాల తీసివేతలు ఉంటాయని చెప్పేస్తున్నట్లు సీఐఐ తెలిపింది. దీని వల్ల జీడీపీ చాలావరకు తగ్గిపోవచ్చని హెచ్చరించింది. నిరుద్యోగం పెరిగితే మార్కెట్‌లో డిమాండ్ పడకేస్తుందని, ఫలితంగా ఉత్పత్తి కుదేలై మొత్తం ఆర్థికవ్యవస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందన్నది. దీంతో రాబోయే ఉద్యోగ కోతల్ని తేలిగ్గా తీసుకోలేమని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఉద్దీపన ప్యాకేజీలను ఉదారంగా ప్రకటించాలని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ ఈ సందర్భంగా కోరారు. ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్ సైతం నిపుణుల సలహాలతో ముందుకెళ్లాలని సూచిస్తున్నారు.

రూ.1.1 లక్షల కోట్లు వెనక్కి

మార్చిలో ఉపసంహరించుకున్న ఎఫ్‌పీఐలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: కరోనా రక్కసి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తున్నది. దేశవ్యాప్తంగా ఈ వైరస్ విజృంభించడంతో గత నెలలో ఎఫ్‌పీఐలు ఏకంగా లక్ష కోట్లకు పైగా నిధులను ఉపసంహరించుకున్నారు. తాజాగా డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు మార్చిలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.61,793 కోట్ల నిధులను తరలించుకుపోయిన ఎఫ్‌పీఐలు.. బాండ్ మార్కెట్ల నుంచి రూ. 56,211 కోట్లను ఉపసంహరించుకున్నారు. మొత్తం గా రూ.1,18,184 కోట్లను తరలించుకుపోయినట్లు అయింది. సెప్టెంబర్ 2019 నుంచి వరుసగా ఆరు నెలలుగా వేలాది కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు గత నెలలో వెనక్కితీసుకున్నారు. ఒక నెలలో ఇంతటి గరిష్ఠ స్థాయిలో వెనక్కితీసుకోవడం ఇదే తొలిసారి. ప్రస్తుత నెలలో జరిగిన రెండు సెషన్లలోనే రూ.6,735 కోట్ల నిధులను తరలించుకుపోయారు. వీటిలో ఈక్విటీల నుంచి రూ.3,802 కోట్లు, డెబిట్ మార్కెట్ల నుంచి రూ.2,933 కోట్లు. కరోనా వైరస్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుండటంతో ఎఫ్‌పీఐలు నిధుల ఉపసంహరణకు మొగ్గుచూపారని మార్నింగ్ స్టార్ హెడ్ హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు. 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యం కంటే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు మరి అధ్వాన్నంగా ఉన్నాయని, దీంతో గత నెలలో ఎఫ్‌పీఐలు 9.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారని చెప్పారు.

మూడు రోజులే ట్రేడింగ్

నేడు, శుక్రవారాల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈవారంలోనూ ఒత్తిడికి గురికావచ్చునని దలాల్‌స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. కరోనా వైరస్‌తో ఈ ఏడాది భారీగా పతనమైన సూచీలు ఇప్పట్లో కోలుకునే అవకాశాలేమి కనిపించడం లేదు. కరోనా వైరస్ మహమ్మారితో భారత్‌తో పాటు అంతర్జాతీయ దేశాలు అతలాకుతలమవుతుండటంతో ఈక్విటీలు పాతాళంలోకి పడిపోతున్నాయి. ఈవారంలో స్టాక్ మార్కెట్లు మూడు రోజులు మాత్రమే ట్రేడింగ్ జరుగనున్నది. సోమవారం మహావీర్ జయంతి, శుక్రవారం గుడ్‌ఫ్రైడేతో స్టాక్ మార్కెట్లు మూసివేసివుంచనున్నారు. దీంతో ఈవారం మూడు రోజులకు పరిమితంకానున్నది. తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలోనే మదుపరులు పెట్టుబడులు పెట్టాలని, భవిష్యత్తులో అధిక రిటర్నులు రావచ్చునని జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. భారత వృద్ధిపై ఫిచ్ ఆందోళన వ్యక్తంచేయడం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 30 ఏండ్ల కనిష్ఠ స్థాయి 2 శాతానికి పడిపోనున్నట్లు అంచనాను విడుదల చేయడం మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నది. అలాగే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు కూడా కీలకమని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గతవారంలో సెన్సెక్స్ 2,224.64 పాయింట్లు లేదా 7.46 శాతం పతనమైంది. మరోవైపు గతవారంలో స్టాక్ మార్కెట్లు కుదేలుకావడంతో టాప్-10 కంపెనీల్లో ఏడింటి మార్కెట్ క్యాప్ రూ.2.82 లక్షల కోట్లు కోల్పోయాయి. వీటిలో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్‌లు అత్యధికంగా నష్టపోయాయి.

30 రోజుల గడువు

ప్రీమియం చెల్లింపులపై ఐఆర్‌డీఏఐ అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: జీవిత ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం చెల్లింపులకు సంబంధించి పాలసీ హోల్డర్లకు మరో 30 రోజుల గడువు ఇచ్చింది బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ. కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌తో మార్చి, ఏప్రిల్ నెలల్లో రెన్యూవల్ చెల్లింపులకు మాత్రమే ఈ గడువు పెంచినట్లు తాజా నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఇప్పటికే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు, మోటార్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ పాలసీల గడువును ఈ నెల 21వ రకు పెంచిన ని యంత్రణ మండలి తాజాగా జీవిత పాలసీలపై గడువును పెంచింది. లైఫ్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌ల నుంచి వచ్చిన విజ్ఞప్తిల మేరకు నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకున్నది. లాక్‌డౌన్, నిర్ణీత దూరం పాటించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై బీమా రంగ సంస్థలు, కౌన్సిల్లు ఆందోళన వ్యక్తం చేశాయి.

పుట్టిన తేదీ ధ్రువీకరణకు ఆధార్

ఈపీఎఫ్‌వో ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ఇకపై ఆన్‌లైన్ సేవల్లో జనన ధ్రువీకరణగా ఆధార్ కార్డును చూపవచ్చని ఈపీఎఫ్‌వో తమ ఖాతాదారులకు స్పష్టం చేసింది. కరోనా వైరస్ నేపథ్యంలో ఈ వెసులుబాటును కల్పించింది. అన్ని క్షేత్రస్థాయి కార్యాలయాలకూ ఈ మేరకు సూచనలు చేసింది. ఆధార్ కార్డులో పేర్కొన్న పుట్టినతేదీ ఆధారంగా ఈపీఎఫ్‌వో రికార్డుల్లో తమ పుట్టినతేదీలను ఖాతాదారులు సవరించుకోవచ్చని స్పష్టం చేసింది. ఇప్పటికే వైరస్ కష్టాల దృష్ట్యా నగదు ఉపసంహరణకు ఖాతాదారులందరికీ ఈపీఎఫ్‌వో అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.

ఆట

రోహిత్.. ఇంజీలా కనిపించేవాడు

- యువరాజ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ టీమ్‌ఇండియాకు ఎంపికైన తొలినాళ్లలో.. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్‌ల్ హక్‌ను తలపించే వాడని భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు. బంతిని ఎదుర్కునే సమయంలో ఇంజీలాగే.. చాలా నెమ్మదిగా కదిలేవాడని యువీ పేర్కొన్నాడు. 'రోహిత్ టీమ్‌ఇండియాలోకి వచ్చిన కొత్తలో బంతిని ఎదుర్కొనేందుకు చాలా సమయం ఉందనేలా ప్రవర్తించేవాడు. ఇంజమామ్ టైమింగ్ కూడా దాదాపుగా అలాగే ఉండేది. అందుకే తొలి నాళ్లలో రోహిత్‌ను చూస్తే ఇంజీ గుర్తొచ్చేవాడు' అని యువీ తెలిపాడు. ఆరంభంలో జట్టులో చోటు దక్కించుకునేందుకు నానా తంటాలు పడ్డ రోహిత్.. ఆ తర్వాత తన బ్యాటింగ్ విశ్వరూపంతో 'హిట్‌మ్యాన్'గా ఎదిగిన విషయం తెలిసిందే.

డబుల్స్‌కు కొత్త విదేశీ కోచ్!

న్యూఢిల్లీ: కరోనా వైరస్ మహమ్మారి కారణంగా ప్రతిష్ఠాత్మక టోక్యో ఒలింపిక్స్ ఏడాది పాటు వాయిదా పడటంతో.. కొత్త విదేశీ డబుల్స్ కోచ్ వస్తాడని భారత బ్యాడ్మింటన్ ప్లేయర్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి భావిస్తున్నారు. టోక్యో ఒలింపిక్స్ వరకు కాంట్రాక్ట్ ఉన్న ఇండోనేషియా కోచ్ ఫ్లాండీ లింపెల్.. వ్యక్తిగత కారణాలతో ముందుగానే తప్పుకోవడంతో.. ఆ స్థానంలో కొత్త విదేశీ కోచ్ వచ్చే చాన్స్‌లు ఉన్నాయని ఈ జంట పేర్కొంది. 'ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యేందుకు మరో ఏడాది సమయం లభించింది. దీంతో కొత్త విదేశీ కోచ్ వస్తాడని భావిస్తున్నాం. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఒలింపిక్స్ ఈ ఏడాదే జరుగుంటే.. మాకు కేవలం 3 నెలల సమయమే ఉండేది కానీ.. వాయిదా పడటంతో 'బాయ్ ఆ దిశగా ఆడుగులు వేస్తుందనుకుంటున్నాం' అని చిరాగ్ తెలిపాడు. బాయ్ కూడా ఈ అంశంపై సానకూలంగా స్పందించింది. ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు వస్తే.. విదేశీ కోచ్ నియామకంపై నిర్ణయం తీసుకుంటాం అని బాయ్ కార్యదర్శి అజయ్ సింఘానియా తెలిపారు.

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు అతడి ప్రియురాలు జార్జినా రోడ్రిగ్జ్ హెయిర్ కట్ చేసింది. కొవిడ్-19 నేపథ్యంలో ఇంటికే పరిమితమైన సాకర్ స్టార్ ఆదివారం ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు

మేము సైతం అంటూ..

ప్రమిదలు, కొవ్వొత్తులతో కదంతొక్కిన క్రీడాలోకం

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కొవ్వొత్తులు, ప్రమిదలు వెలిగించిన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ దంపతులు, పీవీ సింధు, ద్యుతీచంద్

సత్యవర్త్, సాక్షి మాలిక్

న్యూఢిల్లీ: కరోనా వైరస్ మహమ్మారిపై ప్రత్యక్ష పోరాటం చేస్తున్న అసలుసిసలు హీరోలకు క్రీడాలోకం సెల్యూట్ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కొవిడ్-19పై పోరుకు స్ఫూర్తినిస్తూ.. దేశంలో ఎవరూ ఒంటరిగా లేరనే సందేశాన్ని పంచే సదుద్దేశంలో భాగంగా క్రీడాకారులంతా ఆదివారం రాత్రి 9 గంటల నుంచి 9 గంటల 9 నిమిషాల వరకు ప్రత్యేక దీపాలు వెలిగించారు. ఇండ్లలోని విద్యుత్ దీపాలను ఆపేసి ప్రమిదలు, కొవ్వొత్తులు, టార్చిలైట్లు, మొబైల్ ఫ్లాష్‌లైట్లతో తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ దంపతులు, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్, సురేశ్ రైనా, హర్భజన్ సింగ్, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, విధ్వంసక వీరుడు వీరేంద్ర సెహ్వాగ్, పార్థివ్ పటేల్, టీమ్‌ఇండియా హెడ్ కోచ్ రవిశాస్త్రి, తో పాటు బ్యాడ్మింటన్ స్టార్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, అశ్విని పొన్నప్ప, టెన్నిస్ స్టార్ మహేశ్ భూపతి, ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్, భారత వేగవంతమైన మహిళ దుతీచంద్, స్టార్ రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, యోగేశ్వర్ దత్, టీటీ ప్లేయర్ మనికా బాత్రా, బాక్సర్ అమిత్ పంగల్, పూజా దండా, జోష్నా చినప్ప తదితరులు పాల్గొన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడుతున్న సిబ్బందికి.. మీరు ఒంటరి కాదు.. మీ వెంట యావత్ జాతి ఉందనే సందేశాన్ని పంపారు.

సైనా నెహ్వాల్

యువీ 50 లక్షలు.. భజ్జీ 5 వేల కుటుంబాలు..

విపత్కర పరిస్థితుల్లో దేశం మొత్తం ఏకతాటిపై నిలువాలనే ప్రధాని పిలుపుతో.. కరోనా వైరస్‌పై పోరాడేందుకు క్రీడాకారులు తమ వంతు సాయం అందిస్తున్నారు. కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టేందుకు జరుగుతున్న పోరాటానికి.. భారత మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచ కప్ హీరో యువరాజ్ సింగ్ తన మద్దతు తెలిపాడు. ప్రధాని సహాయ నిధికి రూ. 50 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించాడు. 'కలిసికట్టుగా ఉంటే.. కరోనాపై మరింత బలంగా పోరాడగలం. ప్రధాని పిలుపు మేరకు దీపాలు వెలిగించడంతో పాటు రూ. 50 లక్షలు పీఎం కేర్స్‌కు విరాళంగా ఇస్తున్నా. మీరు కూడా వీలైనంత సాయం చేయండి'అని యువరాజ్ ట్వీట్ చేశాడు. మరోవైపు వెటరన్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. భార్య గీతతో కలిసి తన సొంతనగరమైన జలంధర్‌లో 5 వేల కుటుంబాలకు నిత్యవసర సరుకులు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ముంబైలో ఉంటున్నప్పటికీ తన మనసెప్పుడూ పంజాబ్‌పైనే గుంజుతుందని.. అందుకే స్నేహితుల సాయంతో ఈ కార్యమానికి నడుంబిగించానని భజ్జీ తెలిపాడు.

కుటుంబ సభ్యులతో హర్భజన్

ఐసీఏ అధ్యక్షుడిపై గవాస్కర్ ఫైర్

ముంబై: భారత క్రికెటర్లు తమ జీతాల్లో కోత విధించుకోవాలన్న ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) అధ్యక్షుడు అశోక్ మల్హోత్రాపై క్రికెట్ దిగ్గజం సునిల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'మల్హోత్రా బీసీసీఐకి మంచిచేసేలా ప్రయత్నిస్తున్నాడనే విషయం అర్థమవుతున్నది. అయితే ఆటగాళ్ల జీతాల్లో కోత విధింపులపై మాట్లాడే అధికారం అతడికి ఎక్కడిది అనేదే అసలు ప్రశ్న. ప్రస్తుత టీమ్‌ఇండియా ఆటగాళ్లు, ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లు.. ఐసీఏలో సభ్యులు కాదు. అలాంటప్పుడు వాళ్ల తరపున ఈయన మాట్లాడకూడదు. తన జేబుకు చిల్లు పడనంత కాలం ఇతరుల జీతాల కత్తిరింపులపై ఎవరైనా మాట్లాడగలరు' అని గవాస్కర్ ఓ కాలామ్‌లో రాసుకొచ్చాడు. కాగా ఈ అంశంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని బీసీసీఐ కోశాధికారి అరుణ్ ధుమాల్ పేర్కొన్న విషయం తెలిసిందే.

ఆసియా ఫుట్‌బాల్ కప్ ఆతిథ్యానికి భారత్ బిడ్

న్యూఢిల్లీ: ఆసియా ఫుట్‌బాల్ కప్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్ దాఖలు చేసింది. 2027లో జరుగనున్న మెగాటోర్నీ ఆతిథ్యం కోసం ప్రయత్నిస్తున్నట్లు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) తెలిపింది. కొవిడ్-19 కారణంగా జూన్ 30 వరకు జరుగనున్న అన్నీ టోర్నీలను రద్దు చేసిన ఏఐఎఫ్‌ఎఫ్.. మొదట 2023లో జరుగాల్సి ఉన్న ఆసియా కప్ నిర్వహణ కోసం ఆసక్తి చూపినా.. అనివార్య కారణాల వల్ల రేసు నుంచి తప్పుకుంది. 'ఆసియా కప్ నిర్వహిస్తామనే విషయాన్ని ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ) దృష్టికి తీసుకెళ్లాం. 24 దేశాలు పాల్గొనే ఈ టోర్నీ ఆతిథ్య హక్కులు ఎవరికి దక్కుతాయో వచ్చే ఏడాది తేలుతుంది' అని భారత ఫుట్‌బాల్ సమాఖ్య కార్యదర్శి కౌషల్ దాస్ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 6 ఏప్రిల్ 2020

కరోనా వైరస్ వల్ల పదో తరగతి పరీక్షలు వాయిదాపడ్డాయి. లేకుంటే ఈపాటికే పరీక్షలు అయిపోయి నెక్ట్స్ ఏం చేద్దామా అని ఆలోచించేవారు. కానీ పది పరీక్షలు ఎప్పుడు పెట్టినా.. తర్వాత మాత్రం నెక్ట్స్ ఏంటి అని ఆలోచిస్తుంటారు. అయితే మీరు ఇంజినీరింగ్ చేయాలనుకుంటే మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అవకాశం కల్పిస్తుంది పాలీసెట్ ద్వారా. పదో తరగతి అర్హతతో ఇంజినీరింగ్ డిప్లొమా చేయవచ్చు. దీనికి సంబంధించిన టీఎస్ పాలీసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ వివరాలు నిపుణ పాఠకుల కోసం ప్రత్యేకం.

పాలీసెట్ 2020

పదితో ఇంజినీరింగ్ డిప్లొమా

- హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ తెలంగాణ (ఎస్‌బీటీఈటీ) 2020-21 విద్యా సంవత్సరానికి పాలీసెట్ (పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2020)కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్‌తోపాటు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అందించే అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లోనూ ప్రవేశం పొందవచ్చు.
- **అర్హత:** పదో తరగతి/ తత్సమాన ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** పాలీసెట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా

నోట్: రాష్ట్రంలో పాలిటెక్నిక్ కాలేజీల్లో మూడేండ్లు, మూడున్నరేండ్ల వ్యవధితో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

పరీక్ష విధానం

- ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రశ్నపత్రంలో 150 ప్రశ్నలు, 150 మార్కులు.
- పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- మ్యాథ్స్ 60 ప్రశ్నలు, 60 మార్కులు.
- ఫిజిక్స్ 30 ప్రశ్నలు, 30 మార్కులు.
- కెమిస్ట్రీ 30 ప్రశ్నలు, 30 మార్కులు.
- బయాలజీ 30 ప్రశ్నలు, 30 మార్కులు.

నోట్: పాలిటెక్నిక్ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల అభ్యర్థులు బయాలజీ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడం తప్పనిసరికాదు. వీరికి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో మొత్తం 120 మార్కులకు వచ్చిన స్కోర్ ఆధారంగా ర్యాంకు ప్రకటిస్తారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులకు మాత్రం మ్యాథ్స్ 60/2=30 మార్కులు, ఫిజిక్స్ 30 మార్కులు, కెమిస్ట్రీ 30 మార్కులు, బయాలజీ 30 మార్కులు అంటే మొత్తం 120 మార్కులకు సాధించిన స్కోర్ ఆధారంగా ర్యాంకు ఇస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.400 (ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.250/)
- **చివరితేదీ:** ఏప్రిల్ 17
- **పరీక్షతేదీ:** తర్వాత ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://polycetts.nic.in

గ్రూపులు - ఉపాధి - ఉన్నత విద్య

- **సివిల్ ఇంజినీరింగ్:** సాగునీరు, ప్రజారోగ్యం, రోడ్లు, రైల్వేలు, బిల్డింగ్ సర్వే, డ్రాయింగ్, మంచినీటి సరఫరా తదితర రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. దీంతోపాటు సదరు విభాగాల్లో డ్రాఫ్ట్స్‌మెన్, కాంట్రాక్టర్లుగా స్వయం ఉపాధి పొందవచ్చు.
- **ఉన్నత విద్య:** సివిల్ ఇంజినీరింగ్, సివిల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ స్పెషలైజేషన్లతో బీటెక్ పూర్తి చేయవచ్చు.
- **ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్:** డిజైన్ అండ్ డ్రాయింగ్ విభాగాల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి. ఆర్కిటెక్చర్ డిజైనర్‌గా స్వయం ఉపాధి పొందవచ్చు. మున్సిపల్ కార్యాలయాల్లో లైసెన్స్‌డ్ డిజైనర్‌గా పనిచేయవచ్చు.
- **ఉన్నత విద్య:** బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ చేసుకోవచ్చు.
- **మెకానికల్ ఇంజినీరింగ్:** ప్రభుత్వ అధీకృత సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, ప్రైవేటు వర్క్‌షాపులు, ట్రాన్స్‌పోర్ట్ ప్రొడక్షన్ యూనిట్లు, సేల్స్ తదితర విభాగాల్లో ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయి.
- **ఆటోమొబైల్ ఇంజినీరింగ్:** టీఎస్ఆర్‌టీసీ ఇతర ట్రాన్స్‌పోర్ట్ విభాగాలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. స్వయం ఉపాధి పరంగా ఆటోమొబైల్ సర్వీసింగ్ సెక్టార్ ఆశాజనకంగా ఉంటుంది.
- **ఉన్నత విద్య:** మెకానికల్, ఆటోమొబైల్ స్పెషలైజేషన్లతో డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు బీటెక్‌లో మెకానికల్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఆటోమొబైల్, ఏరోనాటికల్, ఏరోస్పేస్, మెకానికల్ మెరైన్, మెకట్రానిక్స్ స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు.
- **ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్:** టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఇండస్ట్రీస్ మెయింటెన్స్ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రిక్ టెక్నీషియన్, వైరింగ్ కన్సల్టెన్సీ తదితరాల ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చు.
- **ఉన్నత విద్య:** బీటెక్‌లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్పెషలైజేషన్లను ఎంచుకోవచ్చు.
- **ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్:** ఆలిండియా రేడియో, దూరదర్శన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రేడియో, టీవీ సేల్స్ అండ్ సర్వీసింగ్ సెక్టార్‌లో స్వయం ఉపాధి పొందవచ్చు.
- **ఉన్నత విద్య:** బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీమ్యాటిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ అందుబాటులో ఉన్నాయి.
- **ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్:** ప్రాసెస్, ఎలక్ట్రానిక్, ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీల్లో కొలువులు లభిస్తాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల సేల్స్ అండ్ సర్వీసింగ్ సెక్టార్‌లో స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయి.
- **కంప్యూటర్ ఇంజినీరింగ్:** కంప్యూటర్ మెయింటెనెన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, కంప్యూటర్ ట్రెయినింగ్ తదితర విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీసింగ్ సెక్టార్‌లో స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయి.

ఇతర డిప్లొమా కోర్సులు

- మైనింగ్ ఇంజినీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, గార్మెంట్ టెక్నాలజీ, క్రాఫ్ట్ టెక్నాలజీ, హోమ్‌సైన్స్, మెటలర్జికల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, లెదర్ టెక్నాలజీ, పుట్‌వేర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, కెమికల్ ఇంజినీరింగ్ (షుగర్ టెక్నాలజీ/పెట్రోకెమికల్స్/ఆయిల్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్), సిరామిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఫార్మసీ.

నోట్: పాలిటెక్నిక్ కోర్సు చేసినవారు రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈసెట్ రాసి బీటెక్ రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ స్కీం కింద) ప్రవేశం పొందవచ్చు.

- **ఉద్యోగవకాశాలు:** స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌తోపాటు రక్షణ దళాలు, కేంద్ర ప్రభుత్వంలో డిప్లొమా ఇంజినీరింగ్‌తో పడే పోస్టులకు, రాష్ట్రస్థాయిలో ఇరిగేషన్, జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం తదితర శాఖలలో పోస్టులకు పాలిటెక్నిక్ చేసిన వారు అర్హులు.

అగ్రికల్చరల్ పాలిటెక్నిక్

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ) పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో కింది కోర్సులు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ (రెండేండ్లు)
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ (రెండేండ్లు)
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (రెండేండ్లు)

పై కోర్సులు చేసినవారికి..

- **ఉన్నత విద్య:** అగ్రిసెట్ ద్వారా బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సు చేయవచ్చు.
- **ఉపాధి అవకాశాలు:** అగ్రికల్చర్, సీడ్ కంపెనీలు, ఫర్టిలైజర్స్, ఆగ్రో బేస్డ్ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో/ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి.
- **కోర్సు:** డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ (మూడేండ్లు)
- **ఉన్నతవిద్య:** బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజినీరింగ్) తర్వాత పీజీ, పీహెచ్‌డీ చేసుకోవచ్చు.
- **ఉపాధి అవకాశాలు:** అగ్రో బేస్డ్ పరిశ్రమలు, ప్రైవేట్ వర్క్‌షాప్స్, గ్యారేజెస్‌లలో అగ్రికల్చరల్ మెషినరీ తదితర కంపెనీల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి.

నోట్: అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సులకు పాలిటెక్నిక్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా పీజేటీఎస్ఏయూ కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

...✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

వీక్లీ రౌండప్

National

బ్యాంకుల విలీనం పూర్తి

- బ్యాంకుల విలీన ప్రక్రియ మార్చి 31న పూర్తయింది. ఏప్రిల్ 1 నుంచి 10 ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థానంలో నాలుగు బ్యాంకులే ఉంటాయి. ఈ విలీనం తర్వాత దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 12కు చేరింది. దేశంలో అతిపెద్ద బ్యాంక్‌గా ఎస్‌బీఐ ఉండగా.. తర్వాతి స్థానాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంకులు నిలవనున్నాయి.
- అలహాబాద్ బ్యాంక్ ఇండియన్ బ్యాంకులో, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంజాబ్ నేషనల్ బ్యాంకులో, సిండికేట్ బ్యాంక్ కెనరా బ్యాంక్‌లో, ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యాయి.

కరోనా పోరుకు భారత్‌కు అమెరికా సాయం

- కరోనాను ఎదుర్కొనేందుకు భారత్‌కు 2.9 మిలియన్ డాలర్ల సహాయం ఇవ్వనున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ మార్చి 28న ప్రకటించింది. 'కొవిడ్-19 యాక్షన్ ప్లాన్' కింద 64 దేశాలకు అమెరికా 174 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌కు 2.9 మిలియన్ డాలర్లు అందివ్వనున్నది. భారత్‌తోపాటు సార్క్ దేశాలైన నేపాల్, ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు ఈ ఆర్థిక సాయం అందనుంది. శ్రీలంకకు 10.3 లక్షల డాలర్లు, ఆఫ్ఘనిస్థాన్‌కు 50 లక్షల డాలర్లు, బంగ్లాదేశ్‌కు 30.4 లక్షల డాలర్లు, నేపాల్‌కు 10.8 లక్షల డాలర్లు అందుతాయని యూఎస్ తెలిపింది.

కరోనా వైరస్ హాట్‌స్పాట్స్

- దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లో పది కరోనా వైరస్ హాట్‌స్పాట్స్ ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1న ప్రకటించింది. కరోనా వ్యాప్తికి కేంద్ర స్థానాలుగా ఇవి ఉన్నాయని తెలిపింది. అవి.. 1) నిజాముద్దీన్ (ఢిల్లీ), 2) దిల్వాడ్ గార్డెన్ (ఢిల్లీ), 3) భిల్వారా (రాజస్థాన్), 4) నోయిడా (ఉత్తరప్రదేశ్), 5) మీరట్ (ఉత్తరప్రదేశ్), 6) అహ్మదాబాద్ (గుజరాత్), 7) ముంబై (మహారాష్ట్ర), 8) పుణె (మహారాష్ట్ర), 9) కాసర్‌గోడ్ (కేరళ), 10 పతనంతిట్ట (కేరళ).

కరోనా నుంచి రక్షణకు బయోసూట్

- కరోనా బాధితులకు చికిత్స అందించే వైద్యులు, ఇతర సిబ్బంది కరోనా వైరస్ బారినపడకుండా ఉండేందుకు వినూత్న బయోసూట్‌ను రూపొందించినట్లు డీఆర్‌డీవో ఏప్రిల్ 2న తెలిపింది. పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) సూట్‌ను వివిధ డీఆర్‌డీవో ల్యాబొరేటరీలకు చెందిన సైంటిస్టులు, టెక్స్‌టైల్, కోటింగ్, నానో టెక్నాలజీ తదితర సాంకేతికతను పరిశీలించి వినూత్నమైన కోటింగ్ ద్వారా ఈ సూట్ తయారుచేశారు. కుసుంఘర్ ఇండస్ట్రీస్ అనే సంస్థ ముడి సరుకు సహా కోటింగ్ మెటీరియల్ ఉత్పత్తి చేయడమే కాకుండా, పూర్తి సూట్‌ను కూడా తయారుచేస్తున్నట్టు వెల్లడించింది.

ఆరోగ్య సేతు యాప్

- కరోనా వైరస్ సోకే ముప్పును అంచనా వేసుకోవడంలో ప్రజలకు సహకరించేందుకు, కరోనా సోకిన రోగికి దగ్గరగా వచ్చిన సందర్భంలో అధికారులను అప్రమత్తం చేసే 'ఆరోగ్య సేతు' మొబైల్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 2న ప్రారంభించింది. ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ యాప్ వైరస్ బారిన పడినవారు మన దగ్గరికి సమీపిస్తే మనల్ని హెచ్చరిస్తుంది. ఈ యాప్ ప్రస్తుతం 11 భాషల్లో అందుబాటులో ఉంది. కరోనా వైరస్ బారిన పడే ముప్పు తమకు ఎంత ఉందనే విషయాన్ని దీనిద్వారా ప్రజలు తెలుసుకోవచ్చు. ఇతరులతో కలిసే సందర్భాలను బట్టి వారు వైరస్ బారినపడే ముప్పును యాప్ గణిస్తుంది. అత్యాధునిక బ్లూటూత్ టెక్నాలజీ, అల్గరిథమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మేధల ఆధారంగా ఇది పనిచేస్తుంది.

మహా కవచ్ యాప్

- మహారాష్ట్రలో కరోనా వైరస్ సోకి క్వారంటైన్‌లో ఉన్న రోగులను గుర్తించేందుకు మహా కవచ్ యాప్‌ను ఆ రాష్ట్ర సర్కారు ఏప్రిల్ 1న ఆవిష్కరించింది. జాతీయ ఆరోగ్య సంస్థ, నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్, డిజిటల్ ఇంపాక్ట్ స్క్వేర్ సంస్థలు కలిసి ఈ యాప్‌ను రూపొందించాయి. కరోనా లక్షణాలున్న, విదేశాల నుంచి వచ్చినవారికి 24 రోజుల హోమ్ క్వారంటైన్‌లో ఉన్నవారిని గుర్తించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

International

మీడియాకు ఫేస్‌బుక్ విరాళం

- కరోనా వైరస్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థికంగా దెబ్బతిన్న మీడియా సంస్థలకు తోడ్పాటునందించేందుకు 10 కోట్ల డాలర్లను విరాళంగా ఇవ్వనున్నట్లు ఫేస్‌బుక్ మార్చి 30న తెలిపింది. ఫేస్‌బుక్ జర్నలిజం ప్రాజెక్టు ద్వారా స్థానిక మీడియా సంస్థలకు 2.5 కోట్ల డాలర్ల అత్యవసర గ్రాంట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. డబ్బును వార్తాసంస్థలకు బదలాయించే అదనపు మార్కెటింగ్ కసరత్తు కింద 7.5 కోట్ల డాలర్లను ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

అడవి జంతువుల మాంసం నిషేధం

- భవిష్యత్తులో కరోనా వైరస్ వ్యాపించకుండా నిరోధించే ప్రయత్నంలో భాగంగా చైనాలోని షెన్‌జెన్ నగరం కుక్కలు, పిల్లులు, బల్లులు, పాములు సహా ఇతర అడవి జంతువుల మాంసంపై శాశ్వత నిషేధం విధిస్తున్నట్లు షెన్‌జెన్ అధికార వర్గాలు ఏప్రిల్ 2న ప్రకటించాయి. మే 1 నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుందని షెన్‌జెన్ నగర అధికారులు వెల్లడించారు. 'ఆధునిక సమాజానికి సార్వత్రిక నాగరికత అవసరం' అని ప్రకటించారు. 2019, డిసెంబర్‌లో మొదటగా గుర్తించిన కరోనా వైరస్ వుహాన్ జంతు వధశాల కేంద్రంగా వ్యాపించిందనే వాదనలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో షెన్‌జెన్ నగరం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా కుక్క మాంసం వ్యాపారం జరిగే చైనాలోని నగరాల్లో షెన్‌జెన్ ఐదో అతిపెద్ద నగరం. 12.5 మిలియన్ల జనాభా ఇక్కడ నివసిస్తుంది. తైవాన్, హాంకాంగ్ దేశాల్లోనూ వీటి మాంసం విక్రయాలను నిషేధించిన సంగతి తెలిసిందే.

వుహాన్ పేరుతో ఉపగ్రహం

- రోదసి ఆధారిత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)' ప్రాజెక్ట్ కోసం చైనా రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనున్నది. ఈ రెండు ఉపగ్రహాల్లో ఒక ఉపగ్రహానికి వుహాన్‌గా పేరుపెట్టినట్లు చైనా అధికార వార్తా సంస్థ షిన్హువా ఏప్రిల్ 3న తెలిపింది. క్వాయిజౌ-1ఏ అనే రాకెట్ ద్వారా ఈ రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనున్నారు. వుహాన్‌లో చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ (సీఏఎస్ఐసీ)కి చెందిన సంజియాంగ్ సంస్థ ఉంది. కరోనా వైరస్ భయం ఉన్నప్పటికీ ఇక్కడి సిబ్బంది ఉపగ్రహాన్ని రూపొందించారు. అందుకే దానికి వుహాన్ అని పేరుపెట్టారు. జింగ్‌యున్ ఇంజినీరింగ్ ప్రాజెక్టులో భాగంగా భూమికి దిగువ కక్ష్యలో ప్రవేశపెట్టే మొత్తం 80 ఉపగ్రహాల్లో ఇవి మొదటివి. సముద్రాలు, అడవులు, ఇంజినీరింగ్ యంత్రాల కమ్యూనికేషన్ల కోసం ఈ ఉపగ్రహాలను రూపొందించారు.

Persons

బేణీప్రసాద్ మృతి

- కేంద్ర మాజీ మంత్రి, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు బేణీ ప్రసాద్ వర్మ మార్చి 27న మరణించారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో 1941, ఫిబ్రవరి 11న జన్మించిన ఆయన 1996-98 కాలంలో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మంత్రివర్గంలో టెలికాం మంత్రిగా పనిచేశారు. 2011, జనవరి 11 నుంచి 2014, మే 26 వరకు ఉక్కు శాఖ మంత్రిగా పనిచేశారు.

స్పెయిన్ యువరాణి మృతి

- కరోనా వైరస్ బారినపడి స్పెయిన్ యువరాణి మారియా థెరిసా మార్చి 26న మరణించారు. సోషియాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆమె స్పెయిన్ రాజు ఫెలిపె-6కు సోదరి. 1933, జూలై 28న జన్మించిన ఆమె ఫ్రాన్స్‌లో చదువుకుని సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించారు. ఆమెను రెడ్ ప్రిన్సెస్ అని పిలుస్తారు.

కరోనా లక్షణాలతో గీత మృతి

- ప్రపంచ ప్రఖ్యాత వైరాలజిస్ట్, భారతీయ సంతతి సైంటిస్ట్ గీతా రామ్‌జీ కరోనా దక్షిణాఫ్రికాలో ఏప్రిల్ 1న మరణించారు. ఈ విషయాన్ని దక్షిణాఫ్రికా వైద్య పరిశోధక మండలి (ఎస్ఏఎంఆర్‌సీ) అధ్యక్షురాలు, సీఈవో గ్లెండా గ్రే తెలిపారు. లండన్ నుంచి తిరిగివచ్చిన గీత కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో మరణించిందని పేర్కొన్నారు. గీత దక్షిణాఫ్రికా క్లినికల్ ట్రయల్స్ నిరోధక పరిశోధక సంస్థ విభాగం డైరెక్టర్‌గా డర్బన్‌లో సేవలందించారు. హెచ్ఐవీతో ఇబ్బందులు పడుతున్న మహిళల ఆరోగ్యం కోసం పలు పరిశోధనలు చేశారు. ఇందుకు యూరోపియన్ డెవలప్‌మెంట్ క్లినికల్ ట్రయల్స్ పార్ట్‌నర్‌షిప్స్ సంస్థ గీతకు అత్యంత ప్రతిభగల మహిళా శాస్త్రవేత్త అవార్డును ప్రదానం చేసింది.

కరోనాతో ఆడమ్ ప్లెసింగర్ మృతి

- ప్రముఖ పాటల రచయిత, గాయకుడు, గ్రామీ, ఎమ్మీ అవార్డు గ్రహీత ఆడమ్ ప్లెసింగర్ కరోనా సోకడంతో ఏప్రిల్ 1న మరణించారు. న్యూయార్క్‌లో 1961, అక్టోబర్ 31న జన్మించిన ఆయన 1995లో ఫౌంటెయిన్స్ ఆఫ్ వేస్ అనే రాక్ బ్యాండ్‌ను స్థాపించారు. హాంక్స్ చిత్రం 'దట్ థింగ్ యూ డూ' చిత్రానికి పాటల రచయితగా పనిచేశారు. ఈ చిత్రం ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు ఎంపికయ్యింది. ఆడమ్ గోల్డెన్ గ్లోబ్ అవార్డుతోపాటు అన్ని ప్రధాన అవార్డులను అందుకున్నారు. 2009లో ఏ కోల్బర్ట్ క్రిస్మస్‌కు ఆడమ్‌కు గ్రామీ అవార్డు లభించింది.

Telangana

231 శాతానికి చేరిన వరి సాగు

- తెలంగాణ చరిత్రలో ఎన్నడూలేనంత అత్యధిక స్థాయిలో ప్రస్తుత రబీలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 16.89 లక్షల ఎకరాలకుగాను 231 శాతం పెరిగి 39.06 లక్షల ఎకరాలకు చేరింది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 3.72 లక్షల ఎకరాలు కాగా 6.11 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. ఇతర పంటలతో కలిసి రాష్ట్ర సాగు విస్తీర్ణం సాధారణంగా 31.58 లక్షల ఎకరాలు కాగా 69 శాతం (53.36 లక్షల ఎకరాలు) అదనంగా పెరిగిందని వ్యవసాయ శాఖ ఏప్రిల్ 1న వెల్లడించిన నివేదికలో పేర్కొంది.

ఫోర్బ్స్ జాబితాలో మనవాళ్లు

- ఫోర్బ్స్ పత్రిక ఏప్రిల్ 2న ప్రకటించిన '30 అండర్ 30 ఆసియా 30-2020' జాబితాలో హైదరాబాద్‌కు చెందినవారికి స్థానం లభించింది. దీనిలో చోటు సంపాదించిన మనవాళ్లు..
- దోమల నివారణకు చెరువులు, కుంటల్లో క్రిమిసంహారకాలను వెదజల్లే డ్రోన్లను ఉత్పత్తిచేసే మారుత్ డ్రోన్‌టెక్ సంస్థను ప్రారంభించిన ప్రేమ్‌కుమార్, విస్లావత్, సూరజ్ పెద్ది, సాయికుమార్.
- స్పేస్ రాకెట్లను తయారుచేసే మొదటి ప్రైవేట్ సంస్థగా దేశంలో గుర్తింపు పొందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్ చందన.
- కార్లపై ప్రకటనలు కనిపించే విధంగా స్క్రీన్లను రూపొందించిన సంస్థ యాడ్ ఆన్‌మోను ప్రారంభించిన సందీప్ భూమిరెడ్డి, స్రవంత్.
- అందుబాటు ధరలో మిల్క్‌షేక్‌లను అందించేందుకు థిక్‌షేక్ సంస్థను సోదరుడితో కలిసి ప్రారంభించిన అశ్విన్ మోచర్ల.
- నీటిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలను ఆధారంగా చేసుకొని, పంటలను పండించే విధానాన్ని రూపొందించిన అర్బన్ కిసాన్ సంస్థను సహ వ్యవస్థాపకుడిగా ప్రారంభించిన విహారి కనుకొల్లు.
- ప్రపంచవ్యాప్తంగా 10 రంగాల్లో తమ సత్తాను చాటి లీడర్లు, యువ పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన 300 మందికి ఈ జాబితాలో చోటు లభించింది.

Sports

వలంటీర్‌గా హీథర్ నైట్

- ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హీథర్ నైట్ ఆ దేశ జాతీయ ఆరోగ్య సేవా సంస్థ (ఎన్‌హెచ్ఎస్)లో వలంటీర్‌గా సేవలందించేందుకు మార్చి 29న తన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నది. యూకేలో కరోనా వైరస్‌ను అరికట్టేందుకు కృషిచేస్తున్న వైద్య వ్యవస్థకు తన సహాయాన్ని అందించనున్నట్లు ఆమె పేర్కొంది.

ఒలింపిక్ గేమ్స్ కొత్త తేదీలు

- 2021లో టోక్యో ఒలింపిక్ గేమ్స్‌ను నిర్వహించనున్నట్లు, వాటి కొత్త తేదీలను ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) మార్చి 30న ప్రకటించింది. 2021లో జూలై 23 నుంచి ఆగస్టు 8 వరకు ఈ గేమ్స్ జరుపుతామని టోక్యో-2020 ఒలింపిక్స్ చీఫ్ యోరో మొరి తెలిపారు. అంతేకాకుండా సమ్మర్ పారాలింపిక్స్‌ను 2021, ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 5 వరకు నిర్వహించనున్నట్లు ఐఓసీ తెలిపింది.

డీఎల్ఎస్ లూయిస్ మృతి

- అంతర్జాతీయ క్రికెట్‌కు 'డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్ఎస్)'ని ప్రవేశపెట్టిన ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ టోని లూయిస్ ఏప్రిల్ 1న మరణించారు. 1997లో ఫ్రాంక్ డక్‌వర్త్‌తో కలిసి టోని లూయిస్ ఈ పద్ధతిని ప్రతిపాదించారు. 1999లో అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ విధానాన్ని అధికారికంగా అమల్లోకి తెచ్చింది. ఈ పద్ధతికి ఆస్ట్రేలియన్ ప్రొఫెసర్ స్టీవెన్ స్టెర్న్ మెరుగులు దిద్దడంతో అతని పేరు కూడా కలిసి 2014 నుంచి డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ (డీఎల్ఎస్)గా వ్యవహరిస్తున్నారు. యూకేలోని స్వాన్‌సీలో 1938, జూలై 6న జన్మించిన లూయిస్ ఇంగ్లండ్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా, మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) అధ్యక్షుడిగా సేవలందించారు. లూయిస్ సాగించిన శోధనలకు, సాధించిన ఆవిష్కరణలకు గుర్తింపుగా ఇంగ్లండ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక మెంబర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటిష్ ఎంపైర్ (ఎంబీఈ) పురస్కారంతో సత్కరించింది.

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ రద్దు

- కరోనా కారణంగా 2020లో జరుగనున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌ను రద్దుచేస్తున్నట్లు ఆల్ ఇంగ్లండ్ లాన్‌టెన్నిస్